అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 02-4-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 92
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50


కళంకితులకు వెల్‌కం

కమలదళంలో చేరితే పునీతం.. అటకెక్కుతున్న కేసులు



- చేరగానే పార్టీ టిక్కెట్లు... స్టార్ క్యాంపెయినర్ హోదాలు

అజిత్ పవార్, అశోక్ చవాన్, నవీన్ జిందాల్, గీతా కోడా...వీరందరూ నిన్న మొన్నటి వరకూ ప్రతిపక్ష నేతలు. ఇప్పుడు కమలనాథులు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణలు, కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు ఎదుర్కొన్న వారందరూ బీజేపీ పంచన చేరగానే పునీతులై పోయారు. కళంకిత నేతలకు బీజేపీ 'వాషింగ్ మెషిన్'గా తయారైందని ప్రతిపక్షాలు తరచూ ఆరోపిస్తూనే ఉన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నుండి తప్పించుకోవడానికి వీరందరూ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇటీవలే ఎన్సీపీ (అజిత్ పవార్) నేత ప్రఫుల్ పటేల్‌పై ఉన్న అవినీతి కేసును సీబీఐ మూసేసింది. అక్రమ మైనింగ్ కుంభకోణంలో నిందితుడైన గాలి జనార్ధన రెడ్డి కమలదళంలో చేరిపోయారు. రేపో మాపో ఆయన కూడా సచ్చీలుడుగా బయటకు వస్తారు.



న్యూఢిల్లీ : కళంకిత నేతలను మీ పార్టీలో ఎందుకు చేర్చుకుంటున్నారని రెండు రోజుల క్రితం ఓ పాత్రికేయుడు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించగా 'పార్టీ తలుపులు తెరిచే ఉంటాయి. అందరినీ ఆహ్వానిస్తాం' అని బదులిచ్చారు. అనేక కేసులు ఉన్న వారిని కూడా మీ పార్టీ ఆహ్వానిస్తుందా అని ప్రశ్నిస్తే పార్టీ అందరికీ స్వాగతం పలుకుతోందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్లు, స్టార్ క్యాంపెయినర్ హోదా పొందిన కొందరు కళంకిత నేతల వివరాలు పరిశీలిస్తే...

అజిత్‌పై కేసును మూసేశారు

ప్రధాని నరేంద్ర మోడీ ఒకప్పుడు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని 'నేచురల్లీ కరప్ట్ పార్టీ' అని అభివర్ణించారు. అయితే ఆ పార్టీని చీల్చి, కొందరు ఎమ్మెల్యేలను వెంటబెట్టుకొని బీజేపీలో చేరిన అజిత్ పవార్‌కు లోక్‌సభ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ హోదా కట్టబెట్టారు. పవార్‌పై రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో పలు దర్యాప్తు సంస్థలు అనేక కేసులు నమోదు చేశాయి. వీటిలో సహకార బ్యాంక్ కేసు, రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్ట్ కేసు సుమారు దశాబ్ద కాలంగా నలుగుతున్నాయి. ఎన్సీపీపై తిరుగుబాటు చేసిన అజిత్ పవార్ ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, బీజేపీతో ఆయన అలా చేతులు కలిపారు. కేసులిలా మాయమైపోయాయి. మహారాష్ట్ర సహకార బ్యాంకులో జరిగిన పాతిక వేల కోట్ల రూపాయల కుంభకోణానికి సంబంధించి అజిత్ పవార్‌పై పెట్టిన కేసును ఈ నెల ప్రారంభంలోనే ముంబయి పోలీసులకు చెందిన ఆర్థిక నేరాల విభాగం మూసేసింది.

'బొగ్గు' మరక అంటినా...

కాంగ్రెస్ మాజీ ఎంపీ, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ హర్యానాలోని కురుక్షేత్ర లోక్‌సభ స్థానం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన గత వారమే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బొగ్గు గనుల కేటాయింపులో జరిగిన అవకతవకలకు సంబంధించి జిందాల్‌పై సీబీఐ, ఈడీ మూడు కేసులు పెట్టాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై గత నెలలో పార్లమెంటు ముందు ఉంచిన శ్వేతపత్రంలో ప్రభుత్వం బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని కూడా ప్రస్తావించింది. గనులను ...13లో

స్టార్ క్యాంపెయినర్‌గా 'ఆదర్శ్' చవాన్

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత అశోక్ చవాన్ ఫిబ్రవరిలో బీజేపీలో చేరారు. అశోక్‌పై కూడా మోడీ గతంలో పలు అవినీతి ఆరోపణలు చేశారు. 'ఆదర్శ్' కుంభకోణంలో నిందితుడైన చవాన్‌కు కాంగ్రెస్ సిగ్గు లేకుండా టిక్కెట్ ఇచ్చిందంటూ 2014 మార్చిలో మోడీ ధ్వజమెత్తారు. చవాన్ 'ఆదర్శ' అభ్యర్థి అంటూ ఎద్దేవా చేశారు. ఇప్పుడు అదే చవాన్‌ను బీజేపీ అక్కున చేర్చుకుంది. ఆదర్శ్ సహకార హౌసింగ్ సొసైటీ పేరిట వెలసిన 31 అంతస్తుల భవనంలో అశోక్ చవాన్, ఆయన కుటుంబ సభ్యులు ప్రధాన లబ్దిదారులన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఈ భవనాన్ని కార్గిల్ యుద్ధ వీరులు, యుద్ధంలో మరణించిన సైనికుల భార్యల కోసం నిర్మించారు. అయితే ఈ భవనంలో చవాన్, ఆయన కుటుంబ సభ్యులు అక్రమంగా ఫ్లాట్లు పొందారని ఈడీ తదితర సంస్థలు అభియోగాలు మోపాయి. ఆయన బీజేపీలో చేరగానే . రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పుడాయన బీజేపీ స్టార్ క్యాంపెయినర్.

తీహార్ జైల్‌కు అరవింద్ కేజ్రీవాల్

15 రోజులు జ్యుడీషియల్ రిమాండ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లిక్కర్ స్కాంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను తీహార్ జైల్‌కు తరలించారు. ఈ కేసులో మార్చి 21న ఈడీ ఆయనను అరెస్టు చేయగా, అప్పటి నుంచి వారి కస్టడీలోనే ఉన్నారు. సోమవారం ఈడీ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో కేజ్రీవాల్‌ను హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఆయనకు 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజా ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆయనను తీహార్ జైలుకు తరలించారు. ఆయన ఏప్రిల్ 15 వరకూ జైలులోనే ఉంటారు. కోర్టుకు తీసుకువస్తున్న సమయంలో రిపోర్టర్లు కేజ్రీవాల్‌ని ప్రశ్నించగా ప్రధాని మోడీ దేశానికి మంచి చేయటం లేదని అన్నారు.

కోర్టుకు కేజ్రీవాల్ ఐదు అభ్యర్థనలు

అరవింద్ కేజ్రీవాల్ న్యాయవాదులు కోర్టులో ప్రత్యేక అప్లికేషన్ దాఖలు చేశారు. మూడు పుస్తకాలు, మందులు, ప్రత్యేక ఆహారం ఇలా మొత్తం ఐదు అభ్యర్థనలను కోర్టు ముందు ఉంచారు. భగవద్గీత, రామాయణం, హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్ అన్న పుస్తకాలను కేజ్రీవాల్ చదువుకుంటారని ఆయన తరపున న్యాయవాదులు కోర్టును కోరారు. ఆయన ఆరోగ్యం దృష్ట్యా.. ప్రత్యేక డైట్ అందించాలని, జైల్లోకి మందులు అనుమతించాలని తెలిపారు. జైల్లో మతపరమైన లాకెట్ ధరించేందుకు అనుమతితో పాటు ఒక కుర్చీ, టేబుల్ అనుమతించాలని కోర్టును అభ్యర్థించారు. ఈ మేరకు కేజ్రీ తరఫున న్యాయవాదులు కోర్టులో దరఖాస్తు చేశారు.

జైల్ నెంబర్-2లో కేజ్రీవాల్

కస్టడీ గడువు వరకూ ...13లో



నల్లగొండ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

కరెంట్ కోతల్లేవని రైతుల ముందు అనగలరా..?

మంత్రులను ప్రశ్నించిన కేటీఆర్

- ప్రభుత్వ అసమర్థత వల్లే కరువు
- ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలి
- ముషంపల్లిలో పంట పొలాల పరిశీలన

నవతెలంగాణ - నల్లగొండ టౌన్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే కరువు ఏర్పడింది.. కరెంట్ కోతల్లేవని రైతుల ముందు అనగలరా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు మంత్రులను ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్‌లో సోమవారం బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశం లో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన ...13లో

తాగు.. సాగు నీరే ఆయుధాలు..

- లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ అస్త్రాలివే...
- కరెంటు కష్టాలు కలిసొస్తాయనే విశ్వాసం
- జిల్లాల వారీగా పర్యటించనున్న కేసీఆర్
- ఐదున కరీంనగర్ జిల్లాలో పంటల పరిశీలన

వివరాలు 13లో..

కాంగ్రెస్‌కు ఊరట

- పార్టీపై బలవంతపు చర్యలుండవు
- సుప్రీంకోర్టుకు ఐటీ విభాగం వెల్లడి
- తదుపరి విచారణ జులై 24కు వాయిదా

వివరాలు 3లో

ఎన్నికలపై ఏ'ఐ'

- ఓటర్లను ప్రభావితం చేయనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- సాంకేతికతను విస్తృతంగా వాడుకుంటున్న పార్టీలు

వివరాలు 3లో

నార్సింగిలో రెచ్చిపోయిన పోకిరి ముఠా

- యువతి పట్ల అసభ్యకర ప్రవర్తన
- ప్రశ్నించినందుకు తల్లిదండ్రులపై కత్తులతో దాడి
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- నిందితుల అరెస్టు, రిమాండ్

వివరాలు 3లో

కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలే

ఆయనది చిల్లర ప్రచారం

- యాదాద్రి పవర్ ప్లాంట్ పర్యావరణ అనుమతులను ఎన్జీటీ రద్దు చేసింది
- కానీ కేసీఆర్ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు
- తెలంగాణ ప్రజలపై మోయలేని భారం : డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావు చెప్పేవన్నీ కట్టు కథలేనని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క విమర్శించారు. తెలంగాణ ప్రజలపై ఆయన మోయలేని భారం వేశారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు భారీగా కాంగ్రెస్‌లో చేరుతుంటే ఆయన తట్టుకోలేపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటల్లో కొంచెమైనా వాస్తవాలు లేవన్నారు. పదేండ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఇంతలా దిగజారుతారా? అని ప్రశ్నించారు. సోమవారం నాడిక్కడ ఏఐసీసీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలేనని అన్నారు. కట్టుకథలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నించారని మండిపడ్డారు. మైక్ సమస్య వస్తే.. కరెంట్ కోతలు అంటూ అబద్దాలు మాట్లాడారని విమర్శించారు. జనరేటర్ పవర్‌తో కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టి మధ్యలో కరెంట్ పోయిందని చిల్లర ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బొగ్గు లభించే ప్రాంతానికి 350 కిలో మీటర్ల దూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ పెట్టారని, దూరంగా ఉండటం వల్ల థర్మల్ ప్లాంటుకు బొగ్గు సరఫరా కోసం భారీగా ఖర్చువుతోందని అన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పర్యావరణ అనుమతులను ఎన్జీటీ రద్దు చేసినా కేసీఆర్ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇంగిత జ్ఞానం లేకుండా ప్రజలను కేసీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు వేల మెగావాట్ల పవర్ ...6లో

వరంగల్‌కు కడియం కావ్య ఖరారు

- తేలని ఖమ్మం సీటు
- మరో మూడు స్థానాలు పెండింగ్‌లోనే

న్యూఢిల్లీ: తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో 12 నుంచి 15 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహ రచన చేస్తున్న కాంగ్రెస్.. తాజాగా మరో అభ్యర్థిని ప్రకటించింది. ఎవరూ ఊహించని రీతిలో ఈ అభ్యర్థి ప్రకటన ఉండటం సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది... వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య పేరు ఖరారు చేస్తూ కాంగ్రెస్ హైకమాండ్ అధికారికంగా ప్రకటించింది. మరో మూడు స్థానాలైన ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలను పెండింగ్‌లోనే పెట్టింది. పోటీ ఎక్కువగా ఉండటంతో ఈ మూడు స్థానాలపై చర్చోపచర్చలు జరిపినా..ఇంకా తేలకపోవటంతో పక్కన బెట్టింది.

రిలయన్స్ డిజిటల్ స్టోర్ అడ్డాగా మోసాలు

టార్గెట్ల కోసం కొందరు ఉద్యోగుల అడ్డదారులు

- బ్రోకర్లతో కుమ్మక్కు
- వస్తువులకు బదులు నగదు ఇస్తామంటూ ఘరానా మోసాలు
- ఒకరిద్దరికి డబ్బులు వేసి నమ్మిస్తున్న వైనం
- చైన్ సిస్టమ్‌గా కొనసాగుతున్న వ్యవహారం
- వందల సంఖ్యలో బాధితులు.. రూ.లక్షలు వసూళ్లు
- ఉప్పల్ పోలీసులను ఆశ్రయించిన పలువురు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో 'రిలయన్స్ డిజిటల్' అడ్డాగా మోసాలకు పాల్పడుతున్న వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. రిలయన్స్ డిజిటల్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు.. బ్రోకర్లు కుమ్మక్కై ఆరేడు నెలల నుంచి దందాను కొనసాగిస్తున్నారు. సైబర్ నేరస్థుల తరహాల్లో అందినకాడికి దండుకున్నారు. అత్యాశ చూపించి బాధితులను బోల్తా కొట్టిస్తున్నారు. చైన్ సిస్టంలా సాగిన ఈ మోసంలో నగరంతోపాటు శివారు ప్రాంతాలు, ఇతర జిల్లాలకు చెందిన జనాన్ని నమ్మించి లక్షలు దండుకున్నారు. మోసపోయినట్టు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

ఇలా గాలం వేశారు..

దేశ విదేశాల్లో రిలయన్స్ డిజిటల్ షాపింగ్ స్టోర్లకు మంచి పేరుంది.



ల్యాప్‌టాప్స్, ఫ్రిజ్‌లు, ఐ ఫోన్లు, వాషింగ్ మిషన్లు, ఏసీలు, సౌండ్ సిస్టమ్స్‌తోపాటు ఇంట్లోకి కావాల్సిన అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు లభిస్తాయి. నగర వ్యాప్తంగా బ్రాంచ్‌లు కూడా ఉన్నాయి. ఉప్పల్‌లోనూ రిలయన్స్ డిజిటల్ స్టోర్ ఉంది. అయితే ఇందులో పనిచేసే కొందరు ఉద్యోగులు టార్గెట్ పూర్తిచేయడంతోపాటు అడ్డదారిలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఒక్కరిద్దరు బ్రోకర్లతో కుమ్మక్కయ్యారు. రిలయన్స్ డిజిటల్‌లో వస్తువులు కొనుగోలు చేస్తే వాటిని తామే తిరిగి తీసుకుని అంతే డబ్బులు చెల్లిస్తామని స్నేహితులు, తెలిసిన వారిని నమ్మించారు. వస్తువు కొనుగోలుకు సంబంధించి వడ్డీ లేకుండా ఈఎమ్ఐ కట్టుకోవచ్చని చెబుతారు. గుట్టుచప్పుడు కాకుండా ఒక చైన్ సిస్టంలా వ్యవహారాన్ని నడిపించారు. అంతేకాకుండా స్టోర్‌లో ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఏసీ ఇలా ఖరీదైన వస్తువులు కొనుగోలు చేసేవారిని టార్గెట్ చేసేవారు. వారితో మాట్లాడి మీ సిబిల్ చెక్ చేస్తామని నమ్మించేవారు. సిబిల్ చెక్ చేసిన ...7లో

ఐజీ ఆదేశాల మేరకే..

ఫోన్ ట్యాపింగ్ టీమ్‌ను ఏర్పాటు చేసింది ప్రభాకర్‌రావే

- కోట్ల రూపాయల్లో విపక్షాల డబ్బులు సీజ్
- రిమాండ్ రిపోర్ట్‌లో రాధాకిషన్‌రావు వెల్లడి
- నేటికి రాధాకిషన్‌రావు కస్టడీ పిటిషన్ వాయిదా



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన విపక్ష ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు సాగుతున్నా కొద్ది కొత్త మలుపులు తిరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ప్రత్యేక టీమ్‌ను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎస్ఐబీ)కు చెందిన మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు స్వయంగా ఏర్పాటు చేశారని నగర టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు వెల్లడించినట్టు ఆయన రిమాండ్ రిపోర్ట్‌లో దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. మునుగోడు, హుజురాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల సందర్భంగా ఫోన్‌ట్యాపింగ్ ప్రత్యేక టీమ్‌ను ప్రభాకర్‌రావు ఎస్ఐబీలో ఏర్పాటు చేశారనీ, ఇందులో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, హైదరాబాద్‌కు చెందిన అదనపు ఎస్పీ వేణుగోపాల్, ఎస్ఐబీలోని ప్రణీత్‌రావుతో పాటు తనను ఈ స్పెషల్ టీమ్‌లో నియమించారని రిపోర్ట్‌లో వివరించారు. ఆ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల సందర్భంగా అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా, ప్రతిపక్షానికి చెందిన అభ్యర్థులను నియంత్రించటమే టార్గెట్‌గా ...7లో

మహిళా పతంజలి యోగ్ సమితి ఆధ్వర్యంలో

108 సూర్య నమస్కారాలతో మహిళా దినోత్సవం



నవతెలంగాణ- హైదరాబాద్

మహిళా పతంజలి యోగ్ సమితి తెలంగాణ, స్వామి రామ్‌దేవ్‌జీ మహారాజ్, చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ సాధ్వి దేవప్రియా జీ ఆధ్వర్యంలో క్లాసిక్ గార్డెన్‌లో 200 మందికి పైగా మహిళలు, బాలికలు 108 సూర్య నమస్కారాలు చేసి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణలో మహిళలు, బాలికల సంక్షేమం కోసం స్థానిక యోగా ఉపాధ్యాయులు ఉచిత యోగా తరగతులు/శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ యోగా మన జీవన విధానమైనందున వ్యాధి రహిత, ఫిట్, స్మార్ట్ లైఫ్‌లో యోగా ప్రాముఖ్యతను సూచిస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా ఉమా అగర్వాల్, సి వసంత లక్ష్మి ఏపీసీ, సీసీఎల్‌ఏ, తెలంగాణ, సాధన ఠాకూర్, బీజేపీ వైస్ ప్రెసిడెంట్ (హైదారాబాద్ సెంట్రల్ జిల్లా) ప్రవీణ్ అగర్వాల్ హాజరై తమ మద్దతును తెలిపారు. రాష్ట్ర అధ్యక్షురాలు మంజుశ్రీ, అధ్యక్షులు రోజాశ్రీ, నీలం, కె యమునా, జ్యోతిర్మయి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించారు.

'రెరా' నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ప్రీలాంచింగ్ సహించేది లేదు : కార్యదర్శి యాదిరెడ్డి హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రియలెస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆ సంస్థ కార్యదర్శి యాదిరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ, ప్రీ లాంచింగ్ పేరుతో వెంచర్లలో ప్లాట్లు విక్రయిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందనీ, అలాంటి వారికి కచ్చితంగా నోటీసులు జారీ చేసి, జరిమానాలు విధిస్తామని అన్నారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, యూడీఏ, ఇతర స్థానిక సంస్థల అనుమతులతోపాటు 'రెరా'లో తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలనీ, ఆ తర్వాతే మార్కెటింగ్ వ్యాపార ప్రకటనలు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా జరిగితే సుమోటోగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం వరకు అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఆయా ప్రాజెక్టుల గురించి చేసుకొనే ప్రచారంలో తప్పనిసరిగా రెరా రిజిస్ట్రేషన్ నెంబరును ప్రదర్శించాలని చెప్పారు. రెరా నిబంధనలు ఉల్లంఘించిన 27 ప్రాజెక్టులకు నోటీసులు జారీ చేసి రూ.21 కోట్ల అపరాధ రుసుము విధించామన్నారు. ఏర్పడిన జ్యుడీషియరీ అధికారాలతో స్వయం ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ గృహ కొనుగోలుదారుల రక్షణ కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. బిల్డాక్స్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు రెరా నోటీసులు ఇచ్చిందనీ, వారి సమాధానం సంతృప్తికరంగా లేనందున మరోసారి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. ఆ తర్వాత ఫిర్యాదుదారులు, బిల్డాక్స్ యాజమాన్యాన్ని పిలిచి ట్రిబ్యునల్ పరిధిలో విచారణ జరిపామనీ, ఈనెల 4వ తేదీ మరోసారి విచారణ ఉన్నదని వివరించారు.

ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారాముల కళ్యాణ తలంబ్రాలను ఇంటికే పంపేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు దేవాదాయశాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఇతర డైరెక్టర్లతో కలిసి బస్‌భవన్‌లో ఆవిష్కరించారు. టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి, వివరాలు నమోదు చేసుకుంటే గోటి తలంబ్రాలను ఇంటికే వచ్చి అందచేస్తారు. రెండేండ్లుగా ఆర్టీసీ ఈ సేవల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 2022లో దాదాపు 89 వేల మంది భక్తులు తలంబ్రాలు బుక్ చేసుకున్నారు. గత ఏడాది 1.17 లక్షల మంది భక్తులు గోటి తలంబ్రాలను బుక్ చేసుకున్నారని ఈ సందర్భంగా ఎమ్‌డీ సజ్జనార్ తెలిపారు. భద్రాద్రిలో ఈ నెల 17న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కళ్యాణం జరగనున్న విషయం తెలిసిందే. ఇతర వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 040-23450033, 040-69440000, 040-69440069 ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వీ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణకాంత్, సీటీఎం(మార్కెటింగ్ అండ్ కమర్షియల్) శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అక్రమాస్తుల కేసు విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణను అత్యున్నత న్యాయస్థానం వాయిదా వేసింది. వైఎస్ జగన్ కేసులో విచారణ ఆలస్యం అవుతుందని రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని సీబీఐని ధర్మాసనం ప్రశ్నించింది.

విద్యుత్ సరఫరాపై అసత్య ప్రచారాలు చేయకండి

వాటికి మమ్మల్ని బాధ్యుల్ని చేయకండి :టీఎస్‌పీఈజేఏసీవిజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరెంటు కోతలు పేరుతో అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) విజ్ఞప్తి చేసింది. ఈ అసత్య ప్రచారాల వల్ల విద్యుత్ సంస్థల ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్లకు గురువుతున్నారనీ, లేని దానిని ఉన్నదిగా చూపించి, తమను ఎందుకు బదనాం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో నిర్వహించే వివిధ సమావేశాల్లో విద్యుత్ సరఫరా అంతరాయాలు జరుగుతున్నట్టు ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా సూర్యాపేటలో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత కేసీఆర్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో కరెంటు కట్ చేశారని ప్రచారం జరిగింది. లైట్లు ఆరిపోయి, మైక్ కట్ కావడంతో కరెంటు కోతలపై కేసీఆర్ ఫైర్ అయ్యి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆ తర్వాత టీఎస్-ఎస్పీడీసీఎల్ యాజమాన్యం జరిపిన విచారణలో కేసీఆర్ పాల్గొన్న భవనానికి ప్రయివేటు జనరేటర్‌తో ప్రయివేటు వ్యక్తులు కరెంటు సప్లయ్ చేసి, విలేకరుల సమావేశంలో వైర్లు పీకేసి, కరెంటు కోతలనే అభిప్రాయం కలిగించారని తేలిన విషయం తెలిసిందే. గతంలోనూ ఇదే తరహాలో అప్రకటిత కోతలు అంటూ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జేఏసీ నేతలు, విద్యుత్ సంస్థల్లోని పలువురు ఇంజినీర్లు హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లోని 1104 యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. తప్పుడు ప్రచారాల వల్ల ఇంజినీర్లు అనేక అవస్థలు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుష్ప్రచారాలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని కేటగిరీల విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం కోసం, తామంతా అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుత సీజన్లో అంచనాలకు మించి విద్యుత్ డిమాండ్ వస్తున్నా, తమ సిబ్బంది, ఇంజినీర్లు అనునిత్యం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో గతేడాది గరిష్ట డిమాండ్ 15,497 మెగావాట్లు ఉంటే ఈ ఏడాది ఇప్పటికే గరిష్ఠ డిమాండ్ 15,623 మెగావాట్లకు చేరిందని తెలిపారు. డిమాండ్ ఇంత పెరిగినా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా తామంతా కష్టించి పని చేస్తున్నామన్నారు. ఆ శ్రమను గుర్తించకుండా, వినియోగదారుల అంతర్గత విద్యుత్ సమస్యలను సంస్థలకు ఆపాదిస్తూ దుష్ప్రచారాలు చేయడం సమంజసం కాదని చెప్పారు. సమావేశంలో జేఏసీ చైర్మెన్ జీ సాయిబాబు, కన్వీనర్ పీ రత్నాకరరావు, కో చైర్మెన్ ఈ శ్రీధర్, కో కన్వీనర్ పీ బీసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరుకు రవాణాలో ద.మ.రైల్వే సరికొత్త రికార్డు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సరుకు రవాణా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో నమోదైందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ విభాగంలో 141.117 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.13,438.76 కోట్ల ఆదాయం వచ్చిందనీ, దక్షిణ మధ్య రైల్వే జోన్ ఏర్పడినప్పటి నుంచి ఇదే అత్యుత్తమ రికార్డు అని చెప్పారు. గతేడాది కంటే 8.785 మిలియన్ టన్నులు అధిక రవాణా జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బందికి అభినందనలు తెలిపారు.

టెట్ ఫీజులు తగ్గించాలి

సీఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం టెట్ ఫీజులను భారీగా పెంచటంతో పాటు.. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులకు ఇచ్చే రాయితీని విస్మరించటం విద్యార్థులు, నిరుద్యోగును మోసం చేయటమేనని తెలియజేస్తూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. అనేక కష్టాలకు ఓర్చి ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం బాధాకరమని తెలిపారు. దీన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెట్ ఒక పేపర్ రాసినా, రెండు పేపర్లు రాసినా రూ.400 మాత్రమే ఫీజు తీసుకోగా, ఈ ఏడాది ఒక పేపర్‌కు రూ.వెయ్యి, రెండు పేపర్లకు రూ.రెండువేలు ఫీజుగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ ఫీజులు సీబీఎస్ఈ నిర్వహించే సీటెట్‌తో పోల్చితే డబుల్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. రిజర్వుడ్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించకుండా జనరల్ క్యాటగిరీ విద్యార్థులతో సమానంగా ఒకే తరహా ఫీజులను అమలు చేయటం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సీటెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు సీబీఎస్ ఈ ఫీజు రాయితీని అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎప్‌సెట్, ఐసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లోనూ ఫీజుల రాయితీని అమలు చేస్తున్నా రని పేర్కొన్నారు. కానీ టెట్‌లో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇవ్వటం లేదని తెలిపారు. టెట్ ఫీజుల పెంపు, రిజర్వుడ్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించక పోవడాన్ని నిరసిస్తూ బీఈడీ, డీఎడ్ అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా పోరాడుతున్నారని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం నుండి కనీస స్పందన లేదని పేర్కొన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం, సోకాల్డ్ ప్రజా పాలన అని ప్రశ్నించారు. నిరుద్యోగుల నుంచి రూపాయి ఫీజు తీసుకోకుండా దరఖాస్తులు స్వీకరిస్తామని మ్యానిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ఫీజుల పేరుతో నిరుద్యోగుల నడ్డీ విరుస్తోందని విమర్శించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున పోరాటం తప్పదని హెచ్చరించారు.

ఎలక్షన్ కోడ్ పటిష్టంగా అమలు చేయండి

- సమీక్షా సమావేశంలో సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. దీనిపై సోమవారంనాడామె డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిస్థితి, చెక్‌పోస్టుల్లో సీజ్ చేసిన నగదు, ఓటర్లను ప్రభావితం చేసే ఇతర వస్తువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బేగంపేట, శంషాబాద్ విమానాశ్రయాల్లోనూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. సరిహద్దు జిల్లాల్లో డ్రై డేలను తెలపాలనీ, స్మగ్లర్లు ఉపయోగించే రహస్య మార్గాలపై నిఘా ఉంచాలని చెప్పారు. ఈ సందర్భంగా డీజీపీ రవిగుప్తా మాట్లాడుతూ రాష్ట్రంలో 85 సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామనీ, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు నిఘాను పెంచాయని తెలిపారు. గడిచిన 15 రోజుల్లో దాదాపు రూ.35 కోట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక సమీకృత సరిహద్దు చెక్‌పోస్టుల ద్వారా వాణిజ్య పన్నుల శాఖ నిఘాను పెంచిన ఫలితంగా రూ. 5.19 కోట్లు స్వాధీనం చేసుకున్నామని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల తయారీ, వ్యాపార గోడౌన్లపై కూడా నిఘా పెంచామన్నారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, సీనియర్ పోలీస్ అధికారులు మహేష్ భగవత్, సంజయ్ జైన్, రవాణా, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ రాజు, రవాణా శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ సమావేశంలో పాల్గొన్నారు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 (ది యాక్ట్) మరియు ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ లోని సెక్షన్ 13 (2) కింద నోటీసు

వ. సంఖ్య	రుణగ్రహీత(ల) పేరు (ఎ)	తాకట్టు ఆస్తి వివరాలు (బి)	ఎన్‌పిఎ తేదీ (సి)	బకాయివున్న మొత్తం (రూ.) (డి)
1.	రుణ ఖాతా నం. HHLHYD00147144 1. ఇనుగుంటి సాంబశివరావు అలియాస్ ఇ. సాంబశివరావు 2. రామ్మోహన్‌రావు ఎనగంటి అలియాస్ ఇ. రామ్మోహనరావు	ఫ్లాట్ నం. 303, 3వ అంతస్తు, సప్తగిరి హోమ్స్, మున్సిపల్ హౌస్ నం. 1-6-46/102 (పాత నం. 1-6-102), ప్లాట్ నం. 102 మరియు ఇంటి నం. 1-6-46/103 (పాత నం. 1-6-103), ప్లాట్ నం. 103, సర్వే నం. 536/ఎఎ పార్ట్, కిష్టమ్మ ఎన్‌క్లేవ్ (ప్రగతి), పాత అల్వాల్, జీహెచ్‌ఎంసీ, అల్వాల్ సర్కిల్, మల్కాజ్‌గిరి మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్- 500010, తెలంగాణ.	09.02.2024	11.03.2024 నాటికి రూ. 8,87,396.31/- (ఎనిమిది లక్షల ఎనభై ఏడు వేల మూడు వందల తొంభై ఆరు రూపాయలు మరియు ముప్పై ఒక్క పైసలు మాత్రమే)
2.	రుణ ఖాతా నం. HHLHYD00147146 1. ఇనుగుంటి సాంబశివరావు అలియాస్ ఇ. సాంబశివరావు 2. రామ్మోహన్‌రావు ఎనగంటి అలియాస్ ఇ. రామ్మోహనరావు	ఫ్లాట్ నం. 303, 3వ అంతస్తు, సప్తగిరి హోమ్స్, మున్సిపల్ హౌస్ నం. 1-6-46/102 (పాత నం. 1-6-102), ప్లాట్ నం. 102 మరియు ఇంటి నం. 1-6-46/103 (పాత నం. 1-6-103), ప్లాట్ నం. 103, సర్వే నం. 536/ఎఎ పార్ట్, కిష్టమ్మ ఎన్‌క్లేవ్ (ప్రగతి), పాత అల్వాల్, జీహెచ్‌ఎంసీ, అల్వాల్ సర్కిల్, మల్కాజ్‌గిరి మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్- 500010, తెలంగాణ.	09.03.2024	15.03.2024 నాటికి రూ. 5,57,017.04/- (అయిదు లక్షల యాభై ఏడు వేల పదిహేడు రూపాయలు మరియు నాలుగు పైసలు మాత్రమే)

పైన పేర్లు ఇవ్వబడిన రుణ గ్రహీత(లు) రుణ ఖాతా(ల)లో ఆర్థిక క్రమశిక్షణను పాటించడంలో విఫలమయ్యారు మరియు కంపెనీ నిర్వహించే మామూలు వ్యాపార నిర్వహణలో తేలిందేమిటంటే నిర్వహించబడే ఖాతాల పుస్తకాల ప్రకారం, బకాయివున్న మొత్తాన్ని కాలమ్ డి సూచిస్తోంది.

రుణ గ్రహీత(లు) అప్పు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో పదేపదే విఫలమవుతున్న కారణంగా, రెగ్యులేటరి అథారిటి జారీచేసిన ఆస్తుల వర్గీకరణకు సంబంధించిన మార్గదర్శకాల లోపల సదరు రుణ ఖాతాను కంపెనీ నిరర్థక ఆస్తిగా వర్గీ కరించడమైనది (కాలమ్ సిలో తేదీ నాటికి ఉన్నట్లుగా). అనంతరం, ప్రతి రుణగ్రహీతకు చట్టంలోని సెక్షన్ 13 (2) ప్రకారం నోటీసులు కూడా జారీచేయడమైనది.

పై విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుంచి 60 రోజుల లోపల అప్పటి వరకు అయినవడ్డీ, ఖర్చులు మరియు చార్జీలతో సహా, పైన కాలమ్ డి లో సూచించబడిన చెల్లించవలసిన బకాయిలు మొత్తాన్నీ చెల్లించడం ద్వారా కంపెనీ పట్ల ఉన్న అతని/ఆమె బాధ్యతలను పూర్తిగా నెరవేర్చవలసిందిగా పై రుణగ్రహీత(లు)ను కంపెనీ కోరుతోంది, అలా చెల్లించని పక్షంలో, పైన కాలమ్ బిలో తెలియజేసిన తనఖాఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు కంపెనీకి హక్కువుంది మరియు చట్టంలో కంపెనీకి లభించే ఎలాంటి ఇతర చర్యలను కూడా తీసుకుంటుంది.

సర్ఫేయిసి చట్టం సెక్షన్ 13 లోని ఉప-సెక్షన్ (8) నిబంధనల ప్రకారం, "బహిరంగ వేలం ద్వారా, ప్రజల నుంచి కొటేషన్, టెండర్ పిలవడం ద్వారా లేదా ప్రైవేట్ ట్రీటీ ద్వారా సెక్యూర్డ్ ఆస్తి(ల)ను విక్రయించేందుకు నోటీసు ప్రచురితమైన తేదీ వరకు సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా మాత్రమే అయిన వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో పాటు అవుట్‌స్టాండింగ్ బకాయిల పూర్తి మొత్తాన్ని రుణగ్రహీత సమర్పించవచ్చు. పైన తెలియజేసిన చట్టబద్ధంగా ప్రిస్క్రయిబ్ చేసిన కాల వ్యవధి లోపు సెక్యూర్డ్ ఆస్తిని రిడీమ్ చేసుకోవడంలో రుణగ్రహీత విఫలమైతే, ఆస్తిని రిడీమ్ చేసుకునేందుకు రుణగ్రహీతకు హక్కు లేదని కూడా గమనించాలి."

సర్ఫేయిసి చట్టంలోని సెక్షన్ 13లోని ఉప-సెక్షన్ (13) నిబంధనల ప్రకారం, సెక్యూర్డ్ క్రెడిటార్ నుంచి ముందుగా రాతపూర్వక సమ్మతి లేకుండా, నోటీసులో ప్రస్తావించిన సెక్యూర్డ్ ఆస్తులు వేటినైనా విక్రయం, లీజు లేదా ఇతరత్రా (తన వ్యాపారం యొక్క సాధారణ కోర్సులో కాకుండా ఇతరత్రా) బదిలీచేయకుండా మిమ్మల్ని ఇందుమూలంగా నిషేధించడమైనది.

స్థలం : హైదరాబాద్

ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరుపున, అధీకృత అధికారి

BARTRONICS INDIA LIMITED

Regd. Office: Survey No. 351, Raj Bollaram Village, Medchal Mandal & District, Telangana – 501 401. Website: www.bartronics.com, Ph.040-49269269, e-mail: info@bartronics.com, CIN: L29309TG1990PLC011721

పోస్టల్ బ్యాలెట్ ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా సమయానుసారంగా సవరించిన (ప్రస్తుతం అమలులోవున్న ఏదేని చట్టబద్ధమైన మార్పు(లు), లేదా రీ-ఎన్‌అక్ట్‌మెంట్‌లతోసహా) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా మరియు ఏదేని ఇతర చట్టాలు, రూల్స్ మరియు రెగ్యులేషన్స్‌చే జారీచేసిన జనరల్ మీటింగ్స్‌పై సెక్రటరియల్ స్టాండర్డ్స్-2, సవరించినట్లుగా సెక్యూరిటీస్ ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 ("సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్") యొక్క రెగ్యులేషన్ 44 మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం ("ఇకమీదట ఎంసిఏ సర్క్యులర్లు"గా పేర్కొనబడును)చే జారీచేసిన జనరల్‌సర్క్యులర్ నెం. 14/2020 తేది.8 ఏప్రిల్, 2020, 17/2020 తేది.13 ఏప్రిల్, 2020, నెం.20/2020 తేది.5 మే, 2020, 22/2020 తేది.15 జూన్,2020, 33/2020 తేది.28 సెప్టెంబర్, 2020, నెం.39/2020 తేది.31 డిసెంబర్, 2020, 10/2021 తేది.23 జూన్,2021, నెం.20/2021 తేది.8 డిసెంబర్, 2021, 3/2022 తేది.5 మే, 2022 మరియు 10/2022 మరియు 11/2022 తేది.28 డిసెంబర్, 2022, సర్క్యులర్ నెం.9/2023 తేది.25 సెప్టెంబర్, 2023తో చదవగల సవరించినట్లు (ది "మేనేజ్‌మెంట్ రూల్స్") కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014లోని రూల్ 20 మరియు రూల్ 22తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108 & 110 నియామలను అనుసరించి రిమోట్ ఇ-ఓటింగ్ ('ఇ-ఓటింగ్') ప్రక్రియ రూపం ద్వారా దిగువ తీర్మానాలపై బర్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ ('కంపెనీ') యొక్క సభ్యుల ఆమోదం కోరబడుతున్నది.

క్రసం	వివరాలు	తీర్మానం రకం
1	సర్వే నెం.351, రాజ్ బొల్లారం గ్రామం, మేడ్చల్ మండలం & జిల్లా, తెలంగాణ, ఇండియా-501401 వద్దగల పాత ఫ్యాక్టరీ స్థలం మరియు బిల్డింగ్ విక్రయించుటకు	ప్రత్యేక తీర్మానం
2	శ్రీ ఎస్.విద్యాసాగర రెడ్డి (డిఐఎన్: 09474749) శాలరీలో పునర్విమర్శ పరిగణించుటకు మరియు ఆమోదించుటకు	ప్రత్యేక తీర్మానం
3	ప్రొఫెషనల్-నాన్-ఎగ్జిక్యూటివ్ నాన్- ఇండిపెండెంట్ డైరెక్టర్ యొక్క కెటగిరి క్రింద బోర్డు ద్వారా 13.02.2024న అడిషనల్ డైరెక్టర్‌గా నియమించబడిన శ్రీమతి గద్దం నవీన (డిఐఎన్: 10119037) నియమించుటకు	సాధారణ తీర్మానం

సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్) రెగ్యులేషన్స్, 2015, సవరించినట్లు (ది 'ఎల్ఓడిఆర్ రెగ్యులేషన్స్") యొక్క రెగ్యులేషన్స్ 44ను అనుసరించి మరియు అందులో ఫ్రేమ్ చేసిన రూల్స్‌తో చదవగల చట్టంలోని సెక్షన్స్ 108 మరియు 110 నియమాలను అనుగుణంగా, ప్రతిపాదిత తీర్మానంపై ఓటింగ్ విధానం ఇ-ఓటింగ్ అనగా ఎలక్ట్రానికల్లీ ఓట్లను వినియోగించుటకు మాత్రమే పరిమితం చేయబడినది. ఎంసిఏ సర్క్యులర్స్ అనుసరించి, శుక్రవారం, 29 మార్చ్, 2024 ("కటాఫ్ తేది")నాటికి కంపెనీ/డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేసిన అటి సభ్యులకు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా సోమవారం, 1 ఏప్రిల్, 2024న ఎక్స్‌ప్లేనేటరీ స్టేట్‌మెంట్‌తోసహా పోస్టల్ బ్యాలెట్ నోటీసు యొక్క ఎలక్ట్రానిక్ కాపీలను డిస్పాచ్‌ను కంపెనీ పూర్తిచేసింది. ఎక్స్‌ప్లెనేటరీ స్టేట్‌మెంట్స్‌తోసహా పోస్టల్ బ్యాలెట్ నోటీసు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.bartronics.com నందు, బిఎస్ఇ లిమిటెడ్: www.bseindia.com, ఎన్ఎస్ఇ లిమిటెడ్:www.nseindia.com పై మరియు ఎన్ఎస్‌డిఎల్ వెబ్‌సైట్: www.nsdl.evoting.com పై కూడా లభించును.

ఎంసిఏ సర్క్యులర్స్ యొక్క నియమాలను అనుసరించి, ఇ-ఓటింగ్ ప్రక్రియ ద్వారా మాత్రమే సభ్యులు ఓటును వినియోగించుకోవాలి. కటాఫ్ తేదినాటికి వారు నిర్వహించిన కంపెనీ యొక్క ఈక్విటీ వాటాల ప్రతిపాదికన సభ్యుల ఓటింగ్ హక్కులు లెక్కలోకి తీసుకోబడును. కటాఫ్ తేది నాటికి కంపెనీయొక్క వాటాదారుగాలేని ఎవరైనా వ్యక్తి పోస్టల్ బ్యాలెట్ నోటీసును సమాచారం నిమిత్తంగా మాత్రమే భావించాలి. కంపెనీ దీని సభ్యులకు రిమోట్ ఇ-ఓటింగ్ వసతిని కల్పించుట నిమిత్తం నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ ('ఎన్ఎస్‌డిఎల్') వారి సేవలను వినియోగించుటకు నియమించింది. రిమోట్ ఇ-ఓటింగ్ కొరకు సూచనలు ఈ నోటీసులో ఇవ్వబడినవి.

రిమోట్ ఇ-ఓటింగ్ వసతి దిగువ కాలవ్యవధిలో అందుబాటులో ఉండును.

ఓటింగ్ ప్రారంభ తేది & సమయం	ఓటింగ్ ముగింపు తేది & సమయం
బుధవారం, 09 ఏప్రిల్, 2024 ఉ.09.00గం.లకు	గురువారం, 02 మే, 2024 సా.05.00గం.లకు

గురువారం 02 మే, 2024న సా.5.00గం.లు ఐపోయిన తరువాత వెంటనే ఎన్ఎస్‌డిఎల్‌చే ఇ-ఓటింగ్ వసతి డిసేబుల్ చేయబడును.

డిమాట్ విధానంలో వాటాలను కలిగియున్న సభ్యులు, వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేయని వారిని వారి సంబంధిత డిపితో వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేసుకోవాలి మరియు భౌతిక విధానంలో వాటాలను కలిగియున్న సభ్యులు కంపెనీ యొక్క ఆర్టీఏ investor@bigshareonline.com వద్ద వారి ఇమెయిల్ అడ్రస్‌లను అప్‌డేట్ చేసుకోవాలి.

న్యాయమైన మరియు పారదర్శక విధానంలో ఇ-ఓటింగ్ ప్రక్రియ ద్వారా పోస్టల్ బ్యాలెట్‌ను నిర్వహించుటకు స్క్రూటినైజర్‌గా మెసర్స్ ఎస్ఏ& అసోసియేట్స్, (మెంబర్‌షిప్ నెం.ఎఫ్‌సిఎస్ 7642) (సిపినెం.24877) ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీస్‌ను బోర్డు నియమించింది.

ఏదేని ప్రశ్నల విషయంలో, మీరు వాటాదారుల కొరకు తరచుగా అడిగిన ప్రశ్నలు (ఎఫ్ఏక్యూలు) మరియు www.evoting.nsdl.com యొక్క డౌన్‌లోడ్ సెక్షన్‌లో అందుబాటులోగల వాటాదారుల కొరకు ఇ-ఓటింగ్ యూజర్ మ్యానువల్స్ రిఫర్ చేసుకోవచ్చును లేదా కాల్ చేయండి 022-48867000 మరియు 022-24997000 లేదా evoting@nsdl.co.inకు అభ్యర్థను పంపండి లేదా ఇ-ఓటింగ్ అడ్రస్‌లపై మీ సాధకబాధకల పొందుటకు అమిత్ విశాల్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, లేదా పల్లవి మహాత్రే, సీనియర్ మేనేజర్, నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్, డిసిగ్నేటెడ్ ఇమెయిల్ ఐడి: evoting@nsdl.co.in పోస్టల్ బ్యాలెట్ ఫారాల స్క్రూటినీ మరియు ఇ-ఓటింగ్ ముగిసిన తరువాత కంపెనీ యొక్క చైర్మన్‌చే అథరైజ్‌చేసిన చైర్మన్/ ఏదేని ఇతర డైరెక్టర్/ కీ మేనేజిరియల్ పర్సనల్‌కు స్క్రూటినైజర్ తన రిపోర్టు సమర్పిస్తారు. స్క్రూటినైజర్ రిపోర్టుకోసహా పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు శుక్రవారం, 3 మే, 2024న సా.5.00గం.లు లేదాముందుగా ఫలితాలు ప్రకటించబడును. స్క్రూటినైజర్ రిపోర్టుతోసహా ఫలితాలు కంపెనీ యొక్క ఈక్విటీ వాటాలను లిస్ట్‌చేయబడిన బిఎస్ఇ లిమిటెడ్ (బిఎస్ఇ) మరియు నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఇ)లకు తెలియజేయబడును మరియు ఫలితాలు కంపెనీ వెబ్‌సైట్: www.bartronics.com అలాగే ఎన్ఎస్‌డిఎల్ వెబ్‌సైట్‌లో కూడా ప్రదర్శించబడును.

డిపాజిటరీలు అనగా ఎన్ఎస్‌డిఎల్ మరియు సిడిఎస్ఎల్ ద్వారా లాగిన్‌కు సంబంధించిన ఏదేని సాంకేతిక సమస్యలు డిమాట్ విధానంలో సెక్యూరిటీలను కలిగిన వాటాదారులకు హెల్ప్ డెస్క్

లాగిన్ రకం	హెల్ప్‌డెస్క్ వివరాలు
ఎన్ఎస్‌డిఎల్‌తో డిమాట్ విధానంలో సెక్యూరిటీలను కలిగిన వాటాదారులకు	Email: evoting@nsdl.co.in or Call at toll free no. 1800 1020 990 and 1800 22 44 30
సిడిఎస్ఎల్‌తో డిమాట్ విధానంలో సెక్యూరిటీలను కలిగిన వ్యక్తిగత వాటాదారులకు	Email: helpdesk.evoting@cdslindia.com or contact at toll free no. 1800 22 55 33

బోర్డు ఉత్తర్వుల మేరకు
For Bartronics India Limited
సం/-
అశ్విని సింగ్ బిష్ట్
కంపెనీ సెక్రటరీ & కంప్లియన్స్ ఆఫీసర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 01-04-2024

మెసర్స్ ఆస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన

ప్లాట్ నెం.141/1, ఫేజ్-II, ఐడిఏ, చర్లపల్లి, హైదరాబాద్, తెలంగాణ.-500051.

లిక్విడేటర్: నరేష్ షేత్, నెం. IBBI/IPA-001/IP-P00133/2017-18/10275
లిక్విడేటర్ ఆఫీసు: టాటా రోడ్ నెం.1, ఒపెరాహౌస్, చార్ని రోడ్ (తూర్పు), ముంబయి-400004. E-mail: cirp@asterco.in/nvsheth@mkindia.com

ఇ-వేలం (తేది & సమయాలు)
ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద ఆస్తుల అమ్మకం
29 ఏప్రిల్, 2024 ఉ.11:00గం.ల నుండి మ 12:00గం.ల వరకు
(5 నిమిషాల చొప్పున అపరిమిత పొడగింపులతో)

సిపి(ఐబి) నెం.199/7/హెచ్‌డిబి/2019 తేది.22.09.2021లో ఐఏ(ఐబిసి)/259/2021లో ఉత్తర్వు ఆధారంగా గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ ద్వారా నియమించబడిన ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 32(ఎ) నుండి 32 (డి)క్రింద మెసర్స్ ఆస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో) యొక్క ఆస్తుల అమ్మకం. అమ్మకం అనునది ఇ-వేలం ప్లాట్‌ఫామ్: https://eauctions.co.in ద్వారా నిర్వహించబడును.

29 ఏప్రిల్, 2024-సోమవారం ఉ: 11.00గం.ల నుండి మ: 12.00గం.లు

వివరణ	రిజర్వు ధర రూ.కోట్లలో	ధరావత్తు (ఈఎండి) రూ.కోట్లలో	బిడ్ పెంపుదల మొత్తం కోట్లలో
వేలం సమయాలు: ఉ.11.00గం.ల నుండి మ.12.00గం.ల భూత్‌పూర్ వద్ద ప్లాంట్ & మెషినరీతోసహా 67.40 ఎకరాలతో భూత్‌పూర్ గ్రామం, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణలోని సర్వే నెం.197(పి), 198(పి), 251(పి) వద్దగల వ్యయసాయేతర భూమి & బిల్డింగ్.	46.78	4.67	0.10

అర్హతగల పత్రాలను సమర్పించుటకు చివరి తేది: 16 ఏప్రిల్, 2024
ఇన్ఫర్మేషన్ షేరింగ్, సైట్ దర్శించుట, చర్చలు సమావేశాల చివరి తేది: 24 ఏప్రిల్, 2024
ఈఎండి సమర్పించుటకు చివరి తేది: 27 ఏప్రిల్, 2024

ఇ-వేలం నియమ నిబంధనలు దిగువ ఇవ్వబడినవి:

1) ఇ-వేలం అనునది "ఎక్కడ ఎలా ఉన్నది మరియు "అక్కడ అలాగే" ప్రతిపాదికన సర్వీస్ ప్రొవైడర్, మెసర్స్ లింక్‌స్టార్ ఇన్ఫోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ (https://eauctions.co.in) ద్వారా ఎలాంటి వారెంటీలు మరియు నష్టపరిహారాలు లేకుండా అమ్మకం నిర్వహించబడును. సంప్రదించండి: ఇష్తియాక్ అహ్మద్ & శ్రీ.విజయ్ పిపాలియా, ఇ-మెయిల్: admin@eauctions.co.in, సంప్రదింపు నెం.9870099713.
2) బిడ్ పత్రాలను లిక్విడేటర్ వారికి ఇమెయిల్: cirp@asterco.in/nvsheth@mkindia.com ద్వారా సమర్పించాలి మరియు ఒరిజినల్ హార్డు కాపీని మెసర్స్ ఆస్టర్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నెం.141/1, ఫేజ్-2, ఐడిఏ, చర్లపల్లి, హైదరాబాద్, తెలంగాణ-500051 వారికి కూడా పంపించాలి. ఇ-వేలం ప్రాసెస్ యొక్క వివరణాత్మక నియమ నిబంధల కలిగిన బిడ్ ఫారం మరియు మెమోరాండంను వెబ్‌సైట్: https://eauctions.co.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఆసక్తిగల బిడ్డరుదారులు బిడ్ పత్రాలలోని స్పష్టంగా వారి బిడ్డింగ్‌కు సంబంధించిన లాటు నెంబరును పేర్కొనాలి. ఒక లాటుకు మించిన బిడ్డింగ్ విషయంలో అమ్మకపు నోటీసులో ప్రతి లాటుకు వేరుగా బిడ్ దరఖాస్తు ఫారంను సమర్పించాలి. ఇ-వేలం ప్లాట్‌ఫామ్: https://eauctions.co.in పై ఇ-వేలంలో పాల్గొను క్వాలిఫైడ్ బిడ్డరులను లిక్విడేటర్ ప్రకటిస్తారు. ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ లింక్‌స్టార్ ఇన్ఫోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఇ-వేలంలో పాల్గొంటున్న క్వాలిఫైడ్ బిడ్డరుదారులకు ఇ-వేలం కొరకు యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను అందిస్తారు.
3) ఆసక్తిగల బిడ్డరుదారులు వారి బిడ్‌ను సమర్పించుటకు ముందుగా కార్పొరేట్ డెటార్, అసెట్స్, డ్యూటీస్, ట్రాన్స్‌ఫర్ ఫీ, మెయింటెనెన్స్ చార్జీలు మరియు ఇతర పన్నులు/ ఫీ/ చార్జీల గురించిన తగిన విధంగా వారు స్వతంత్రంగా తనిఖీ చేసుకోవాలి మరియు లిక్విడేటర్ వారిని సంప్రదించుట లేదా cirp@asterco.in కు ఇమెయిల్ పంపించుట ద్వారా వారి స్వంత ఖర్చులపై కార్పొరేట్ డెటార్ ఉటీని ఆస్తులను తనిఖీ చేసు కోవాలి.
4) యాక్సిస్‌బ్యాంక్, ఎస్.ఆర్.నగర్, ఐఎఫ్ఎస్‌సి కోడ్ యుటిఐబి0002896తో ఖాతానెం.92102004 4126539 కలిగిన ఖాతాలో మెసర్స్ ఆస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్ క్రింద) యొక్క ఖాతాకు డిడి/ ఆర్టీజిఎస్/ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ ద్వారా 6 ఏప్రిల్, 2024 లోగా ధరావత్తును (ఈఎండి)ను ఆసక్తిగల బిడ్డరుదారులు డిపాజి చేయాల్సి ఉంటుంది.
5) ఆసక్తిగల బిడ్డరుదారులు నిర్దిష్ట బిడ్ పత్రాలతోపాటుగా డిపాజిట్‌చేసిన ధరావత్తు కొరకు ఎవిడెన్స్‌ను లిక్విడేటర్ వారికి cirp@asterco.in కు మెయిల్‌చే సమర్పించాలి మరియు హార్డ్ కాపీని పై చిరునామాలో కూడా సమర్పించాలి.
6) లిక్విడేషన్ ప్రాసెస్ ఆసక్తిలో తనవిచక్షణ మేరకు ఇ-వేలంలోని టైమ్‌లైన్స్‌తోసహా ప్రాసెస్ మెమోరాండంలోని ఏదేని నియమనిబంధనలను పొడగించు/వాయిదావేయు/రద్దుచేయు మరియు/లేదా మార్పుచేయు లేదా తొలగించు అధికారం మరియు వేలంయొక్క ఏదేని స్టేజిలోన్న ఎటువంటి కారణాలు తెలుపకుండానే లేదా ఏదేని ముందస్తు నోటీసు లేకుండా ఏదేని బిడ్‌ను తిరస్కరించు హక్కు లిక్విడేటర్ వారికి ఉంటుంది.
7) ఏదైనా న్యాయనిర్ణేత లేదా అప్పీలేట్ బాడీద్వారా మంజూరుచేయబడిన ఇ-వేలంపై మధ్యంతర స్టే విధించినందుకు లిక్విడేటర్ బాధ్యత వహించబడదు లేదా విషయం అధీనం వరకు లేదా జాప్యంవల్ల కలిగే నష్టాలు లేదా నష్టాలసుర్తి చేయడానికి ధరావత్తుని తిరిగి చెల్లించడానికి వారు బాధ్యత వహించరు.
8) ఆస్తి పన్ను బకాయిలకుగాను రూ.10,59,32,349 కొరకు తేది.08.09.2023నాటి డిమాండ్ నోటీసును భూత్‌పూర్ మున్సిపాలిటి యొక్క కమీషనర్ ఆఫీసు జారీచేసింది.
9) అమ్మకపు ప్రకటన ప్రచురణ తేది నాటిరి ఈ ఆస్తి గురించిన పూర్తి అందుబాటులో ఉన్న సమాచారం లిక్విడేటర్ సమర్పించారు. బిడ్డరుదారులు వారి స్వంతగా తగిన విధంగా విచారణ చేసుకోవాలి, మరియు ఏదేని కడపరి ఈవెంట్లకు లేదా సంఘటనలకు లిక్విడేటర్ బాధ్యత వహించరు.

తేది: 2 ఏప్రిల్, 2024
ప్రదేశం: హైదరాబాద్

సిఏ నరేష్ షేత్
లిక్విడేటర్-ఆస్టర్ ప్రైవేట్ లిమిటెడ్
రిజిస్ట్రేషన్ నెం. IBBI/IPA-001/IP-P00133/2017-18/10275

హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

CIN U65922TN2015PLC10093

కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, అన్నాసలై, సైదాపేట్, చెన్నై-600015, తమిళనాడు, ఇండియా. రీజనల్ ఆఫీసు: 2వ అంతస్తు, టి19టవర్స్, కర్బాల మైదాన్, రాణిగంజ్, సికింద్రాబాద్, హైదరాబాద్-తెలంగాణ -500003. www.hindujahousingfinanace.com

అనుబంధం-4 స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారుదు హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేది నుంచి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించమని దిగువ పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు కంపెనీ యొక్క అధీకృత అధికారిచే డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీత(ల)/ హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూర్డు ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదవగల చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకోవడమైనది. సెక్యూర్డు అసెట్ విమోచనానికి అందుబాటులోఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్(8) నియమాల క్రింద రుణగ్రహీత నుండి శ్రద్ధను కోరుతున్నారు. ప్రధానంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలను జరుపదలచిన వారు హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ వారికి దిగువ పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత(ల)/ హామీదారుల పేరు/ఎల్ఏఎన్	డిమాండ్ నోటీసు తేది& మొత్తం	స్వాధీనతా తేది
1	1. శ్రీమతి అనిత పి. (రుణగ్రహీత). 2) శ్రీ శ్రీధర్ నూనపనేని (సహ రుణగ్రహీత), ఇద్దరి నివాసం: ఫ్లాట్ నెం: 302, రోడ్డు నెం-26, సత్య రెసిడెన్సీ, దీప్తిశ్రీనగర్, మదీనాగూడ, మియాపూర్, హైదరాబాద్,తెలంగాణ-500049. LAN:AP/HDB/HYDB/A000000444.	28/12/2023 & రూ.11,74,697/- (రూపాయలు పదకొండు లక్షల డెబ్బై నాలుగువేల ఆరు వందల తొంభై ఏడు మాత్రమే)	30/03/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): హఫీజ్‌గూడ గ్రామం, శేరిలింగంపల్లి మండలం మరియు మున్సిపాలిటీ, రంగారెడ్డి జిల్లా దీప్తిశ్రీనగర్‌లోని "శ్రీసత్య రెసిడెన్సీ" వద్ద సర్వే నెంబర్లు : 152 & 153లోని ఇంటి నెం. 5-56/ఎస్ఆర్/302తో గల మూడో అంతస్తులోని ఫ్లాట్ నెం.302 కలిగిన మొత్తం, 31 చ.గజాల విస్తీర్ణంలోని అవిభాజ్య వాటాతోపాటు(మొత్తం 700 చ.గజాలలోని), ప్లాట్ నెంబర్లు: 55/ఎ మరియు 55/బి పై కామన్ ఏరియాతోపాటు 789 చ.అడుగుల బిల్టప్ ఏరియా.. భూమి సరిహద్దులు:- తూర్పు: ప్లాట్ నెం.55/బి,పడమర: ప్లాట్ నెం.55, ఉత్తరం: 33' వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెంబర్లు: 44/ఎ మరియు 44/బి,. ఫ్లాట్ సరిహద్దులు:- తూర్పు: లిఫ్ట్ & ఓపెన్ టు స్కై, పడమర: డక్ట్ మరియు ఫ్లాట్ నెం. 301, ఉత్తరం: కారిడార్, దక్షిణం: ఓపెన్ టు స్కై		
2	శ్రీ నాగమణి మేకల (రుణగ్రహీత). 2) శ్రీ నాగమునెయ్య మేకల (సహ రుణగ్రహీత), ఇద్దరి నివాసం: ఇటి నెం: 6-286/1/1, వెంకటేశ్వరనగర్, చింతల్,కుతుబుల్లాపూర్,హైదరాబాద్,తెలంగాణ, ఇండియా-500054. మరియు ఇది కూడా: ఇంటి నెం.06-296/6/1&2/204, ఫ్లాట్ నెం.204, రెండో అంతస్తు, "శ్రీ భావనా టవర్స్",వెంకటేశ్వరనగర్,కుతుబుల్లాపూర్, మేడ్చల్-మల్కాజ్‌గిరి,తెలంగాణ-500054. LAN:AP/HDB/SCDB/A000000029.	20/11/2023 & రూ.28,14,791/- (రూపాయలు ఇరవై ఎనిమిది లక్షల డెబ్బై పద్నాలుగువేల ఏడు వందల తొంబై ఒక్కటి మాత్రమే)	30/03/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): తెలంగాణ రాష్ట్రం,మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కుతుబుల్లాపూర్ గ్రామం మరియు మండలంలోని సర్వే నెంబర్లు: 19,20& 23 నుంచి 27, బ్లాక్ నెం. 6 కింద, వెంకటేశ్వరనగర్ వద్ద "శ్రీ భావనా టవర్స్" పేరు గల భవనంలోని రెండో అంతస్తులోని ఫ్లాట్ నెం.204, డోర్ నెం.06-296/6/1&2/204(పిటిఐఎన్ నెం.1150604554) గలది, 1105 చ.అడుగుల ఫ్లింత్ ఏరియాతోపాటు(దాదాపు 40 చ.అడుగుల కామన్ ఏరియాతోపాటు) మరియు కారు పార్కింగ్, ప్లాట్ నెంబర్లు 152&171పై 28.11 చ.గజాల విస్తీర్ణం గల(మొత్తం 1400 చ.గజాలలోని) అవిభాజ్య భూమిలోని వాటాతోపాటు.. భూమి సరిహద్దులు:- తూర్పు: రోడ్డు,పడమర:'30' వెడల్పు రోడ్డు, ఉత్తరం: '20' వెడల్పు రోడ్డు, దక్షిణం:'20' వెడల్పు రోడ్డు,. ఫ్లాట్ సరిహద్దులు:- తూర్పు: 4-0' వెడల్పు కారిడార్ మరియు ఫ్లాట్ నెం. 206, పడమర:4-0' వెడల్పు కారిడార్ మరియు ఫ్లాట్ నెం. 202, ఉత్తరం: ఓపెన్ టు స్కై,దక్షిణం: 6-6' వెడల్పు కారిడార్.		
3	శ్రీ మురళిగ్యార (రుణగ్రహీత). 2) శ్రీమతి రేణుక గ్యార (సహ రుణగ్రహీత), ఇద్దరి నివాసం: ఇంటి నెం: 1-9/1, దూలపల్లి, దుండిగల్-గండి మైసమ్మ, హైదరాబాద్,తెలంగాణ-500014. మరియు ఇది కూడా: ఇంటి నెం.1-8,దూలపల్లి, దుండిగల్-గండి మైసమ్మ, మేడ్చల్-మల్కాజ్‌గిరి ,తెలంగాణ-500014. LAN:AP/HDB/LBNG/A000000174.	28/12/2023 & రూ.11,25,154/- (రూపాయలు పదకొండు లక్షల ఇరవై ఐదువేల నూటా యాభైనాలుగు మాత్రమే)	30/03/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): తెలంగాణ రాష్ట్రం,మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, దుండిగల్-గండి మైసమ్మ మండలం, కొంపల్లి మున్సిపాలిటీ, దూలపల్లి గ్రామం వద్ద సర్వే నెం.67లోని ఇంటి నెం.1-8, పిటిఐఎన్ నెం.1265100030లోని మొత్తం, 210.0 చ.గజాల విస్తీర్ణం, ఆర్‌సిసి యొక్క 300 చ.అడుగుల ఫ్లింత్ ఏరియాతోపాటు, దాని సరిహద్దులు:-ఉత్తరం: గ్యార కిష్టయ్య ఇల్లు, దక్షిణం: దష్మ గోపాల్& పోచయ్య ఇల్లు, తూర్పు: గ్రామ పంచాయతీ రోడ్డు& దుర్గం సుశీల ఇల్లు, పడమర:గ్రామ పంచాయతీ రోడ్డు.		
4	శ్రీ పద్మ కనకారామ్ (రుణగ్రహీత). 2) శ్రీ వెంకటేశ్వర్ కనకారామ్ (సహ రుణగ్రహీత), ఇద్దరి నివాసం: ఇంటి నెం:2-3-655/సి/18, దుర్గా నగర్, అలీకేఫ్ సమీపంలో, అంబర్‌పేట, హైదరాబాద్,తెలంగాణ-500013. మరియు ఇది కూడా:ఇంటి నెం.1-7-658/2/2(పాతనెం.1-7-658/2),రామ్‌నగర్, హైదరాబాద్-500020. LAN:AP/HDB/GCBL/A000000037	20/11/2023 & రూ.29,37,854/- (రూపాయలు ఇరవై తొమ్మిది లక్షల ముప్పైఏడు వేల ఎనిమిది వందల యాభై నాలుగు మాత్రమే)	30/03/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): హైదరాబాద్‌లోని రామ్‌నగర్ వద్ద నివాస గృహం నెం.1-7-658/2/2 (పాతనెం.1-7-658/2)లోని మొత్తం,141 చ.గజాల విస్తీర్ణం గల భూమిపై ఉన్న గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు కలిగినట్టిది...సరిహద్దులు:- ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం:9 అడుగుల వెడల్పు లేన్, పడమర:రోడ్డు, తూర్పు: పొరుగువారి ఇల్లు.		
5	శ్రీ సత్యనారాయణ రాయారపు (రుణగ్రహీత). 2) శ్రీమతి రాయారపు ప్రియదర్శిని (సహ రుణగ్రహీత), శ్రీమతి రాయారపు యాదమ్మ(సహ రుణగ్రహీత), వీరి నివాసం: ఇంటి నెం: 8-4-550/101,నటరాజునగర్, ఎజి కాలనీ సమీపంలో, ఎర్రగడ్డ,హైదరాబాద్,తెలంగాణ-500018. LAN:AP/HDB/GCBL/A000000078.	20/11/2023& రూ.17,36,687/- (రూపాయలు పదిహేడు లక్షల ముప్పై ఆరు వేల ఆరువందల ఎనభైఏడు మాత్రమే)	30/03/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): హైదరాబాద్‌లోని నటరాజునగర్ వద్ద మున్సిపల్ నెం.8-4-550/101 గల ఇల్లు మొత్తం, 101 చ.గజాల విస్తీర్ణం గలది, మరియు సరిహద్దులు:- ఉత్తరం: 20'-0' వెడల్పు రోడ్డు, దక్షిణం: ఇంటి నెం.8-4-550/102, తూర్పు:18'-0' వెడల్పు రోడ్డు, పడమర: 18'-0' వెడల్పు రోడ్డు.		
6	శ్రీమతి శిరీష బొల్లినేని (రుణగ్రహీత). 2) శ్రీమతి జ్యోతి యలమంచిలి (సహ రుణగ్రహీత), ఇద్దరి నివాసం: ఇంటి నెం.19-171/1/102, ఫ్లాట్ నెం: 102, 'పార్క్ వ్యూ రెసిడెన్సీ'లోని మొదటి అంతస్తు, రోడ్డు నెం-22,'హెచ్ఎంటి-స్వర్ణపురి', మియాపూర్, హైదరాబాద్,తెలంగాణ-500049. LAN:AP/HDB/HYDB/A000000515.	28/12/2023 & రూ.12,16,015/- (రూపాయలు పన్నెండు లక్షల పదహారువేల పదిహేను మాత్రమే)	30/03/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ పట్టణం మరియు మండలం, పట్టణ మున్సిపల్ లిమిట్స్ కింద అమీన్‌పూర్ వద్ద సర్వే నెం.331లోని ఓపెన్ ప్లాట్ నెంబర్లు: 171 మరియు 172లపై నిర్మింపబడినది, 'పార్క్ వ్యూ రెసిడెన్సీ'లో మున్సిపల్ నెం.19-171/1/102 గల మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.102లోని మొత్తం, 1000 చ.గజాల బిల్టప్ ఏరియాతో గల మొత్తం 400 చ.గజాల విస్తీర్ణంలోని 30 చ.గజాల అవిభాజ్య భాగంలోని వాటాతోపాటు, ఒక కారు పార్కింగ్ గల కామన్ ఏరియాతో కలిపి, ఆర్‌సిసి రూఫ్‌తో కప్పబడినది, ఇక్కడి అనుబంధంలోని ప్లాన్‌లో చూపినట్లు.. ఫ్లాట్ సరిహద్దులు:- ఉత్తరం: కారిడార్ మరియు ఫ్లాట్ నెం.101, తూర్పు:ఓపెన్ టు స్కై, దక్షిణం:ఓపెన్ టు స్కై, పడమర:ఓపెన్ టు స్కై మరియు ఫ్లాట్ నెం.103,. ఆస్తి సరిహద్దులు:-ఉత్తరం: ప్లాట్ నెం.173, తూర్పు: పొరుగువారి భూమి, దక్షిణం:ప్లాట్ నెం.170, పడమర:30' వెడల్పు రోడ్డు.		
7	శ్రీమతి దేవీబాయి కొర్ర (రుణగ్రహీత). 2) శ్రీ హీరాసింగ్ కొర్ర (సహ రుణగ్రహీత), ఇద్దరి నివాసం: ఇంటి నెం:1-54/45, ద్వారకానగర్ కాలనీ, కృష్ణ టెంపుల్ సమీపంలో, మదీనాగూడ, హైదరాబాద్,తెలంగాణ-500049. LAN:AP/HDB/KKTP/A000000025.	20/12/2023 & రూ.12,67,747/- (రూపాయలు పన్నెండు లక్షల అరవై ఏడు వేల ఏడువందల నలభై ఏడు మాత్రమే)	30/03/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి):-షెడ్యూల్-ఎ:రంగారెడ్డి జిల్లా,శేరిలింగంపల్లి మండలం మరియు మున్సిపాలిటీ, పాత మదీనాగూడ గ్రామం వద్ద గ్రామ కంఠంలోని ఇంటి నెం.1-54/45/బి లోని మొత్తం, విస్తీర్ణం 80.00 చ.గజాలు లేదా అందుకు సమానమైన 66.88 చ.మీటర్లు,. సరిహద్దులు:- ఉత్తరం: ఇంటి నెం.1-54/45, తూర్పు:ఇంటి నెం.1-54/45/ఎ, దక్షిణం:30' వెడల్పు రోడ్డు, పడమర:25' వెడల్పు రోడ్డు.. షెడ్యూల్-బి: రంగారెడ్డి జిల్లా,శేరిలింగంపల్లి మండలం మరియు మున్సిపాలిటీ, పాత మదీనాగూడ గ్రామం వద్ద గ్రామ కంఠంలోని ఇంటి నెం.1-54/45 లోని మొత్తం, మొత్తం 80.00 చ.గజాలలోని 40.00 చ.గజాలు విస్తీర్ణం లేదా అందుకు సమానమైన 33.44 చ.మీటర్లు గలది,. సరిహద్దులు:- ఉత్తరం: ఇంటి నెం.1-54/46, తూర్పు:ఇంటి నెం.1-54/45/ఎ, దక్షిణం:ఇంటి నెం.1-54/45/బి, పడమర:25' వెడల్పు రోడ్డు.		

ప్రదేశం: హైదరాబాద్, తేది: 02-04-2024

సం/- (అధీకృత అధికారి), హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఎన్నికలపై ఏఐ

ఓటర్లను ప్రభావితం చేయనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- సాంకేతికతను విస్తృతంగా వాడుకుంటున్న పార్టీలు
- సోషల్ మీడియాలో ఏఐ ఆధారిత వీడియోలు, ఫొటోలు
- ఇలాంటి వాటి ద్వారా ప్రభావితమవ్వద్దు
- వాస్తవమేదో.. కల్పితమేదో గ్రహించాలి
- ప్రజలకు సాంకేతిక నిపుణుల సూచన
- తప్పుదారి పట్టించే ఏఐ కంటెంట్‌పై నిఘా అవసరం

రాజకీయ విశ్లేషకులు, సామాజిక కార్యకర్తల సూచన

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) గురించి తీవ్ర చర్చ నడుస్తున్నది. అగ్రదేశాల నుంచి పేద, మధ్య తరగతి దేశాలకూ ఈ సాంకేతికత ఎంతో కొంతవరకు అందుబాటులోకి వచ్చింది. ఈ సాంకేతిక పరిజ్ఞానం ఎంత ఉపయోగకరమో.. అంతకు మించిన నష్టాన్ని కలగ చేయచ్చని నిపుణులు చెప్తున్న మాట. సదుద్దేశంతో మంచి పనులకు వాడినంత వరకు ఎలాంటి సమస్యా ఉండదనీ, ఆ హద్దును దాటితేనే అసలు సమస్యలు మొదలవుతాయని అంటున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ కీలక ఎన్నికల్లో ఏఐ ప్రభావం కచ్చితంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలతో పాటు.. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. తమ బలానికి ప్రత్యర్థి బలహీనత తోడైతే విజయం తమదేనన్న అంశాన్ని పట్టుకున్నాయి. దీంతో ఏదో ఒక సందర్భంలో ప్రత్యర్థి చేసిన 'సెల్ఫ్ గోల్' వ్యాఖ్యలను ప్రచారంగా వాడుకుంటున్నాయి. ఇందుకు సోషల్ మీడియాను ప్రధాన వేదికగా వాడుకుంటున్నాయి. మరికొన్ని పార్టీలైతే ఇంకొక అడుగు ముందుకేసి.. ఏఐ నుంచి రంగంలోకి దింపుతున్నాయి. తమ పార్టీ అగ్రనాయకులు, పోటీలో ఉన్న అభ్యర్థుల గొంతులను పోలిన సందేశాలను, ప్రసంగాలను ఏఐ నుంచి సృష్టిస్తున్నారు. అలాగే, వారి చిత్రాలనూ ఏఐ సహాయంతో ప్రజలను ఆకట్టుకునే విధంగా రూపొందిస్తున్నారు. ఆయా పార్టీల ఐటీ, సోషల్ మీడియా టీమ్‌లు.. వీటిని సామాజిక మాధ్యమాల్లో ఒదులుతున్నాయి. ఇలాంటి ఏ.ఐ ఆధారిత, తయారీ వీడియోలు నెటిజన్లను ఆకర్షిస్తూ వైరల్‌గా మారుతున్నాయి.

మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అనంతరం ఆయన భార్య సునీత కేజ్రీవాల్ కెమెరాల ముందుకొచ్చి ఆయన సందేశాన్ని హిందీలో చదివి వినిపించారు. అయితే, దీనికి సంబంధించిన ఇంగ్లీషు అనువాద సందేశం.. ఆయన గొంతుతోనే ఏఐ ద్వారా తయారు చేయబడి, సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఆయన వ్యాఖ్యలను మాత్రం బీజేపీ తన ఐటీ టీం సహాయంతో కేజ్రీవాల్‌ను ఒక దయ్యంలా చూపించే ప్రయత్నాన్ని చేసింది. ఒక బాలీవుడ్ చిత్రంలోని కొన్ని సెకన్ల నిడివి గల వీడియోకి కేజ్రీవాల్ మాటలను జతపరుస్తూ వీడియోను తయారు చేసి సామాజిక మాధ్యమంలో బీజేపీ ఒదిలటం గమనార్హం.

మరింత నిఘా అవసరం

ప్రస్తుతం ఎన్నికల సమయం కావటంతో ఏఐ ఆధారిత వీడియోలు, ఫోటోలను రాజకీయ పార్టీలు తమ ప్రచారం కోసం పెద్ద ఎత్తున విడుదల చేసే అవకాశం ఉన్నది. అయితే, తప్పుదోవ పట్టించనంత వరకు అవి సమర్థనీయమేననీ, ఫేక్ వీడియోలతోనే అసలు సమస్య అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. చట్టాలను మరింత కఠినంగా అమలు చేసి, వివాదాస్పద ఏఐ కంటెంట్‌పై దృష్టిని సారించి, సోషల్ మీడియాపై మరింత ఎక్కువ నిఘా పెట్టాల్సిన అవసరం ఉన్నదని సామాజిక కార్యకర్తలు ఎన్నికల సంఘాన్ని కోరుతున్నారు. ఏఐ ద్వారా తప్పుడు కంటెంట్‌తో ఓటర్లను ప్రభావితం చేసే వీడియోలు, చిత్రాలు, సమాచారంపై కఠిన చర్యలు తీసుకొని, ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉన్నదని వారు అంటున్నారు.

ఏఐ కంటెంట్‌పై 'డీప్'గా ఆలోచించాలి : నిపుణులు

భారత్ ఎన్నికల సీజన్‌లోకి వస్తున్నందున రాజకీయ నాయకుల సింథటిక్, డీప్‌ఫేక్‌లు విస్తృతంగానే వైరలవుతున్నాయి. దివంగత మాజీ సీఎం ఎం. కరుణానిధి డీఎంకే పార్టీ క్యాడర్‌ను ఉద్దేశిస్తూ ప్రసంగిస్తున్నట్టుగా ఏఐను ఉపయోగించి రూపొందించారు. అలాగే, చెన్నైలో ఒక సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ తమిళ డబ్ కూడా ఇందులో భాగమే. అయితే, రాజకీయ పార్టీలు ఈ టెక్నాలజీని ఉపయోగించుకుంటున్న తీరు వారికి కావాల్సిన ప్రచారాన్నే తీసుకొస్తున్నప్పటికీ.. డీప్‌ఫేక్‌ల గురించి సాంకేతిక నిపుణులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల వినియోగం ప్రజల్లో పెరిగిపోవటంతో.. ఇలాంటి డీప్‌ఫేక్‌లు వారికి త్వరగా చేరుకుంటున్నాయని చెప్తున్నారు. వాస్తవికమైన వీడియోలను పోలినట్టు ఉండే ఈ ఏఐ ఆధారిత వీడియోలు ప్రజలను గందరగోళానికి గురి చేస్తాయనీ, గతంలో పలు సందర్భాల్లో ఇది స్పష్టమైందని సాంకేతిక నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి వీడియోల పట్ల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలనీ, చూసిన ప్రతి ఒక్క వీడియోనీ, ఫోటోను నిజమని నమ్మకుండా చెక్ చేసుకోవాలని సూచిస్తున్నారు.



సీపీఐ(ఎం) అభ్యర్థిది ప్రజా ఉద్యమ చరిత్ర

ఆదరించి గెలిపించండి

కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

- 19న జహంగీర్ నామినేషన్
- హాజరుకానున్న ఏచూరి, బృందాకరత్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

సాధారణ నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, 35 సంవత్సరాలుగా ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్‌ను ఆదరించి గెలిపించాలని కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలోని లక్ష్మీగార్డెన్‌లో సోమవారం సీపీఐ(ఎం) నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నాయకులు ఎంఏ ఇక్బాల్, దుపటి వెంకటేష్, బోలగాని జయరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి శ్యామల కిరణ్‌కుమార్ రెడ్డిని, బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశంను నియోజకవర్గంలో ప్రజలు ఎవరూ గుర్తు పట్టరన్నారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన బూర నర్సయ్యగౌడ్‌తోపాటు ఇతర పార్టీల అభ్యర్థులందరూ.. డబ్బులు సంపాదించడం, ఆస్తులను కాపాడు కోవడం కోసం తరచూ పార్టీలు మారుతూ పోటీలో ఉంటున్నారని విమర్శించారు. సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్ నీతి నిజాయితీతో పాటు మచ్చలేని మనిషి అని చెప్పారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి జహంగీర్‌ను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. బీజేపీ దేశంలో ప్రమాదకరమైన పార్టీగా మారిందన్నారు. ప్రశ్నించే వారిని అణగదొక్కడం, సీబీఐ ఈడీ, సీఐడీతో బెదిరింపులు, కేసులు, అరెస్టు చేయించడంతో ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ ముస్లిముల మధ్య తగాదాలు పెంచుతున్నారన్నారు. ఎదురు నిలబడి ప్రశ్నిస్తున్న ప్రాంతీయ పార్టీల నాయకులు కేజ్రీవాల్, కవిత వంటి నాయకులను ఈడీ, సీఐడీ, సీబీఐ సంస్థలతో అరెస్టు చేయించి జైళ్లలో పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏర్పర్చిన రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారన్నారు. దేశంలో 50 ఏండ్ల తర్వాత ప్రతిపక్షాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి బీజేపీ విధానాలను నిరసిస్తూ.. ఢిల్లీలో రాంలీలా మైదానంలో సభ ఏర్పాటు చేశారని చెప్పారు.

సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో అనేక పదవులు పొంది ఆ తర్వాత బీజేపీలో చేరి ఆస్తులు కాపాడుకోవడానికి బూర నర్సయ్యగౌడ్ మళ్లీ పోటీ చేస్తున్నారని చెప్పారు. సీపీఐ(ఎం) ఉద్యమ ఫలితంగానే ఆలేరు గొలనుకొండలో, మాటూరులో భూ పంపిణీ జరిగిందని చెప్పారు. పిట్టలగూడెంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. కట్కూరి సుశీలాదేవి, రాఘవరెడ్డి, ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి లాంటి కమ్యూనిస్టులు ఏనాడూ పదవుల కోసం పాకులాడ లేదని, ప్రజల కోసమే బతికారని చెప్పారు. తాను 1992 నుంచి ప్రజా ఉద్యమంలో ఉన్నానని, ఏనాడూ పదవుల కోసం ఎదురు చూడలేదని అన్నారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడే తనకు ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏప్రిల్ 19వ తేదీన నామినేషన్ కార్యక్రమానికి సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్ హాజరవుతారని చెప్పారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ జగదీష్ మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మంగ నరసింహులు, కల్లూరు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి

వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ-చిట్యాలటౌన్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మతతత్వ పార్టీ బీజేపీని ఓడించి, వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక మేకల లింగయ్య స్మారక భవనంలో వ్యకాస జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు అధ్యక్షతన జరిగింది. అనంతరం వెంకట్ మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు, ప్రజలను చైతన్యం చేయడం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటి నుంచి జూన్ 1 వరకు సభలు, సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఒకే దేశం, ఒకే నాయకుడు, ఒకే పార్టీ అనే నినాదంతో హిట్లర్ విధానాలను మోడీ అమలు చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. వామపక్షాల మద్దతుతో 2005లో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు 4శాతం కేటాయిస్తే.. మోడీ ప్రభుత్వం 1.5శాతానికి తగ్గించిందని తెలిపారు. నిధుల లేమి, యంత్రాలతో పనులు చేయించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కరువైందన్నారు. వ్యవసాయ కార్మికులు తమ ప్రాంతాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని తెలిపారు. నరేంద్ర మోడీ మళ్ళీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా ఎత్తేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. మతం, కులం, జాతుల పేరుతో దేశంలోని ప్రజల మధ్య విభేధాలు సృష్టిస్తున్నారన్నారు. రాముని పేరుతో రాజకీయం చేస్తూ బీజేపీ నాయకులు బరితెగించి రాజ్యాంగాన్ని మారుస్తామని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను అణగదొక్కడంలో భాగంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌ను జైలులో పెట్టడం, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూతురు మీద కేసు పెట్టడం దారుణం అని అన్నారు.

రాష్ట్రంలో ఇండ్లు లేని వ్యవసాయ కార్మికులు గుడిసెలు వేసుకుంటే వాటిని తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కేరళ ప్రభుత్వం మాదిరిగా రోజుకు రూ.600 కూలి, 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి మహమ్మద్ జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి, రవి నాయక్, సరోజన తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలి

- రానే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ యూనియన్ సమావేశంలో.. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవ తెలంగాణ-గజ్వేల్

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద కార్మిక, ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని టీవైఆర్ గార్డెన్‌లో రానే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ యూనియన్ (సీఐటీయూ) జనరల్ బాడీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ కార్మిక చట్టాలన్నింటిని రద్దు చేసి ప్రజాస్వామ్యం లేకుండా చేసిందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు అన్నింటిని రద్దుచేసి యజమాన్యాలకు అనుకూలంగా కోడ్లు రూపొందించడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతు చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతు సంఘాలు సంవత్సరం పాటు పోరాటం చేశాయని, ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు రద్దు చేసిందని గుర్తుచేశారు. ప్రజలపై ప్రత్యక్షంగా భారాలు వేస్తూ కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసిందన్నారు. దేశంలో మహిళల, దళితుల, మైనార్టీల మీద దాడులు పెరిగాయని, ప్రజలు అభద్రతాభావంలో ఉన్నారని ఆరోపించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కనీస వేతనం రూ.26,000లకు పెంచాలని గత ప్రభుత్వం పెట్టిన జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కామన్ గోపాలస్వామి, జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, రానే పరిశ్రమ యూనియన్ నాయకులు వేణుగోపాల్, బండ్ల స్వామి, బిక్షపతి, చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, సాజిద్, నర్సింలు, స్వామి, మల్లయ్య, రాజగోపాల్ కార్మికులు పాల్గొన్నారు.

విదేశీయులపై హత్యాయత్నం గీత దాటడమే

అమెరికా రాయబారి ఎరిక్ వ్యాఖ్య

న్యూఢిల్లీ : ఒక దేశానికి చెందిన పౌరుడిని హత్య చేసేందుకు మరో దేశానికి చెందిన ప్రభుత్వం లేదా దాని అధికారులు ప్రయత్నించడం గీత దాటడమే అవుతుందని, ఆ పని సరికాదని భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేస్తున్న ఎరిక్ గార్సెట్టీ వ్యాఖ్యానించారు. అమెరికాలో సిక్కు వేర్పాటు వాది గుర్‌పత్‌వంత్ సింగ్ పన్నున్‌ను హత్య చేసేందుకు జరిగిన కుట్రను ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఎరిక్ ఆదివారం ఎఎన్ఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ ఈ అంశం సార్వభౌమత్వానికి, హక్కులకు సంబంధించిందని చెప్పారు. గీత దాటడం అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు. పన్నున్ ఉగ్రవాది అని భారత్ చెబుతున్నప్పుడు ఆయనను అమెరికా ఎందుకు రక్షిస్తోందని ప్రశ్నించగా భావ ప్రకటనా స్వేచ్ఛ రెండు దేశాలలో వేర్వేరుగా పనిచేస్తుందని ఎరిక్ తెలిపారు. పన్నున్‌ను తామేమీ వెనకేసుకురావడం లేదని అన్నారు. అయితే ఆయనపై మోపిన ఆరోపణలు అక్కడి చట్టాల ప్రకారం నిరూపితం కావాల్సి ఉన్నదని చెప్పారు. కాగా ఎరిక్ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందిస్తూ అది అమెరికా అభిప్రాయమై ఉంటుందని అన్నారు. భారత్‌కు సంబంధించినంత వరకూ తమ వద్ద ఉన్న సమాచారం ఆధారంగా విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ విచారణలో భారత భద్రతా ప్రయోజనాలు కూడా ఇమిడ ఉన్నాయని తెలిపారు.

కేసీఆర్ ప్రతి మాటా అబద్ధమే

- బీఆర్ఎస్ మిగలదన్న భయంలో మాజీ సీఎం
- అతి తక్కువ కాలంలో పతనం కాబోతున్న బీఆర్ఎస్
- ఆయన ఫ్రస్ట్రేషన్, డిప్రెషన్‌లో ఉన్నారు
- నా ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారు :మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంటపొలాల సందర్శన సందర్భంగా రాష్ట్రంలో నీటి సమస్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమేనని రాష్ట్ర సాగునీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మిగలదన్న డిప్రెషన్, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న కేసీఆర్ ఏ మాత్రం సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో ఓడిపోవడమే కాకుండా దేశ చరిత్రలోనే అతి తక్కువ కాలంలో పతనమైన ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్ నిలవబోతోందని ఈ సందర్భంగా ఉత్తమ్ జోస్యం చెప్పారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తప్ప ఆ పార్టీలో ఎవరూ మిగలబోరని చెప్పారు. గొప్పలకు పోయిన కేసీఆర్ రెండోసారి గెలవగానే జాతీయ పార్టీగా మార్చుతున్నట్టు చెప్పారని గుర్తుచేశారు. తన రాజకీయ జీవితంలో ఇంత తొందరగా పతనమవుతున్న పార్టీని తానెక్కడా చూడలేదని ఎద్దేవా చేశారు. నల్లగొండ సభలో జనరేటర్ పెట్టుకుని, కరెంట్ పోయిందని పచ్చి అబద్ధం చెప్పే స్థితికి కేసీఆర్ దిగజారారని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన ఒకే ఒక విద్యుత్ ప్రాజెక్టు భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్ అని తెలిపారు. కాలం చెల్లిన సాంకేతికతతో అది ప్రజలకు భారంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఒక్క నిమిషం కూడా విద్యుత్‌కు అంతరాయం లేదని స్పష్టం చేశారు. ఎన్టీపీసీకి కేసీఆర్ సహకరించి ఉంటే రాష్ట్రానికి 4 వేల మెగావాట్ల విద్యుత్ వచ్చి ఉండేదని తెలిపారు. ఖర్చుకు వెనకాడకుండా 24 గంటల కరెంటు సరఫరాతో పాటు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్ హయంలో మొదలుపెట్టిన ఏ విద్యుత్ ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని విమర్శించారు.

గత పదేండ్లలో పంట నష్టం జరిగితే రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వని కేసీఆర్‌కు సాగునీటి గురించి మాట్లాడే అర్హతే లేదని ఉత్తమ్ విమర్శించారు. రైతులకు పంట బీమా ఇవ్వలేదనీ, దేశంలోనే పంట బీమా లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను చేసిన పాపం బీఆర్ఎస్ దేనని చెప్పారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్తామని కేసీఆర్ ఒప్పుకున్నారని ఆరోపించారు. ఏపీ సీఎం జగన్‌తో కలిసి ఆయన ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాలపై కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందని చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు నీటి పారుదల రంగాన్ని సర్వనాశనం చేసిందని చెప్పారు. రాష్ట్రంలో వచ్చిన కరువును సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని ఉత్తమ్ తెలిపారు. కమిషన్ల కోసం ప్లాన్, డిజైన్లు లేకుండా ప్రాజెక్టులు నిర్మించిన మాజీ సీఎంకు కాళేశ్వరం గురించి మాట్లాడేందుకు సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టు వారి హయాంలోనే కూలిపోయిందని గుర్తుచేశారు. కాళేశ్వరం నిర్వహణ కోసం విద్యుత్ ఖర్చు ఏడాదికి రూ.10 వేల కోట్లు అని తెలిపారు. ఈ విషయంపై రైతులకు బేషరతుగా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు తటస్థంగా ఉండాలని కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. పోలీసు శాఖను దుర్వినియోగం చేసిందే కేసీఆర్ అని మండిపడ్డారు.

నా ఫోన్ ట్యాప్ చేశారు...ఉత్తమ్

బీఆర్ఎస్ హయాంలో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన పెద్ద తలకాయలు జైలుకు పోయే పరిస్థితి ఉందని చెప్పారు. ఆ కేసు సీరియస్ కేసు అనీ, ఎవరి అనుమతితో చేశారనేది తేలాల్సి ఉందన్నారు. అనుమతి లేకుండా ఫోన్ ట్యాప్ చేయడం పెద్ద నేరమన్నారు. రాష్ట్రంలో 200 మంది బీఆర్ఎస్ నేతలు పార్టీని వదిలేశారే గానీ, 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోలేదని అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కొట్టిపారేశారు. ఒకవైపు కూతురు జైల్లో ఉంది..కాళేశ్వరంలో ఇంకా ఏమవుతుం దో... రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. సీఎం సహా మంత్రులందరం పనిలో ఉంటున్నాం ... కేసీఆర్ తీరుగా ఫార్మ్ హౌస్‌లో ఉండటం లేదు. క్రమం తప్పకుండా రివ్యూలు చేస్తున్నాం... దీంతో కేసీఆర్‌లో చివరకు ఏమవుతుందనే భయం పట్టుకుందని తెలిపారు.

నార్సింగిలో రెచ్చిపోయిన పోకిరి ముఠా

నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా నార్సింగిలో పోకిరి ముఠా రెచ్చిపోయింది. యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాక, దాన్ని ప్రశ్నించినందుకు యువతి తల్లిదండ్రులపై సైతం కత్తులతో దాడి చేసింది. ఈ ఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లాకు చెందిన రాముడు కుటుంబం గండిపేట్ మండలం మణికొండ మున్సిపాలిటీలోని పుప్పాలగూడ గ్రామం నెమలినగర్ కాలనీలో నివాసం ఉంటోంది. సోమవారం అతని కూతురు కాలనీలో ఉన్న అశోక్ కిరాణా షాపునకు వెళ్లింది. అక్కడ సురేష్ అనే వ్యక్తి యువతి చెయ్యి పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఆమెపై దాడి చేశాడు. హెూలీ పండుగ రోజు తప్పించుకున్నా వంటూ ఆమెపై నీళ్లు పోశారు. అతని నుంచి యువతి తప్పించుకుని ఇంటికి వెళ్లి.. షాప్ వద్ద జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు జరిగిన ఘటనపై సురేష్‌ను ప్రశ్నించారు. రెచ్చిపోయిన సురేష్, ప్రవీణ్ యువతి తండ్రిపై కత్తులతో దాడి చేశారు. ప్రవీణ్ తన వద్ద ఉన్న తల్వార్‌తో గొంతు కోసే ప్రయత్నం చేశారు. అడ్డుకోబోయిన తల్లి, బిడ్డపై కూడా దాడి చేశారు. అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేశారు. స్థానికులు గమనించి గాయపడిన యువతి తండ్రిని ఆస్పత్రికి తరలించారు. పోకిరీ ముఠాపై యువతి తల్లి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు తల్వార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 307, నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఊరట

- పార్టీపై బలవంతపు చర్యలుండవు
- సుప్రీంకోర్టుకు ఐటీ విభాగం వెల్లడి
- తదుపరి విచారణ జులై 24కు వాయిదా



న్యూఢిల్లీ : కాంగ్రెస్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కాంగ్రెస్ నుంచి రూ.1700 కోట్ల రికవరీ కోసం లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎలాంటి బలవంతపు చర్యా ఉండబోదని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించింది. ఐటీ శాఖ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కేంద్ర ఏజెన్సీ ఎన్నికల సమయంలో ఏదైనా పార్టీకి సమస్యలు సృష్టించాలనుకోవటంలేదని కోర్టుకు వివరించారు. కాగా, ఈ కేసులో తదుపరి విచారణను న్యాయస్థానం జులై 24కు వాయిదా వేసింది. అప్పటి వరకు భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు ముగిసి ఫలితాలు విడుదలవనున్నాయి. ఐదేండ్లకు (1994-95, 2017-18 నుంచి 2020-21 వరకు) గానూ రూ.1823 కోట్లను చెల్లించాలని కొన్ని రోజుల కింద ఐటీ శాఖ కాంగ్రెస్‌కు నోటీసులు పంపిన విషయం విదితమే. అంతటితో ఆగకుండా, 2014-15 నుంచి 2016-17 సంవత్సరాలకు సంబంధించి రూ.1745 కోట్లు చెల్లించాలంటూ గత శనివారం కేంద్ర ఏజెన్సీ కాంగ్రెస్‌కు మళ్లీ తాఖీదులు అందించిన విషయం తెలిసిందే. దీంతో ఈ నోటీసుల ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఐటీ శాఖకు చెల్లించాల్సిన మొత్తం రూ.3,567 కోట్లకు చేరింది. అంతేకాకుండా, గత బకాయిలను చూపిస్తూ కాంగ్రెస్ ఖాతాల నుంచి ఐటీ అధికారులు రూ.135 కోట్లను కూడా రికవరీ చేశారు.

లోక్‌సభ ఎన్నికల సమయంలో ఐటీ శాఖ నుంచి ఇలా వరుస నోటీసులు అందటం కాంగ్రెస్‌ను కలవరానికి గురి చేసింది. ఈ నోటీసులను 'ట్యాక్స్ టెర్రరిజం'గా అభివర్ణించింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు తమ పార్టీని ఆర్థికంగా దెబ్బ తీయాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆరోపించింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ విచారణ సోమవారం న్యాయస్థానం ముందుకు రావటంతో ఐటీ శాఖ పై విధంగా స్పందించింది. దీంతో ఇది కాంగ్రెస్‌కు ఒకింత మానసిక బలాన్ని అందిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

సమస్యలను పరిష్కరించండి

- మంత్రికి ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆయన నివాసంలో కలిసిన నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి తమ వినతిపత్రంపై సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వి.రాకేష్, కార్యదర్శి డాక్టర్ హరి ప్రకాష్ తదితరులున్నారు.

సంపాదకీయం

'టాక్స్' టెర్రరిజం

ప్రతిపక్షం లేని ప్రజాతంత్ర వ్యవస్థను సృష్టించడం కోసం మోడీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం వేయని ఎత్తులు లేవు. ఆర్థికంగా ప్రతిపక్షం పీక నొక్కడం ద్వారా 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అన్న మోడీ 'కల' నెరవేర్చుకునేందుకు ఇదొక పన్నాగం కావచ్చు. దేశంలో అధికార పక్ష నేతల నుంచి కార్పొరేట్ సంస్థల అధినేతల వరకు ఎంతో మంది పన్ను ఎగవేతదారులున్నారు. అంతేందుకు నిన్నగాక మొన్న నీరవ్ మోడీ ఆస్తులు వేలానికి లండన్ కోర్టు అనుమతి ఇచ్చింది. సదరు నేత మన దేశానికి చెల్లించాల్సిన పన్ను బకాయిలెంత? దేశం వదిలి పారిపోయిన విజయ్‌మాల్యాలెందరు? అలాంటి వారిని వదిలేసి అసలు పన్నే కట్టనక్కరలేని రాజకీయ పార్టీలకు జరిమానాలు విధిస్తూ నోటీసులు మీద నోటీసులు జారీ చేయడం దేనికి సంకేతం? అంటే 'విశ్వగురు'కు ఎక్కడో ఓటమి భయం పట్టుకుంది. 370 గ్యారంటీ అంటూ మోగించిన కంచు ఢంకా ఇప్పుడెందుకో ఓటుపోతుంది.

> ఎన్నికల బాండ్లలో బీజేపీ బండారం బయటపడిన వెనువెంటనే కేంద్రం కాంగ్రెస్‌పై ఆదాయ పన్ను శాఖను ఉసిగొల్పింది. ఎన్నికల ముంగిట లెక్కా పత్రం, హద్దూ పద్దూ లేని జరిమానాలు విధించి ప్రతిపక్షాలను ఎన్నికల ప్రచారం కూడా చేసుకోనియకుండా ముందే ముందరి కాళ్లకు బంధాలు వేస్తోంది అధికార పక్షం. కాబట్టి ఇది ముమ్మాటికీ 'టాక్స్ టెర్రరిజ'మే. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని దర్యాప్తుసంస్థలు బీజేపీ అనుబంధ విభాగాలుగా పనిచేస్తున్నాయి.

కాంగ్రెస్ సహా సీపీఐ, సీపీఐ(ఎం)లకు సైతం ఆర్థిక శాఖ నోటీసులు జారీ చేసింది. లెక్కలు సరిగ్గా లేవంటున్న మొత్తం రూ.లక్షల్లో ఉంటే, వీరు విధించిన జరిమానాలు మాత్రం కోట్లలో ఉండటం విచిత్రం. మోడీ లక్ష్య సాధనకోసం ఆదాయపు పన్ను శాఖ నిర్లజ్జగా తన శాఖ సకల నియమాలను బాహాటంగా ఉల్లంఘించి బీజేపీ చేతిలో పరిచారికగా మారింది. మొత్తంమీద కాంగ్రెస్‌కు సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసింది. ఎన్నికలు జరగనున్న సమయంలో ఇలా ప్రధాన ప్రతిపక్ష పార్టీ బ్యాంకు ఖాతాలు జప్తు చేయడం అంటే ఆ పార్టీని ఆర్థికంగా నిస్తేజం చేయడమే. అంటే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తమ నాయకుల పర్యటన కోసం కనీసం రైలు టికెట్లు కొనే స్థితిలో కూడా లేకుండా చేయాలని మోడీ ప్రభుత్వం ఆలోచన.

లెక్కలు చూపడంలో కాంగ్రెస్ నెల రోజులు అలస్యం చేసిందట. ఇంకా విచిత్రం ఏమిటంటే ఆదాయపు పన్ను శాఖ అధికారులు కాంగ్రెస్ ఖాతాలున్న బ్యాంకులకు వెళ్లి అక్కడి సిబ్బందిని బెదిరించి, భయపెట్టి కాంగ్రెస్ ఖాతాల నుంచి రూ.115 కోట్లు ఆదాయపు పన్ను శాఖకు బదిలీ



చేయించుకుంది. ఈ క్రమం అంతా చూస్తూ ఉంటే మోడీ ప్రభుత్వ తాత్పర్యమేమిటో ఎవరో చెప్పాల్సిన పనిలేదు. 2017-18 నాటి లెక్కలు చూపనందుకు కూడా కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను జప్తు చేశారట. ఇంతకుముందు ఆరేండ్ల తరవాత పాత కేసులు తవ్వి తీసేవారు కాదు. 2022లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఆరేండ్ల గడువు కాస్తా మూడేండ్లకు తగ్గించారు కదా! మరి ఈ దాడులేంటి?


నిజానికి రాజకీయ పార్టీలు ఆదాయం పన్ను చెల్లించనవసరం లేదు, కానీ లెక్కలు మాత్రం ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలి. ఈ విషయంలో కాంగ్రెస్ పొరపాటు చేసిందనే అనుకున్నా బ్యాంకు ఖాతాలు జప్తు చేయించడానికి ఎన్నుకున్న సమయం ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టంగానే తెలుస్తోంది. కాంగ్రెస్ చూపాల్సిన లెక్కల్లో 0.7 శాతం లెక్కలు చూపనందుకే ఇంత తీవ్రమైన చర్య తీసుకోవడం వెనక విపక్షాలను ఎన్నికల సమయంలో ఆర్థికంగా అశక్తం చేయాలన్న కుట్ర దాగి ఉందనుకోవడానికన్నా మించిన కారణం ఏమీ కనిపించడం లేదు. ప్రజాస్వామ్యం గొంతు నొక్కడానికే తమ బ్యాంకు ఖాతాలు జప్తు చేశారని కాంగ్రెస్ ఆక్రోశించింది. సీపీఐ(ఎం) సైతం ' మేం ఎలాంటి తప్పు చేయలేదని, ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు మేం వ్యవహరిస్తున్నామని' స్పష్టం చేసింది. అయినా, ఆదాయ పన్ను శాఖ తమ నోటీసుల పర్వం కొనసాగిస్తూనే ఉంది. ప్రభుత్వం కాంగ్రెస్ విషయంలోనో, వామపక్షాలపైనో ఈ దుర్నీతికి పాల్పడిందని సరిపెట్టుకోవడానికి వీల్లేదు. ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారందరూ తీవ్రంగా పట్టించుకోవలసిన అంశమిది.

ఎన్నికల బాండ్లలో బీజేపీ బండారం బయటపడిన వెనువెంటనే కేంద్రం కాంగ్రెస్‌పై ఆదాయ పన్ను శాఖను ఉసిగొల్పింది. ఎన్నికల ముంగిట లెక్కా పత్రం, హద్దూ పద్దూ లేని జరిమానాలు విధించి ప్రతిపక్షాలను ఎన్నికల ప్రచారం కూడా చేసుకోనియకుండా ముందే ముందరి కాళ్లకు బంధాలు వేస్తోంది అధికార పక్షం. కాబట్టి ఇది ముమ్మాటికీ 'టాక్స్ టెర్రరిజ'మే. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని దర్యాప్తు సంస్థలు బీజేపీ అనుబంధ విభాగాలుగా పనిచేస్తున్నాయి. మరో వైపు జార్ఖండ్ (మాజీ) సీఎం సోరెన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌లను అరెస్టు చేయడం, ఇతరులను దర్యాప్తుల పేరుతో వేదించడం, ఇదంతా గమనిస్తే ఎన్నికల్లో ఓటమి కమల దళాన్ని ఎంతలా కలవరపెడుతోందో అర్థమవుతుంది. కాంగ్రెస్ ముక్త్ భారత్ కాదు వీరి లక్ష్యం. ప్రతిపక్ష ముక్త్ భారత్. ఏక పార్టీ వ్యవస్థ. రష్యాలో ప్రతిపక్ష నాయకుడు నవలానీ బ్యాంకు ఖాతాలను ఇలాగే జప్తు చేస్తే... వాటిని కోర్టు రద్దుచేసింది. పాకిస్తాన్‌లో ఇమ్రాన్‌ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు షాబాజ్ ఖాతాలు ఇలాగే జప్తు చేయించారు. మన ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్య ఛాయలు ఇసుమంతైనా లేని దేశాల స్థాయికి దిగజారుస్తున్నారు. చట్ట విరుద్ధంగా ప్రతిపక్షాల రెక్కలు కత్తిరించడానికి చట్టాన్నే దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు. జన జాగృతే దీనికి నిష్కృతి.

'ఆటిజం'పై పట్టింపేది?

ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ASD) అనేది న్యూరో డెవలప్మెంటల్ డిజార్డర్. జన్యుపరంగా, జీవశాస్త్ర ఆధారిత రుగ్మతగా దీనికి గుర్తింపు ఉన్నది. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు ఏప్రిల్ 2ను అంతర్జాతీయ ఆటిజండేగా యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించాయి. ప్రపంచవ్యాప్తంగా ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ కలిగిన వారికి అవగాహన పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఐరాస యుఎన్ అసెంబ్లీ తీర్మానం ద్వారా సభ్య దేశాలను ఆదేశించాయి. మానవ హక్కులను మెరుగుపరచడం కోసం ఐరాస అమలు చేస్తున్న వాటిల్లో ప్రపంచ ఆటిజం దినోత్సవం ఒకటి. సభ్యదేశాలు, ఇతర సంబంధిత సంస్థలకు యుఎన్ లేదా ప్రభుత్వేతర సంస్థలు, ప్రయివేటు సెక్టార్‌తో సహా అన్ని స్థాయిలలో ఆటిజం గురించి అవగాహన పెంచుకోవడానికి సభ్య దేశాలు కృషి చేయాలని ఐరాస నిర్ణయించింది. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌పై ఐరాస చేసిన ఒప్పందాలను దేశంలో అమలు చేస్తా మని భారత ప్రభుత్వం కూడా సంతకం పెట్టింది.కానీ ఇప్పటివరకు ఆటిజం పట్ల కేంద్రం సరైన కృషి చేయడం లేదు.

ఆటిజంతో బాధపడుతున్న పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులను అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఆటిజంతో బిడ్డను కలిగి ఉండటం అంత తేలికైన పరిస్థితి కాదు. పిల్లవాడు అనేక సామాజిక సమస్యలను ఎదుర్కోవడమే కాకుండా, పిల్లలకు భద్రత, గౌరవం, అవకాశాలను నిర్ధారించడం



తల్లిదండ్రులకు కూడా కష్టమవుతుంది. ఇది జీవితంలో మొదటి మూడేండ్లలో అభివృద్ధి చెందుతుంది. సామాజిక, కమ్యూనికేషన్ సామర్థ్యాల పరంగా మెదడు సాధారణ అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. ఇది నాడీ సంబంధిత (నాడీ వ్యవస్థ) పరిస్థితి, దీనిలో మెదడుకు సంబంధించిన నాడీ కణాలు సమస్యలను కలిగిస్తాయి. పిల్లలకి 18 నెలల వయస్సు వచ్చేటప్పటికి తల్లిదండ్రులు ఏదో తప్పును గుర్తిస్తారు. పిల్లవాడు ఒకటి లేదా రెండేండ్ల వయస్సు వరకు సాధారణంగా ఉంటాడు. తరువాత సామాజిక, భాషా నైపుణ్యాలను కోల్పోతారు. లక్షణాలు తేలికపాటి నుంచి తీవ్రంగా మారుతాయి. ఆటిజంతో బాధపడే పిల్లలు అందరు ఒకే రకంగా ఉండరు.

ప్రపంచంలో అత్యధికంగా ఆటిజం ఉన్న దేశం ఖతార్, అత్యాల్పంగా ఉన్న దేశం ఫ్రాన్స్. ఆటిజం వ్యాధి నిర్ధారణ అత్యధికంగా ఉన్న దేశం ఫ్లోరిడా. ప్రపంచ జనాభాలో ఒక శాతం మందికి ఆటిజం రుగ్మత ఉంది.2023లో యునైటెడ్ స్టేట్స్‌లోని ప్రతి 36మంది పిల్లల్లో ఒక శాతం మంది ఆటిజంతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరం నుంచి 2023 నాటికి 178 శాతం ఆటిజం ప్రాబల్యం పెరిగింది.గత పదేండ్ల మధ్యకాలంలో 7,07,000 నుంచి 1,11,6000 మంది యుక్త వయస్సు యువకులు పాఠశాలలో ఆటిజం రుగ్మతకు అవసరమైన సేవలు పొందడం లేదు.ఆటిజం కలిగిన పెద్దల్లో 75 శాతం మంది ఉపాధి పొందడం లేదు.25 ఏండ్ల వయసు కలిగిన యువకుల్లో 50శాతం మంది ఉద్యోగం చేయలేకపోతున్నారు. ఆటిజం కలిగిన వారిలో 40శాతం మంది శబ్దం వినలేక పోతున్నారు.78శాతం మంది అటిస్టిక్ రుగ్మత కలిగిన పిల్లలు మరొక మానసిక ఆరోగ్య రుగ్మతను కలిగి ఉంటున్నారు. 80శాతం మంది ఆటిజం కలిగిన పిల్లలు సదవలేకపోవడం, రాయలేకపోవడం చేస్తున్నారు.అమెరికాలో ఆటిజం రుగ్మత కలిగిన వారి ఆరోగ్య సంరక్షణ ఖర్చు 2015లో 268 బిలియన్ డాలర్స్ ఉంటే 2025నాటికి 461బిలియన్ డాలర్స్‌కు పెరుగుతుందని అంచనా.

మన దేశంలో ప్రస్తుతం కోటి 80 లక్షల మంది ఆటిజంతో బాధపడుతున్నారని అంచనా. కానీ ప్రతి 66 మంది పిల్లలలో ఒక్కరికి ఆటిజం సమస్య ఉంది. ఆటిజం సమస్య కలిగిన పిల్లల్లో 40 శాతం మంది పిల్లలు మాట్లాడలేక పోతున్నారు.ఆటిజం బాలికల కంటే అబ్బాయిల్లో నాలుగు శాతం ఎక్కువగా నిర్ధారణ అవుతుందనీ ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ఆటిజంను కూడా అంగవైకల్యంగా గుర్తించింది. కానీ ప్రభుత్వం నేటికీ వారికి వైకల్య ధృవీకరణ పత్రాలివ్వడం లేదు. నేషనల్ ట్రస్ట్ ద్వారా ఆటిజం, సెరిబ్రల్ పాల్సి, మానసిక వికలాంగుల సంక్షేమం కోసం నేషనల్ ట్రస్ట్ ద్వారా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 5 లక్షల మంది పిల్లలు ఆటిజంతో బాధపడుతున్నారు. సికింద్రాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ మెంటల్లి హ్యాండిక్యాప్‌డ్ (ఎన్ఐఎంహెచ్) ఉంది. కానీ అక్కడ సరిపడా సిబ్బంది, పరికరాలు లేదు. జిల్లాల నుంచి ట్రీట్మెంట్ కోసం చంటి పిల్లలతో హైదరాబాద్‌కు రాకుండా ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో ఉచిత థెరపి సెంటర్స్ ప్రారంభించి, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మూడేండ్ల వయసు కలిగిన పిల్లలకు ఆటిజం పరీక్షలు నిర్వహించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆటిజం స్పెషలిస్ట్ డాక్టర్స్‌ను నియమించాలి. ఆటిజంతో బాధపడు తున్న పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసి తల్లిదండ్రులతో పాటు సమాజంలో ఆటిజంపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

- ఎం.అడివయ్య, 9490098713

కార్మిక వర్గం-పుంజుకుంటున్న నయా ఫాసిజం

జర్మన్ తత్వవేత్త వాల్టర్ బెంజమిన్ స్వయంగా ఫాసిస్టు శక్తుల చేతుల్లో బాధితుడు. ఫాసిజం సమాజంలో పై చేయి సాధించడానికి, దానికి ముందు కాలంలో శ్రామికవర్గ విప్లవం విఫలమవడానికి సంబంధముందని ఆయన అన్నాడు. ఆయన దృష్టిలో జర్మనీ అనుభవాలు ప్రధానంగా ఉన్నాయి. 1917 బోల్షివిక్ విప్లవం విజయం సాధించిన అనంతరం, అదే మాదిరిగా జర్మనీలోనూ విప్లవాన్ని సాధించాలన్న ప్రయత్నాలు చాలానే జరిగాయి. కాని ఆ ప్రయత్నాలేవీ విజయవంతం కాలేకపోయాయి. దాంతో అలసిపోయిన కార్మికవర్గం కమ్యూనిస్టులుగా, సోషల్ డెమాక్రాట్లుగా చీలిపోయింది.


ప్రభాత్ పట్నాయక్

ఆ సోషల్ డెమాక్రాట్లు అధికారంలో ఉన్న కాలంలో కమ్యూనిస్టులైన రోజా లక్సెంబర్గ్, కార్ల్ లీబ్‌నెక్ట్ తదితరులు హత్యగావించబడ్డారు. దాంతో ఈ రెండింటి మధ్య రాజీకి గాని, సర్దుబాటుకు గాని అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో 1930 దశకంలో ఆర్థిక సంక్షోభం ఆవరించింది. అప్పుడు ఫాసిస్టు శక్తులు తేలికగా అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. వాటికి గుత్త పెట్టుబడిదారీ వర్గం, అందునా అందులో కొత్తగా తలెత్తిన శక్తులు దన్నుగా నిలిచాయి.

బెంజమిన్ చేసిన సూత్రీకరణ ఇక్కడ ప్రాధాన్యత కలిగివుంది. బలపడుతున్న కార్మికోద్యమానికి పాలకవర్గ ప్రతిస్పందనగా ఫాసిజం తలెత్తుతుంది అన్న నిర్ధారణకు ఈ సూత్రీకరణ భిన్నమైనది. కార్మికోద్యమ పురోగమనం ఆగిపోయిన సందర్భంలో, మళ్లీ ఆ కార్మికోద్యమం బలం పుంజుకోకుండా చేయడానికి పాలకవర్గం ఫాసిజాన్ని బలపరుస్తుంది అని ఈ సూత్రీకరణ చెప్తుంది. ఆర్థిక సంక్షోభం కారణంగా పేదరికం, నిరుద్యోగం హెచ్చుస్థాయిలో పెరిగిన నేపథ్యంలో కార్మికోద్యమం మళ్లీ బలం పుంజుకోకుండా చేయడానికి పాలకవర్గం ఫాసిజాన్ని బలపరుస్తుంది అని అంటుంది. ప్రస్తుతం అనేక ప్రపంచ దేశాల్లో నయా ఫాసిజం బలంగా ముందుకొస్తోంది. భారతదేశంతోబాటు, హంగరీ, అర్జెంటినా, బ్రెజిల్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా వంటి దేశాల్లో ఈ విధమైన పరిణామాలను మనం చూస్తున్నాం. ఐతే, ఈ నయా ఫాసిజం బలపడడానికి ముందు ఈ దేశాల్లో ఎక్కడా కార్మికవర్గ విప్లవాలు విఫలమైన సందర్భాలు లేవు. కాని, బెంజమిన్ ప్రస్తావించిన పరిస్థితి మాత్రం నెలకొంది. ఈ దేశాలలో కార్మికోద్యమాలు బలహీనపడ్డాయి. నయా ఉదారవాద వ్యవస్థ పని చేసిన తీరు ఈ పరిస్థితికి దారితీసింది.

కనీసం మూడు వేర్వేరు మార్గాల్లో నయా ఉదారవాదం కార్మికోద్యమాన్ని బలహీనపరుస్తుంది. మొదటిది: కార్మికోద్యమం జాతీయ ప్రాతిపదికన తన ఉద్యమాన్ని సంఘటితం చేసుకుంటూ ఉంటుంది. కాని రెండోపక్కన పెట్టుబడి మాత్రం ప్రపంచవ్యాప్త స్వభావాన్ని సంతరించుకుంది. జాతీయ స్థాయిలో సంఘటితమైన కార్మికోద్యమం వద్ద ఉన్న సమ్మె అనే ఆయుధంతో అంతర్జాతీయ స్థాయిలో సంఘటితమైన పెట్టుబడిని ఎదుర్కొని నిలవరించడం కష్టం. ఒకవేళ కార్మికవర్గం సమరశీలంగా వ్యవహరించి పోరాటానికి పూనుకుంటే అంతర్జాతీయ పెట్టుబడి వేరే దేశానికి తన పెట్టుబడులను తరలిస్తానని బెదిరిస్తుంది. అందువలన కార్మికవర్గ సమరశీలతకి పరిమితులు ఏర్పడతాయి. అమెరికాలో సగటు పురుష కార్మికుడి నిజ వేతనం 1968లో ఏ స్థాయిలో ఉందో, అంతకన్నా తక్కువ స్థాయిలో 2011 నాటికి ఉన్నది అని ప్రముఖ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిట్జ్ వివరించాడు. కార్మికవర్గ పోరాటశక్తి ఎంతగా కుదించుకుపోయిందో దీనిని బట్టి గ్రహించవచ్చు.

రెండవది: కార్మికవర్గపు రిజర్వు సైన్యం (నిరుద్యోగులు) పనిలో ఉన్న కార్మికవర్గంతో పోల్చినప్పుడు పెరుగుతోంది. ఇదేదో సంక్షోభం ఆవరించిన తర్వాత వచ్చిన పరిణామం అనుకోకూడదు. అంతకు ముందే, సంపన్న పశ్చిమ దేశాల నుండి పెట్టుబడిని వెనుకబడిన మూడవ ప్రపంచ దేశాలకు తరలించిన కారణంగా నిరుద్యోగం పెరగడం ఎక్కువైంది. దీని వలన సంపన్న దేశాలలో అంతవరకూ ఉన్న ఉద్యోగాలు తగ్గిపోయాయి. మరోపక్క మూడవ ప్రపంచ దేశాలలో చిన్న స్థాయి ఉత్పత్తి వ్యవస్థ మీద, ముఖ్యంగా రైతాంగ వ్యవసాయం మీద కొత్తగా వస్తున్న అంతర్జాతీయ పెట్టుబడి దాడి చేసి విధ్వంసం చేసిన కారణంగా ఆ చిన్న ఉత్పత్తిదారులు, చేతివృత్తుల తరగతులు, పేద రైతాంగం సర్వమూ కోల్పోయి వీధిన పడుతున్నారు. వీరందరూ బతుకు తెరువు కోసం పట్టణాలకు వలసలు పోతున్నారు. ఇప్పటికే పట్టణాలలో ఉన్న ఉద్యోగావకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. దానికి తోడు ఈ వలసలు పెరగడం వలన ఉద్యోగాల కోసం పోటీ తీవ్రమౌతోంది. దీని ఫలితంగా కార్మికవర్గం బలహీనపడుతోంది. ఆర్థిక సంక్షోభం తలెత్తకమునుపే ఈ పరిణామం మొదలైంది.

మూడవది:నయా ఉదారవాద విధానాలలో భాగంగా ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించడం జరుగుతోంది. సాధారణంగా ప్రయివేటు రంగంలో కన్నా ప్రభుత్వ రంగంలో కార్మికులు మెరుగ్గా సంఘటితమవుతారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్నదే. ఉదాహరణకు: అమెరికాలో ప్రయివేటు రంగంలో ఏడుశాతం మంది కార్మికులు యూనియన్లలో సంఘటితం అయివున్నారు. అదే ప్రభుత్వ రంగంలో చూస్తే (విద్యారంగం కూడా కలుపుకుని) 33 శాతం యూనియన్లలో ఉన్నారు. ప్రయివేటీకరణ విధానం వలన కార్మికవర్గపు సంఘటిత శక్తి సన్నగిల్లిపోతుంది. ఐతే ఈ అంశాన్ని దాదాపు ఎవరూ చర్చించడం లేదు. ప్రయివేటీకరణ ఫలితంగా సృజనాత్మకత దెబ్బ తింటుందని, దేశ ఆర్థిక వ్యవస్థ తన స్వావలంబనను కోల్పోతుందని, పెట్టుబడి మరింతగా పరాన్నభుక్కుగా

> జర్మనీలో కార్మికవర్గ విప్లవం విఫలమైన తర్వాత ఫాసిజం బలంగా ముందుకొచ్చిందని బెంజమిన్ చేసిన సూత్రీకరణ ప్రాతిపదికన ఇప్పుడు మనం పరిశీలిస్తే, నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా కార్మిక వర్గ పోరాట శక్తి బలహీన పడిన నేపథ్యంలో నయా ఫాసిజం ముందుకు రావడం కనిపిస్తుంది. దానికి ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కావడం తోడైంది. నయా ఫాసిస్టు శక్తులు బలం పుంజుకోవడం వెనుక ఈ నేపథ్యాన్ని చూడాలి. దీన్ని బట్టి కేవలం కార్మికవర్గ పోరాటశక్తి బలహీనపడడమే నయా ఫాసిజం బలపడడానికి కారణం అన్న నిర్ధారణకు రాకూడదు. నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అనివార్యంగా తలెత్తే ఆర్థిక సంక్షోభం కార్మికోద్యమం బలహీనపడిన నేపథ్యంలో సంభవించింది. ఈ పరిస్థితి నయా ఫాసిస్టు శక్తుల బలం పెరగడానికి దోహదం చేసింది.

దిగజారుతుందని చర్చలు జరుగుతున్నాయి కాని, అది కార్మికవర్గ పోరాట శక్తిని దెబ్బ తీస్తుందన్న విషయాన్ని ఎక్కువగా చర్చించడం లేదు.

కార్మికవర్గ పోరాట శక్తి బలహీనపడింది అంటే దానర్థం స్వల్పకాలిక, భారీ జాతీయ సమ్మెలు కూడా చేపట్టలేరని అనుకోకూడదు. అటువంటి సమ్మెలు మనం గడిచిన కొన్నేండ్లలో మన దేశంలో ఎక్కువగానే జరిగాయి. కాని ఆయా రంగాలకు సంబంధించిన నిర్దిష్ట డిమాండ్లతో, అవి నెరవేరే వరకూ దీర్ఘకాలం పాటు సమ్మెలు కొనసాగించడమనేది మనకు ఇప్పుడు కనపడదు. అటువంటి సమ్మెలు 1970 దశకంలో మన దేశంలో చాలా జరిగాయి. రైల్వే కార్మికుల సమ్మె అంతకు ముందు జరిగిన లోకో రన్నింగ్ కార్మికుల సమ్మె వంటివి నిర్వహించగల పరిస్థితి ఇప్పుడు దాదాపు లేదు. జర్మనీలో కార్మికవర్గ విప్లవం విఫలమైన తర్వాత ఫాసిజం బలంగా ముందుకొచ్చిందని బెంజమిన్ చేసిన సూత్రీకరణ ప్రాతిపదికన ఇప్పుడు మనం పరిశీలిస్తే, నయా ఉదారవాద విధానాల



ఒక ఆర్థిక వ్యవస్థలో మొత్తం అంతా ప్రయివేటు రంగమే విస్తరించి వుంటే, ప్రభుత్వ రంగం ఉనికి నామమాత్రమైతే, అప్పుడు ప్రజానీ కానికి అత్యవసర సేవలను వారి ఆర్థిక స్తోమతకు తగ్గ ధరలకు అందించడం ఏ విధంగా సాధ్యం? సాంకేతికంగా కొంతైనా స్వావలం బనను సాధించడం ఎలా? ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ఎలా? ఈ ప్రశ్నలకు ఉదారవాదుల దగ్గర సమాధానాలు ఉండవు.

అమలు ఫలితంగా కార్మిక వర్గ పోరాట శక్తి బలహీన పడిన నేపథ్యంలో నయా ఫాసిజం ముందుకు రావడం కనిపిస్తుంది. దానికి ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కావడం తోడైంది. నయా ఫాసిస్టు శక్తులు బలం పుంజుకోవడం వెనుక ఈ నేపథ్యాన్ని చూడాలి. దీన్ని బట్టి కేవలం కార్మికవర్గ పోరాటశక్తి బలహీనపడడమే నయా ఫాసిజం బలపడడానికి కారణం అన్న నిర్ధారణకు రాకూడదు. నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అనివార్యంగా తలెత్తే ఆర్థిక సంక్షోభం కార్మికోద్యమం బలహీనపడిన నేపథ్యంలో సంభవించింది. ఈ పరిస్థితి నయా ఫాసిస్టు శక్తుల బలం పెరగడానికి దోహదం చేసింది.

బూర్జువా ఉదారవాదులు ఈ అంత:సంబంధాన్ని పరిగణించరు. సమాజాన్ని వర్గ ప్రాతిపదికన పరిశీలించడానికి వారు అంగీకరించరు. వ్యక్తులుగానో, వర్గేతర ప్రాతిపదికన వ్యక్తుల సమూహాలుగానో మాత్రమే వారు పరిశీలిస్తారు. దానికి తోడు వారు నయా ఉదారవాదాన్ని సమర్థిస్తారు. అందువల్లనే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఒకే కాలంలో నయా ఫాసిజం ఎందుకు పుంజుకుంటోందో వారు వివరించలేకపోతున్నారు. ట్రంప్, మోడీ, బోల్సనారో, మైలీ, మెలోనీ వంటి నాయకులు ఇప్పుడే ఎందుకు బలంగా ముందుకొస్తున్నారో వారు గ్రహించలేకపోతున్నారు. ఇంతమంది ఫాసిస్టు స్వభావం కలిగిన నియంతలు ఏకకాలంలో బలపడడం వెనుక ఉమ్మడి అంతర్జాతీయ సందర్భం ఏమిటన్నది వారు తెలుసుకోవాలి. కొంతకాలంగా నయా ఉదారవాద విధానాల అమలు జరిగి దాని ఫలితంగా కార్మికోద్యమ పోరాట శక్తిని దెబ్బ తీసిన తర్వాత అవే విధానాల కారణంగా ఆర్థిక సంక్షోభం నెలకొని దానినుండి బయటపడే దారి తోచని స్థితి ఏర్పడడమే ఆ ఉమ్మడి కారణం.

తమ తమ దేశాల్లో మెజారిటీ ప్రజల ముందు "పరాయివాళ్లు" అని కొన్ని సమూహాలపై ముద్ర వేసి విద్వేష భావనలు రెచ్చగొడుతున్న వాతావరణం ఈ అన్ని దేశాల్లోనూ నెలకొంది. ఎటొచ్చీ ఆ "పరాయివారు" ఎవరన్నది ఆ యా దేశాన్ని బట్టి మారిపోతూ వుంటుంది. కాని ఎవరినో కొందరిని "పరాయివారి"గా చిత్రించడం మాత్రం ఉమ్మడి ధోరణిగా ఉంది. దాని వెనుక ఉన్న ఉమ్మడి సందర్భం ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం.

దీనినుండి అనేక నిర్ధారణలకు రావచ్చు. మొదటిది: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే బలమైన కార్మిక సంఘాలను నిర్మించడం తప్పనిసరిగా జరగాలి. బూర్జువా ఉదారవాదం ఇందుకు పూర్తి వ్యతిరేకం. కార్మిక సంఘాల పట్ల వారు శత్రుపూరిత వైఖరితో వ్యవహరిస్తారు. సమ్మెలు చేయడం అంటే సమాజాన్ని (పబ్లిక్‌ని) ఇబ్బందులపాలు చేసి తమ డిమాండ్లను నెగ్గించుకోవడమే అని వారు విమర్శిస్తారు. వారికి శ్రమజీవుల పేదరికం, దుర్భర పరిస్థితులు ఏమాత్రమూ పట్టవు. అంతేగాక వారికి ఈ సమాజం ఏ ప్రాతిపదికన నడుస్తోందో కూడా పట్టదు. నిజానికి వారు చెప్పే స్వేచ్ఛ అనేది వ్యక్తులందరికీ ఉండాలంటే, ఆ స్వేచ్ఛను కాపాడే మొనగాడిగా కార్మికవర్గం బలంగా ఉండడం అత్యంత కీలకం. కాని ఉదారవాదులు వ్యక్తుల స్వేచ్ఛను గుర్తిస్తూనే, ఆ వ్యక్తులందరి సమూహంగా ఉండే కార్మిక సంఘం స్వేచ్ఛను మాత్రం అంగీకరించరు. కలిసికట్టుగా ఉంటున్నప్పుడే స్వేచ్ఛను పొందలేని పరిస్థితి ఉన్నప్పుడు ఇక వ్యక్తులుగా విడిగా స్వేచ్ఛను అనుభవించడం ఎలా సాధ్యమో వారు వివరించలేరు.

ఇక రెండవది: ప్రజాస్వామ్యం ఉండాలంటే ప్రభుత్వ రంగం ఉండడం తప్పనిసరి. ఉదారవాదులు దీనిని కూడా వ్యతిరేకిస్తారు. ప్రయివేటు సంస్థలు, ఉదార ప్రజాస్వామ్యం ఒకదానికొకటి బలపరుచుకుంటాయని వారు భావిస్తారు. ఒక ఆర్థిక వ్యవస్థలో మొత్తం అంతా ప్రయివేటు రంగమే విస్తరించి వుంటే, ప్రభుత్వ రంగం ఉనికి నామమాత్రమైతే, అప్పుడు ప్రజానీ కానికి అత్యవసర సేవలను వారి ఆర్థిక స్తోమతకు తగ్గ ధరలకు అందించడం ఏ విధంగా సాధ్యం? సాంకేతికంగా కొంతైనా స్వావలంబనను సాధించడం ఎలా? ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ఎలా? ఈ ప్రశ్నలకు ఉదారవాదుల దగ్గర సమాధానాలు ఉండవు.

ప్రభుత్వ రంగం ఉంటే కార్మిక సంఘాలు బలంగా ఉంటాయి. కార్మిక సంఘాలు బలంగా ఉంటే ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవడం సాధ్యం. దీనర్థం దేశమంతటా ప్రయివేటు రంగం విస్తరించివుంటే నయా ఫాసిజం బలపడిపోతుందని మాత్రం కాదు. ప్రయివేటు రంగం మాత్రమే బలంగా ఉంటే నయా ఫాసిస్టు దాడికి సులువుగా బలి చేయబడతాం అని మాత్రమే.

"ద్రవ్య పెట్టుబడి అత్యంత ప్రతీఘాత, తిరోగమన తరగతుల బహిరంగ, ఉగ్రవాద నియంతృత్వమే ఫాసిజం" అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏడవ మహాసభలో జార్జి డిమిట్రోవ్ వివరించారు. అది కార్మిక సంఘాలను అణచివేస్తుందని, కార్మిక నాయకులను నిర్బంధించి వేధింపులకు గురి చేస్తుందని బిషప్ నీమోల్లర్ వ్యాఖ్యానించారు. ఈ ఫాసిజం బలం పుంజుకోడానికి ప్రధానంగా తీవ్రమౌతున్న ఆర్థిక సంక్షోభం, కార్మికసంఘాలు బలహీనపడడం దోహదం చేస్తున్నాయి. అందుచేత నయా ఫాసిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం సాగాలంటే కేవలం రాజకీయంగా కూటములు ఏర్పరచడం ఒక్కటే సరిపోదు. ఆ వ్యూహంలో కార్మికోద్యమాన్ని బలోపేతం చేసి కార్మికవర్గం పుంజుకునేలా చేయడం, కార్మిక-కర్షక ఉద్యమాల నడుమ సమన్వయాన్ని (ప్రస్తుతం భారతదేశంలో ఈ సమన్వయం పెరుగుతోంది) పెంపొందించడం చాలా ముఖ్యం.

(స్వేచ్ఛానుసరణ)

విద్యాహక్కు చట్టం అమలేది?

పాఠశాలకు వెళ్లాల్సిన బడీడు పిల్లలు బడిలో చేరడం, చేరినవారు కొనసాగడం, వారందరూ ఆనందంగా అర్థవంతంగా నేర్చుకోవడానికి అనువైన, ప్రోత్సాహకరమైన ,స్వేచ్ఛాపూరిత వాతావరణం పాఠశాలల్లో కల్పించడానికి 13 ఏండ్ల క్రితం ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యహక్కు చట్టం అమల్లోకి వచ్చింది. 6-14 వయస్సు గల పిల్లలందరికీ ప్రాథమిక విద్యను హక్కుగా మారుస్తూ సమున్నత ఆదర్శాలతో పట్టాలెక్కిన ఈ చట్టం ఆచరణలో చతికిల పడింది. దేశంలోని ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలలన్నీ పాతిక శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు కేటాయించాలనే ఈ చట్టం


అంకం నరేష్
6301650324

నిబంధనను ఖాతరు చేస్తున్న వారు కనిపించడం లేదు. అడ్డంగా చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలను నియంత్రించే సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో చట్టం అమలు అభాసుపాలు అవుతున్నది. విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు కాకపోవడంవల్ల దేశంలో ఆరు కోట్ల మంది పిల్లలు పాఠశాల మొహమే చూడటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాహక్కు చట్టం అమలులోని సాధక బాధకాలను సమీక్షించాల్సిన తరుణమిది.

సమాజంలో కొంతమంది పిల్లలు బడి బయట ఉండడం, బాల కార్మికులుగా పనుల్లో కార్ఖానాల్లో గనుల్లో పనిచేయడం వారి ప్రవేశానికి పాఠశాల నియమ నిబంధనలు అడ్డంకి రావడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రాథమిక హక్కుగా మారిన విద్యను పిల్లలు అందరు పొందడానికి" ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కుల చట్టం -2009" అనే చట్టం 1 ఏప్రిల్ 2010 నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. చట్టం అమల్లోకి వచ్చిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ అప్పటి ప్రధాని మాట్లాడుతూ జాతి, మత, కులాలకతీతంగా దేశ బాలలందరిని బడిలో చేర్పించి నాణ్యమైన విద్యను చట్టం ద్వారా అందిస్తామన్నారు. కానీ నేటికీ చట్టం ప్రధాన ఉద్దేశం నెరవేరలేదు. చట్టం సక్రమంగా అమలు కావాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో ఆరు శాతం నిధులను విద్యాభివృద్ధికి కేటాయించాలి. అరకొర కేటాయింపులతో అద్భుత ఫలితాలు సాధించడం సాధ్యంకాదనే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు తేల్చి చెప్పిన కూడా ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కేటాయిస్తున్న నిధులు పేలవంగా ఉంటున్నాయి. నేటికి ప్రాథమిక పాఠశాల లేని గ్రామాలు,మౌలిక సదుపాయాలు లేమి, ఉపాధ్యాయుల కొరతతో విద్యారంగం కొట్టుమిట్టాడుతున్నది. కరోనా కాలంలో దేశంలో 92 లక్షల బాలబాలికలు బడికి దూరం అయ్యారని పలు గణాంకాలు విశ్లేషణ చేస్తున్నాయి.అలాగే వందకు పాతికశాతం బాలబాలికలు ఐదో తరగతిలోనే బడిమానివేస్తున్నట్లు మన రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ చట్టం అమల్లో భాగంగా బడి



ముఖం చూడని పిల్లలకు పాఠశాలలో చేర్పించేందుకు ఉద్దేశించిన పథకం సమగ్ర శిక్ష అభియాన్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎందుకు కొరగానిదిగా మారింది.

విద్యా హక్కు చట్టం సెక్షన్ 12 ప్రకారం దేశంలోని ప్రతి కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు ప్రతి విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం సీట్లు బలహీన వర్గాలకు ఉచితంగా కేటాయించాలి. ఇందులో భాగంగా వికలాంగులు, అనాథలు, వీధి బాలలకు ఐదు శాతం, ఎస్సీ బాలలకు పదిశాతం, గిరిజన బాలలకు నాలుగు శాతం, వెనుక బడిన వర్గాల పిల్లలకు ఆరు శాతం సీట్లను ఉచితంగా కేటాయిం చాలి. కానీ అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో కనీసం పది శాతం పాఠశాలలు కూడా ఈ చట్టం నిబంధనలను పాటించడం లేదు. అలాగే సెక్షన్ 13 ప్రకారం ప్రాథమిక స్థాయిలో వివిధ పాఠశాలల్లో పిల్లల ఎంపికకు ఎలాంటి ఎంట్రన్స్‌లను నిర్వహించకూడదు. కానీ ఈ చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తూ మన రాష్ట్రంలో గురుకుల, ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ఎంపిక కోసం ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రయివేట్ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశం కోసం ఎలాంటి క్యాపిటేషన్ రుసుములు తీసుకోకూడదు. కానీ ఈ చట్టం నిబంధనలు బేఖాతరు చేస్తూ డొనేషన్,అడ్మిషన్ ఫీజులను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్నాయి. అలాగే సెక్షన్ 18 ప్రకారం గుర్తింపు లేకుండా ప్రయివేట్ పాఠశాలలు నడపరాదు. అలా నడిపితే ఈ చట్టం నిబంధనల ప్రకారం జరిమానాలు వసూలు చేయవచ్చు. కానీ చాలా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రయివేట్ పాఠశాలలు నెలకొల్పుతూ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలను నడుపు తున్నారు. దీనిపై ప్రభుత్వాల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు.

ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు చట్టం సత్ఫలితాలను ఇవ్వాలంటే విద్యాహక్కు చట్టం సెక్షన్ 25 ప్రకారం మొదట పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. ప్రస్తుతం దేశంలో తొమ్మిది లక్షల ఉపాధ్యాయ పోస్టులు అలాగే రాష్ట్రంలో దాదాపుగా 20 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యా హక్కు చట్టం నిబంధనలకు అనుగుణంగా వాటిని వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. పనుల్లో గనుల్లో కార్ఖానాల్లో, కర్మాగారాల్లో పనిచేస్తున్న బాలకార్మికులను ఆపరేషన్ స్మైల్ వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు గుర్తిస్తూ బడీడు పిల్లలందరూ బడిలో కొనసాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పిల్లల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా పాఠశాల విద్య ఉండాలి. అలాగే నిష్ఠ వంటి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయ విద్యను మరింత అభివృద్ధి పరచాలి. ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు పౌర సమాజం ఏకతాటిపై నిలిచి మొక్కవోని దీక్షతో కృషి చేస్తే విద్యాహక్కు చట్టం లక్ష్యాలు నెరవేరుతాయి.

> విద్యా హక్కు చట్టం సెక్షన్ 12 ప్రకారం దేశంలోని ప్రతి కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు ప్రతి విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం సీట్లు బలహీన వర్గాలకు ఉచితంగా కేటాయించాలి. ఇందులో భాగంగా వికలాంగులు, అనాథలు, వీధి బాలలకు ఐదు శాతం, ఎస్సీ బాలలకు పదిశాతం, గిరిజన బాలలకు నాలుగు శాతం, వెనుక బడిన వర్గాల పిల్లలకు ఆరు శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలి. కానీ అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో కనీసం పది శాతం పాఠశాలలు కూడా ఈ చట్టం నిబంధనలను పాటించడం లేదు.

రైతులను హోల్ సేల్‌గా మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ రైతులను హోల్ సేల్‌గా మోసం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైన రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను అమలు చేసిన మాజీ సీఎం కేసీఆర్‌ను కాంగ్రెస్ నేతలు విమర్శించడం శోచనీయమని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రోజు రోజుకు రైతుల కష్టాలు పెరుగుతున్నాయని వాపోయారు. వ్యవసాయానికి పెట్టుబడి లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని పట్టించుకునే తీరిక రేవంత్ సర్కారుకు లేకుండా పోయిందని విమర్శించారు. ఎంత సేపూ ఇతర పార్టీల నాయకులకు కండువాలు కప్పడమే తప్పితే సాగు, తాగునీటి గురించి పట్టించుకునే వారే లేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కరువు, పశుగ్రాసం కొరత, సాగునీటిపై రైతులు ప్రశ్నిస్తే వారికి సమాధానం చెప్పే ధైర్యం లేని కాంగ్రెస్ నేతలు మొఖం చాటేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీల్లో ప్రకటించిన విధంగా వరికి రూ.500 బోనస్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని ఈ సందర్భంగా సింగిరెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే వారి తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని హెచ్చరించారు.

ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారాముల కళ్యాణ తలంబ్రాలను ఇంటికే పంపేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు దేవాదాయశాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఇతర డైరెక్టర్లతో కలిసి బస్‌భవన్‌లో ఆవిష్కరించారు. టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి, వివరాలు నమోదు చేసుకుంటే గోటి తలంబ్రాలను ఇంటికే వచ్చి అందచేస్తారు. రెండేండ్లుగా ఆర్టీసీ ఈ సేవల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 2022లో దాదాపు 89 వేల మంది భక్తులు తలంబ్రాలు బుక్ చేసుకున్నారు. గత ఏడాది 1.17 లక్షల మంది భక్తులు గోటి తలంబ్రాలను బుక్ చేసుకున్నారని ఈ సందర్భంగా ఎమ్‌డీ సజ్జనార్ తెలిపారు. భద్రాద్రిలో ఈ నెల 17న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కళ్యాణం జరగనున్న విషయం తెలిసిందే. ఇతర వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 040-23450033, 040-69440000, 040-69440069 ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వీ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణకాంత్, సీటీఎం(మార్కెటింగ్ అండ్ కమర్షియల్) శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కా తమ్ముడు మృతి

- ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికుల ఫిర్యాదు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

అక్కాతమ్ముడు అనుమానాస్పద స్థితిలో ఇంట్లో చనిపోయారు. ఈ ఘటన హైదరాబాద్ మధురనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్ నగర్ డివిజన్ సంతోష్‌గిరి బస్తీలో అక్క రాజేశ్వరి(30), తమ్ముడు బి.సాయి(28) నివసిస్తున్నారు. రాజేశ్వరికి వివాహం జరిగినా.. భర్త సరిగ్గా పట్టించుకోవడం లేదని కొన్ని సంవత్సరాలుగా తమ్ముడు వద్దనే ఉంటోంది. నెలలో రెండూ మూడు రోజులు అత్తింటికి వెళ్లి వచ్చేది. అక్కాతమ్ముడు ఇద్దరికీ కల్లు తాగే అలవాటు ఉంది. అయితే సోమవారం వారింట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా అక్కాతమ్ముడు విగతజీవులుగా కనిపించారు. గదిలో రాజేశ్వరి రాసిన సూసైడ్ లెటర్ పోలీసులకు లభ్యమైంది. అందులో "నా భర్త సరిగా పట్టించుకోవడం లేదు. దాంతో నా తమ్ముడు భర్త దగ్గరకు వెళ్లాలని రోజూ హింసిస్తున్నాడు. నా చావుకు నా భర్త, తమ్ముడే" కారణం అని పేర్కొంది. మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. మధురనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిపోర్టర్ ఆత్మహత్య

భార్యతో గొడవపడిన ఓ జర్నలిస్ట్ క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కర్నూలుకు చెందిన రఘు హైదరాబాద్‌లోని బోరబండ సైట్ 3లో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను ఓ టీవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, సోమవారం ఉదయం రఘు విధుల్లో భాగంగా బయటకు వెళ్లి 11 గంటలకు ఇంటికి వచ్చాడు. వచ్చిన వెంటనే భార్యాభర్తలు గొడవపడ్డారు. అనంతరం భార్య బిల్డింగ్‌పై బట్టలు తీసేందుకు వెళ్లింది. మళ్లీ గొడవ జరుగుతుందేమోనని చాలా సేపు అక్కడే ఉన్నది. ఆ సమయంలో రఘు క్షణికావేశంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తర్వాత భార్య కిందకు వచ్చి చూసి ఇరుగుపొరుగు సహాయంతో రఘుని కిందకు దించి సమీపంలోని శ్రావణి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. బోరబండ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ తుల్జారామ్ విషయం తెలుసుకొని ఆస్పత్రికి చేరుకుని మృతుడి భార్య, బంధువుల ద్వారా వివరాలు సేకరించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆ దంపతులకు డిగ్రీ చదువుతున్న కూతురు, ఇంటర్మీడియట్ చదువుతున్న కుమారుడు ఉన్నారు. రఘు ఆత్మహత్య చేసుకున్న సమయంలో కూతురు ఆలయానికి వెళ్లగా, కుమారుడు కాలేజీకి వెళ్లారు. మృతుడి తండ్రి రిటైర్డ్ ఏఎస్ఐ అని, అన్న కానిస్టేబుల్ అని.. వారు వచ్చిన తర్వాత మృతదేహాన్ని కర్నూలుకు తరలిస్తారని బంధువుల ద్వారా తెలిసింది. బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఎండలు మండుతున్నాయి..జాగ్రత్తలు తీసుకోండి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతతో కూడిన ఎండలు ఉన్నందున వడదెబ్బ, డీ-హైడ్రేషన్ తదితర వ్యాధులకు గురికాకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తాగునీటి సరఫరా, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ధాన్యం కొనుగోలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో సోమవారం ఆమె హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, దాన కిషోర్, క్రిష్టినా చోంగ్తు, సందీప్ సుల్తానియా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సీడీఎంఏ దివ్య, విద్యా శాఖ కమిషనర్ దేవసేన, కుటుంబ ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఈ రెండు మాసాల్లో ఉత్తర తెలంగాణా ఉమ్మడి జిల్లాలైన ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరుకుని తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని తెలిపారు. అందువల్ల వేసవిలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజలకు తగిన అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్లు, ఇతర మందులను పెద్ద మొత్తంలో పంపిణీ చేశామనీ, వాటన్నింటినీ సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో అందుబాటులో ఉంచామని వెల్లడించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆశా కార్యకర్తలతో పాటు ఉపాధి హామీ పనుల కేంద్రాలవద్ద కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉదయం 11 గంటలనుండి సాయంత్రం 4 గంటల మధ్య పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ ఒక్కరు కూడా ఎండదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత చర్యలను చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

మంచినీటి సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

మంచినీటి సరఫరాను మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రతీ మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్టు సీఎస్ తెలిపారు. ప్రతీ రోజు మంచినీటి సరఫరాను పర్యవేక్షించటానికి మండలానికి జిల్లా స్థాయి అధికారినీ, వార్డు, గ్రామానికి మండల స్థాయి అధికారిని నియమిస్తున్నట్టు చెప్పారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో మొత్తం జిల్లాలో ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఏ గ్రామంలోనైనా మంచినీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే, ఆయా గ్రామాల్లోని వ్యవసాయ బావుల నుంచి అద్దె ప్రాతిపదికపై నీటిని సరఫరా చేయాలని సూచించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని అందించాలన్నారు. ఇప్పటికే, అన్ని గ్రామాలు, వార్డులలోని బోరుబావుల మరమ్మతులు, ఫ్లషింగ్‌లను పూర్తి చేయడంతోపాటు పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టినట్టు సీఎస్ తెలిపారు.



కృష్ణా జలాల విడుదల

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి పాలేరు జలాశయానికి తాగునీటి అవసరాలకు ఉదయం కృష్ణా జలాలను విడుదల చేసినట్టు సీఎస్ వెల్లడించారు. వీటిని పాలేరు ప్రాజెక్టుకు చేర్చేలా నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు తగు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు.

7,149 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

యాసంగి ధాన్యం కొనుగోలుకు రాష్ట్రంలో 7,149 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామనీ, మరో నాలుగైదు రోజుల్లో ఈ కేంద్రాలన్నీ ప్రారంభమవుతాయని సీఎస్ తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో ప్రయివేటు కాంటాలను తెరిచి ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరకు కొనుగోళ్లు చేసే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో మన ఊరు - మనబడి కార్యక్రమం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నింటినీ సంబంధిత ఏజెన్సీల ద్వారా వెంటనే ప్రారంభించి, వాటి పురోగతిని పర్యవేక్షించాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా రాజ్యాంగ రక్షణ సదస్సులు

- సామాజిక సంఘాల పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మతోన్మాదానికి వ్యతిరేకంగా సామాజిక సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ సదస్సులు నిర్వహించనున్నట్టు కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని కేవీపీఎస్ కార్యాలయంలో టీపీఎస్‌కే సీనియర్ నాయకులు జి రాములు అధ్యక్షతన సామాజిక సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, టీజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ, మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తొడుసం భీమ్‌రావ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ మహనీయుల మాసంగా ఈ నెలను ప్రకటించుకుని, ఐదు నుంచి 14 వరకు 'రాజ్యాంగ హక్కులను రక్షించుకుందాం మనువాదాన్ని మట్టు పెడదాం' అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు జరపాలని నిర్ణయించినట్టు తెలిపారు. పదేండ్ల బీజేపీ పాలనలో రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేశారని తెలిపారు. దళితుల, గిరిజన, బలహీన వర్గాల, మైనార్టీలకు ఆ పార్టీ పది పైసల మేలు కూడా చేయలేదని విమర్శించారు. దళితులపై దాడులు 300 రెట్లకు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత ఘర్షణలు, విద్వేషాలు, ఉద్రిక్తతలతో ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో అట్టడుగునున్న దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ తరగతులకు బడ్జెట్‌లో, సంపదలో, ప్రకృతి వనరుల్లో వారికి రావాల్సిన సామాజిక న్యాయం దక్కలేదని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు అభద్రతలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెడుతూ గిరిజనులను అడవుల నుండి గెంటివేసే కుట్రలకు బీజేపీ నేతలు పాల్పడుతున్నారని విమర్శించారు.

బీసీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోగా, బీసీ కుల గణన చేపట్టబోమని బీసీనని చెప్పుకుంటున్న మోడీ ప్రకటించటం శోచనీయమన్నారు. మైనార్టీలపై సీఏఏ ముసుగులో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కోరారు. మనువాద విష సంస్కృతిని మట్టిలో పాతరేసే చైతన్యం యువతలో తీసుకురావడానికి పూలే, అంబేద్కర్ జన జాతర పేరిట నిర్వహిస్తున్నామని చెప్పారు

కరువు పేరుతో బీఆర్ఎస్, బీజేపీ రాజకీయం

- రైతులను ఆదుకుంటాం, అధైర్య పడొద్దు
- కాంగ్రెస్ కరువుతెచ్చిందనడం విడ్డూరం : మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-కోహెడ

ప్రకృతి వైపరీత్యాన్ని గుర్తించకుండా కరువు పేరుతో బీఆర్ఎస్, బీజేపీ రాజకీయం చేస్తున్నాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని లక్ష్మిగార్డెన్స్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీని నమ్ముకుని ఉన్న ప్రతి కార్యకర్తకు పదవులు వచ్చే విధంగా చూస్తామన్నారు. కార్యకర్తలు కూడా సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. వేసవికి ముందే భూగర్భ జలమట్టం పడిపోవడంతో నీటి సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. కాంగ్రెస్ కరువు తెచ్చిందని మాజీ సీఎం కేసీఆర్ అనడాన్ని ఆయన తప్పు పట్టారు. కరువుకు కాంగ్రెస్ కారణమని చేస్తున్న దుష్ప్రచారాన్ని గ్రామాల్లో ఖండించాలన్నారు. మీరు ఓట్లు వేస్తే మంత్రిని అయ్యానని, నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి సేవచేస్తానని స్పష్టంచేశారు. గ్యారంటీ స్కీములపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ ఐదేండ్లలో నియోజకవర్గానికి ఆయన ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎన్నికల్లో ప్రధాని మోడీ ఫొటో కాకుండా రాముడి ఫొటో పెట్టుకుని ఓట్లు అడిగే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందేలా తగు చర్యలు తీసుకుంటా మని చెప్పారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు అర్హులకందేలా చూడాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నదని, ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పబ్బం గడుపుతున్నాయని తెలిపారు. భూ తగాదాలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని చెంచల్‌చెర్వుపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, నవగ్రహ ధ్వజ శిఖర యంత్రం ప్రతిష్ఠ మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మంద ధర్మయ్య, మాజీ సర్పంచ్‌లు దొమ్మాట జగన్‌రెడ్డి, గొరిట్యాల లక్ష్మణ్, శెట్టి సుధాకర్, మల్లారెడ్డి, సీనియర్ నాయకులు వేల్పుల వెంకటస్వామి, బండెల బాలకిషన్, బోయిని జయరాజ్, దూలం శ్రీనివాస్, అబ్దుల్ రఫీ, రాచూరి శ్రీనివాస్, రాజిరెడ్డి, గూడ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలే

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉందని చెప్పారు. 2,400 మెగావాట్ల పీపీఏ అగ్రిమెంట్లు చేసుకోకుండా కేసీఆర్ కుట్ర చేశారని మండిపడ్డారు. ఆయన పాపం వల్లే ఎన్టీపీసీ రాష్ట్రానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నేతలు లాభం కోసం కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీపీసీ వల్ల కరెంట్ యూనిట్‌కు రూ.9 ఖర్చు అవుతుందని చెప్పారు. ఆ సంస్థకు రూ. 1.10 లక్ష కోట్లను గత కేసీఆర్ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటన

రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటనకు వస్తున్నామని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పూర్తి చేశామని గుర్తుచేశారు. కేసీఆర్‌లాగా ప్రధానమంత్రి కావడానికి పది రోజులు ఇక్కడే ఉండి కుట్రలు చేయలేదన్నారు. తాము ఇతరులతో చర్చలు జరపలేదన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం కాల్వల్లోకి కేసీఆర్ నీరు వదిలారన్నారు. ఇప్పటికే తాము ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని, కరెంట్‌ను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు.

ప్రతినెలా ఒకటో తేదీన జీతాలిస్తున్నాం

2019లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే మొదటి నెల ఉద్యోగులకు జీతాలు ఇచ్చిందని, తాము వచ్చిన తర్వాత ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చామని చెప్పారు. రూ. 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను పెడితే అవి కూడా ఇచ్చుకుంటూ వచ్చామన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇచ్చామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను ఇచ్చామని చెప్పారు. ఐదేండ్లలో మహిళలకు వడ్డీలేని లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పంట నష్టం జరిగిన వెంటనే రైతులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ వచ్చాకే వర్షాలు రావడం లేదని కేసీఆర్ అంటున్నారని, జూన్‌లో ప్రభుత్వం బీఆర్ఎస్‌ది కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న దగ్గరి నుంచే వర్షాలు రావట్లేదన్నారు. "ఏప్రిల్, మే నెలలోనూ సరిపడా విద్యుత్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. దేశమంతా గ్రిడ్ అనుసంధానం 2013లోనే యూపీఏ ప్రభుత్వం చేసింది. పదేండ్ల పాలనలో కేసీఆర్ ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలి. అందరికీ రెండు పడకగదుల ఇండ్లు నిర్మించి ఇచ్చారా? ప్రతి మండలంలో బాలబాలికలకు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, ప్రతి నియోజకవర్గంలో కేజీ టూ పీజీ విద్యాలయాలు నిర్మించారా? దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేశారా? రైతులకు రుణమాఫీ ఐదేండ్లలో పూర్తి చేశారా? వర్షాకాలంలో అధికారంలో ఉన్నది ఎవరు? వాననీటిని రిజర్వాయర్లలో నింపే పరిస్థితి లేకుండా చేసిందెవరు? ప్రపంచంలోనే అత్యద్భుతం అని చెప్పిన కాళేశ్వరం కుంగిపోయింది. అన్ని లెక్కలతో చర్చకు రావడానికి నేను సిద్ధం" అని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. రిజర్వాయర్‌లో ఎక్కడ నీళ్లు లేకున్నా అది కేసీఆర్ పుణ్యమేనని చెప్పారు. నీటిని సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో నీళ్లు లేకుండా కేసీఆర్ చేశారని మండిపడ్డారు.

మంత్రి సురేఖతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలిసిన

కడియం శ్రీహరి, కావ్య



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు డాక్టర్ కావ్య మంత్రి కొండా సురేఖ, వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం హన్మకొండ రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజును వాళ్ల ఇండ్ల దగ్గర కలిసి మాట్లాడారు. వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరు ఖరారు చేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కడియం శ్రీహరి, తన కుమార్తె కావ్యను తీసుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావును స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె డాక్టర్ కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హన్మకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాలను కప్పి సన్మానించారు. కాంగ్రెస్‌లో చేరిన అనంతరం 'కడియం' స్వయంగా రావడంతో పూలమొక్కనిచ్చి మంత్రి సురేఖ వారికి స్వాగతం పలికారు. కడియం శ్రీహరి, కావ్యలకు మంత్రి సురేఖ నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై కలిసి ముందుకు సాగుదామని చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేలను వారి ఇండ్ల వద్ద కలిసి వారికి శాలువాలు కప్పి సన్మానించి పుష్పగుచ్ఛాలిచ్చారు. ఈ సందర్భంగా 'కడియం' కాంగ్రెస్‌లోకి రావడం పట్ల ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, జిల్లా అభివృద్ధికి అందరం కలిసి కృషి చేద్దామని తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఇంట్లో 'కడియం' పలువురు కాంగ్రెస్ నేతలను కలిసి అందరితో ముచ్చటించారు.

గొంతెండుతున్న 'పాలమూరు'

పట్టణాలతో సహా ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు

- పడిపోయిన పాతాల జలం
- పెరిగిన ఉష్ణోగ్రతలతో పెరుగుతున్న నీటి అవసరాలు
- రిజర్వాయర్లలో పడిపోయిన నీటిమట్టాలు
- వనపర్తి పట్టణంలోనే నీటి ఎద్దడి



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఎండలు ముదిరిన కొద్ది తాగునీటి కష్టాలు పెరుగుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతమయిన నల్లమలలోని చెంచుపెంటలు తాగునీటికోసం బుగ్గలు, చెలిమెల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. కానీ అవసరాలకు తగిన నీటిని సరఫరా కావడం లేదు. రిజర్వాయర్లలో నీటిమట్టాలు డెడ్ స్టోరేజీకి పడిపోవడం, పాతాల జలం సైతం క్రమంగా తగ్గడం వల్ల తాగునీటి ఎద్దడి తీవ్రంగా మారింది. ముఖ్యంగా జూరాల సమీపంలో ఉండే వనపర్తి పట్టణంలోనే తాగునీటి ఎద్దడి నెలకొన్నది. తాగునీటి అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి సమస్య ఉండేది. ఇప్పుడు తాగునీటికి సైతం తండ్లాడే సమయం వచ్చింది. మిషన్‌భగీరథ్ ద్వారా తాగునీరిందే ఎల్లూరు రిజర్వాయరులో సాధారణంగా 7 టీఎంసీల నీరు ఉండాలి. తాజాగా 0.5 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈనీరు బాగా ఎండలు ముదిరితే.. ఆవిరైపోతుంది. నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు తాగునీరు అందించే కల్వకుర్తి ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన ఎల్లూరు రిజర్వాయరులో నీటి లభ్యత లేదు. జూరాల నుంచి 1.22 టీఎంసీలు, ఎల్లూరు నుంచి 7.12 టీఎంసీలు, కోయిల్‌సాగర్ నుంచి 1.3 టీఎంసీలు, నిల్వ ఉంటేనే తాగునీరు లభించేది. అయితే ఇప్పుడు రిజర్వాయర్లలో డెడ్ స్టోరేజీకి నీటిమట్టాలు పడిపోవడంతో తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. శ్రీశైలం రిజర్వాయరులో 810 అడుగులకు నీటిమట్టం పడిపోయింది. ముమ్ముందు మరింత పడిపోయే అవకాశాలు ఉన్నాయి.

ఏజెన్సీవాసుల సమస్యలు వర్ణనాతీతం

ఇక ఏజెన్సీ వాసుల సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎండలు ముదిరినా కొద్దీ భూగర్భజలాలు పడిపోవడం వల్ల బుగ్గలు, చెలిమలు ఎండిపోయాయి. నల్లమల చెంచులకు తాగునీరు లేక పదుల కిలోమీటర్లు ప్రయాణించి కృష్ణా నీటిని తెచ్చుకుంటున్నారు. అప్పాపూర్, లక్ష్మీపల్లి, మల్లాపూర్, అప్పాపూర్, బౌరాపూర్, వెంకటేశ్వర్లబావి, కొమ్మన్‌పెంట, పెట్రోల్ చేను తదితర 70కి పైగా చెంచు పెంటల్లో 7వేల మంది చెంచులు జీవిస్తున్నారు. వీరంతా తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

మొదలైన తాగునీటి కష్టాలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వనపర్తి మున్సిపాల్టీలో నాలుగు రోజులకొకసారి నీటిని వదులుతున్నారు. పీర్లగుట్ట, చిట్యాల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, హరిజన వాడలో నీటి ఎద్దడి అధికంగా ఉంది. నాలుగు రోజుల కోకసారి తాగునీటిని వదలుతున్నారు. ముఖ్యంగా అమరచింత మండల పరిధిలోని నందిమల్ల గ్రామంలో తాగునీటి సమస్య తాండవిస్తోంది. ఉన్న ఒక లిఫ్టు చెడిపోవడంతో గ్రామస్తులు వ్యవసాయ బావులలోకి దిగి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజనపల్లి మండలాల పరిధిలో క్రమంగా నీరు రావడం లేదు. తెలకపల్లి మండల కేంద్రంలో నీటి సరఫరా ఉన్నా.. మడ్డీగా వస్తున్నాయి. దాంతో ఆ నీళ్లు తాగిన వారికి వాంతులు, విరోచనాలు వచ్చి మంచం పడుతున్నారు.

నిందలేయటం కాదురైతు సమస్యలపై దృష్టి పెట్టండి

-మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ పార్టీపై నిందలేయటం మానుకుని రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ నేతలకు సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ తుడుచుపెట్టుకు పోతుందంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. ఉత్తమ్ లాంటి సీనియర్ వాడుతున్న భాష, చేస్తున్న విమర్శలు ఆయన స్థాయికి తగినట్టుగా లేవని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని చెబుతున్న కాంగ్రెస్ నేతలు లోక్ సభ ఎన్నికల్లో తమ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో చెప్పాలంటూ ప్రశ్నించారు. గతంలో పార్లమెంటు రెండు సీట్లే ఉన్న బీజేపీ మోడీ నేతృత్వంలో పదేండ్ల పాటు అధికారంలో ఉందని గుర్తుచేశారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలో లేదు.

అంత మాత్రానా ఆ పార్టీ కేంద్రంలో ఎప్పటికీ అధికారంలోకి రాదా? అని ప్రశ్నించారు. అందువల్ల బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించటం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలనీ, కరెంటు, సాగు, తాగు నీటి సరఫరాపై సమీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్ కు ఆయన సూచించారు.

పెబ్బేరులో భారీ అగ్నిప్రమాదం

- వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో చెలరేగిన మంటలు
- రూ.10 కోట్ల విలువగల గన్నీ బ్యాగులు దగ్ధం
- ఫైరింజిన్లు, వాటర్ ట్యాంకులతో అదుపులోకి మంటలు
- సందర్శించిన జాయింట్ కలెక్టర్ నాగేష్ గౌడ్, సివిల్ సప్లై అధికారులు



నవతెలంగాణ- పెబ్బేరు

వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాముల్లో మంటలు చెలరేగాయి. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా పొగలు కమ్ముకొని భారీగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న మార్కెట్ అధికారులు, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు ఫైర్ ఇంజిన్లకు సమాచారం అందించారు. వనపర్తి నుంచి వచ్చిన మూడు ఫైరింజిన్లు, వాటర్ ట్యాంకులు కలిసి మంటలను అదుపు చేసినప్పటికీ గోడౌన్‌లో ఉన్న గన్నీ బ్యాగులు పూర్తిగా కాలిపోయాయి. గోదాముల పైకప్పు పూర్తిగా దగ్ధమైంది. గోడలు సైతం భారీగా దెబ్బతిన్నాయి. రైస్ మిల్లర్లకు సంబంధించిన సుమారు రూ.ఐదు కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం బస్తాలకు సైతం మంటలంటుకున్నాయి. ధాన్యం కాలిపోకుండా అధికారులు ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. మూడు ఫైర్ ఇంజిన్‌లతోపాటు మున్సిపాలిటీ వాటర్ ట్యాంకులు, ఏబిడి ఆల్కహాల్ కంపెనీకి సంబంధించిన వాటర్ ట్యాంకర్లు తెప్పించి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 10 కోట్ల విలువగల గన్నీ బ్యాగులు పూర్తిగా కాలిపోయాయి. గోడౌన్‌కు కరెంటు లేదని, షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం లేదని మార్కెట్ అధికారులు చెప్పారు.

ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డులో కోట్లాది రూపాయల విలువైన వరి ధాన్యం బస్తాలు నిల్వ ఉంటాయి. కానీ సీసీ కెమెరాలు లేకపోవడం పట్ల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.జాయింట్ కలెక్టర్ నాగేష్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని నివారించే ఏర్పాట్లు చేశారు. సివిల్ సప్లై ఏడి స్వరణ్ సింగ్, ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు, ఎస్ఐ హరి ప్రసాద్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు పరిశీలించారు.


ఈ సందర్భంగా జెయింట్ కలెక్టర్ నాగేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల ధాన్యం కొనుగోలు కోసం 12 లక్షలా 80 వేల గన్నీ బ్యాగులు తెప్పించి నిల్వ చేసినట్టు తెలిపారు. దాదాపు రూ.పది కోట్ల విలువగల గన్నీ బ్యాగులు పూర్తిగా కాలిపోయాయన్నారు. మిల్లర్లకు సంబంధించిన వరి బ్యాగులు ఉన్నాయని వాటికి మంటలు అంటుకోకుండా మంటలను అదుపు చేసినట్టు చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుంటామన్నారు. గోడౌన్లకు సమీపంలో ఉన్న నివాస గృహాల ప్రజలను ఖాళీ చేయించామని చెప్పారు.

నిజాంసాగర్ కెనాల్ కట్టకు గండి

ఇండ్లల్లోకి చేరిన నీళ్లు

నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో సోమవారం తెల్లవారు జామున నిజాంసాగర్ కెనాల్‌కు గండిపడింది. దీంతో నీరు ఇండ్లల్లోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. స్థానిక జర్నలిస్ట్ కాలనీకి ఆనుకొని ఉన్న నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ 82 నెంబర్ కెనాల్ కట్టకు ఒక్కసారిగా గండిపడింది. నీరు ఇండ్లల్లోకి చేరడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రైతుల పంటల సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్టులోని నీటిని చెరువులకు వదిలే సమయంలో ఆ ప్రాజెక్టు ప్రధాన కాలువను ఇరిగేషన్ అధికారులు శుభ్రం చేయాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కెనాల్ కట్ట తెగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా కెనాల్ కట్ట దిగువ ప్రాంతంలో పేద ప్రజలు అనేక మంది నివసిస్తున్నారు. నీరు ఇండ్లల్లోకి చేరడంతో బియ్యం, నిత్యావసర వస్తువులు తడిచాయని, నీళ్లల్లో కొట్టుకుపోయాయని స్థానికులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. కాగా స్థానికుల సమాచారంతో



విద్యుత్, మున్సిపల్ అధికారులు అక్కడి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

పరిశీలించిన జడ్పీ చైర్మెన్

సమాచారం అందుకున్న జడ్పీ చైర్మెన్ దాదన్న గారి విట్టల్ రావు అక్కడికి చేరుకొని పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ వనం శేఖర్‌ను ఇరిగేషన్ శాఖ అధికారులను అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పలు ఇండ్లను పరిశీలించి ఇది బాధాకరమైన సంఘటనని తెలుపుతూ.. గుత్ప నుంచి వచ్చే నీటిని ఆపివేయించి నిల్వవున్న నీటిని ఖాళీ చేయించి అవసరమైన పనులను యుద్ధప్రాతిపాదికన చేయించాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజు, డిప్యూటీ ఈఈ కృష్ణమూర్తి, నాయకులు పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్ తదితరులు పరిశీలించారు.

పలువురు నాయకులపై కేసు కొట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో 2017లో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ సచివాలయం ముట్టడి సందర్భంగా పలువురు నాయకులపై నమోదైన అక్రమ కేసులను నాంపల్లి కోర్టు సోమవారం కొట్టేసింది. వారిలో కోట రమేష్, మరికంటి నాగేశ్వరరావు, నరేష్, ప్రకాశ్‌కరత్ తదితరులున్నారు. నాంపల్లి కోర్టులో పలు వాయిదాల తర్వాత ఆ కేసును కొట్టేశారు. వారి తరఫున న్యాయవాది సావుకారు శ్రీనివాస్ కోర్టులో వాదించారు.

కోర్టుల చుట్టూ తిప్పడం పాలకుల కుట్ర : కోట రమేష్

రోజువారీ ఉద్యమాలకు సంబంధించిన కేసులు, సాధారణ కేసుల పేరుతో కోర్టుల చుట్టూ తిప్పడం పాలకుల కుట్ర అని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తెలిపారు. ఏడేండ్ల కింద నమోదైన అక్రమ కేసును సోమవారం కొట్టేశారని వివరించారు. పాలకులకు కేసులు నమోదు చేయడంపై ఉండే శ్రద్ధ సమస్యలను పరిష్కరించడంలో ఉండాలని సూచించారు.

ఈటల అనుచరుల వీరంగం..!

- ప్రెస్‌క్లబ్‌లోనే దళితులపై దాడి
- మీడియా ప్రతినిధులపైనా..
- ఉప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు
- ఈటల అరాచకాలపై గడపగడపకూ బాధిత సంఘం సభ్యులు



నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్ ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అనుచరులు బీభత్సం సృష్టించారు. ఈటల రాజేందర్ అరాచకాలను వివరించేందుకు ఈటల బాధితుల సంఘం ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన హుజూరాబాద్ దళితులపై దాడికి దిగారు. అక్కడితో ఆగకుండా మీడియా ప్రతినిధులపైనా దాడి చేశారు. మీడియా లోగోలు, కెమెరాలు, ప్రెస్‌క్లబ్‌లోని కుర్చీలను ధ్వంసం చేశారు. వివరాల్లోకెళ్తే.. ఈటల రాజేందర్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి ఈటల ఒక మోసగాడని, ఆయన అరాచకాలు, అక్రమ కేసులు, హత్యలపై యాభై వేల కరపత్రాలు విడుదల చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు గోనె శ్రీకాంత్, బాల చందర్, తెలంగాణ సంపత్, దేవేందర్ రెడ్డి, రేవల్లి రాజు, కార్తిక్‌తో పాటు పలువురు అక్కడకు చేరుకున్నారు. సమావేశంలో మాట్లాడుతున్న వారిపై భౌతిక దాడి చేశారు. దాడులను నిలువరించే క్రమంలో మీడియా ప్రతినిధులపై కూడా వారు దాడి చేశారు. అంతటితో ఆగకుండా మైకులు, లోగోలు, కెమెరాలను ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురి చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిలో కొందరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరికొందరు పారిపోయారు. అనంతరం మీడియా ప్రతినిధులు, ఈటల రాజేందర్ బాధితులు ఉప్పల్ పీఎస్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ బాధితుల సంఘం అధ్యక్షుడు తిప్పరపు సంపత్ మాట్లాడుతూ.. ప్రజాస్వామిక దేశంలో ఎవరైనా తమ అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందన్నారు. అలాంటి హక్కును బీజేపీ నాయకులు కాలరాయాలని చూడటం సరికాదన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో ఈటల రాజేందర్ అనేకమంది దళిత కుటుంబాలను చిత్రహింసలకు గురిచేశారని, పీడీ యాక్ట్‌లు నమోదు చేయించి వారిని నెలల తరబడి జైల్లో పెట్టించాడని ఆరోపించారు. హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామంలో బాలరాజు హత్యపై గ్రామస్తులు ప్రశ్నిస్తే.. 45 మందిపై మళ్ళీ అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించిన నీచుడు ఈటల అన్నారు. ఈటల అక్రమ ఆస్తులపై సీబీఐ విచారణ జరపాలని అడిగిన తమపై అనేక కేసులు పెట్టి 12 కుటుంబాలను 62 రోజులు జైలుకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఈటల రాజేందర్ అరాచకాలను బయటపెట్టడానికి బాధితులంతా మీడియా సమావేశం ఏర్పాటు చేస్తే భౌతిక దాడులకు పాల్పడ్డారని వాపోయారు. ఇలాంటి బీజేపీ అభ్యర్థి ఈటలను ఎలా గెలిపిస్తారో ప్రజలే ఆలోచించుకోవాలని కోరారు. ఆయన అరాచకాల గురించి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గడపగడపకూ వివరిస్తామన్నారు. మల్కాజిగిరి దళితులంతా ఏకమై ఈటలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తమకు ఏం జరిగినా ఈటలదే బాధ్యత అని.. ప్రభుత్వం, డీజీపీ తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నమ్మిండ్ల రాజేశ్వర్, మేకల జానీ, చల్లూరి రాహుల్, మమత, రమ, వెన్నల, నవీన్, ప్రతాప్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

టాటానగర్ పరుపుల గోదాంలో అగ్నిప్రమాదం

- అత్తాపూర్‌లో ప్యాకింగ్ కవర్ల గోదాంలోనూ..
- రెండు ప్రమాదాల్లో ఆస్తి నష్టం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లిలోని టాటానగర్‌లో గల పరుపుల గోదాంలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో స్వల్ప ఆస్తి నష్టం వాటిల్లింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన యాఖత్.. టాటానగర్‌లో పరుపుల గోదాం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గోదాంలో మంటలు వచ్చాయి. గమనించిన కార్మికులు వెంటనే బయటకి పరుగెత్తుకొని వచ్చారు. వారు వెంటనే యజమానికి, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. క్షణాల్లో మంటలు కంపెనీ మొత్తం వ్యాపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్ల సాయంతో సుమారు నాలుగు గంటలు కష్టపడి మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అత్తాపూర్‌లో మరో ప్రమాదం

అత్తాపూర్‌లోని ప్లాస్టిక్ కవర్ ప్యాకింగ్ గోదాంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన కార్మికులు గోదాంలో నుంచి బయటికి వచ్చి, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ఐదు గంటల పాటు కష్టపడి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

కేసీఆర్ చెప్పేవన్నీ అబద్ధాలే

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రంలో కరువు పరిస్థితులు మళ్లీ తలెత్తాయని మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడటం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పంట వాడిపోవడానికి, ఎండిపోవడానికి కూడా తేడా తెలియని పెద్ద రైతు మన కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. జనగామ జిల్లాలో లక్షా 80 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులోని లక్ష ఎకరాల వరి పంట వారం రోజుల్లో కోతకు సిద్ధంగా ఉందని తెలిపారు. కరెంటు పోవడం కారణంగా గుంట భూమి కూడా ఎక్కడా ఎండిపోలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి కేసీఆర్ పొలంబాట అని కొత్త కథ మొదలు పెట్టారని విమర్శించారు. అధికారం లేకపోయేసరికి ఆయనకు రైతులు గుర్తుకు రావడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసిన సంగతి ఇంకా ప్రజలు మరిచిపోలేదని విమర్శించారు.

జనగామలో 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందనీ, పంటలెండిపోతే, కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని కేసీఆర్‌ను ప్రశ్నించారు. 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నదే నిజమైతే ఆ వివరాలివ్వాలని సవాల్ చేశారు.



ఎన్నికల కోసమే కేసీఆర్ ఫామ్ హౌస్ విడిచారు

- మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-వరంగల్

పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి కాబట్టే కేసీఆర్ ఫామ్‌హౌస్ విడిచి వచ్చారని మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ ఓసీటీలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ కొత్త డ్రామాకు తెర తీశారని, గతంలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతులకు ఎలాంటి ఆర్థిక సాయం చేయని కేసీఆర్.. ఇప్పుడు వారి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని తెలిపారు. కవిత మద్యం కేసులో జైలులో ఉందన్నారు. కేటీఆర్ ఫోన్ టాంపరింగ్‌లో సినీ హిరోయిన్‌లను బెదిరింపులకు గురిచేశారని విమర్శించారు. రైతులకు రాయితీలను ఎత్తి వేసి, రైతు బీమా ఇచ్చిన కేసీఆర్‌కు.. కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదన్నారు. ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేసి విద్యుత్ సంస్థలు అప్పులపాలవ్వడానికి కారణమయ్యారని కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్‌ఎస్ పాలనలోనే దెబ్బతిన్నదని, ఆయా ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన ఇంజినీర్ కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. నిర్మాణ లోపంతోనే కాళేశ్వరం దెబ్బతిన్నదని, అధికారం కోల్పోవడంతో కేసీఆర్, కేటీఆర్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మాట తీరు మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, కాంగ్రెస్ నాయకులు కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి 'ఎస్‌ఏ-2' పరీక్షలు

- అన్ని తరగతులకూ ఉదయమే నిర్వహణ : టైం టేబుల్‌లో సవరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) పరీక్షలు ఈనెల ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో అన్ని తరగతుల విద్యార్థులకూ ఉదయం పూట పరీక్షలను నిర్వహిస్తుండడం గమనార్హం. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడతారంటూ కొన్ని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి సోమవారం సవరించిన టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు, ఆరు, ఏడు తరగతులకు ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి 11.45 గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకే జరుగుతాయని వివరించారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి ఈనెల 23న ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. అదేరోజు తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహిస్తామనీ, మార్కుల రికార్డులపై తల్లిదండ్రుల సంతకాలను తీసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల డీఈవోలు ఎస్‌ఏ-2 పరీక్షల నిర్వహణపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేపటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- 19 కేంద్రాల్లో 11 వరకు నిర్వహణ
- ఈ నెలాఖరులో ఫలితాలు!
- నేటితో ముగియనున్న పరీక్షలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యు యేషన్) ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలు గతనెల 18 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. గతనెల 30వ తేదీతో ప్రధాన పరీక్షలు ముగిశాయి. మంగళవారంతో మిగిలిన పరీక్షలు పూర్తవుతాయి. బుధవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ జరుగుతుంది. 18 జిల్లాల్లో 19 మూల్యాంకన కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో రెండు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలున్నాయి. ఈనెలాఖరులో లేదంటే వచ్చేనెల మొదటి వారంలో పదో తరగతి ఫలితాలను విడుదల చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

టెన్త్ పరీక్షకు 98.30 శాతం హాజరు

పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం ఎనిమిదో రోజు ఒకేషనల్, ఓఎస్‌ఎస్‌సీ పేపర్-1 పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 37,892 మంది దరఖాస్తు చేస్తే, 37,247 (98.30 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. 645 (1.70 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 91 మంది దరఖాస్తు చేసుకుంటే, 87 (95.60 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. నలుగురు (4.40 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఎనిమిదో రోజు ఒక్క విద్యార్థిపైనా మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేయలేదని తెలిపారు. ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు. మంగళవారంతో పదో తరగతి పరీక్షలు ముగుస్తాయి.

ఎన్నికల్లోనే కాదు... ఆర్థిక వ్యవస్థలోనూ రిగ్గింగే...!

- పెరుగుతున్న అసమానతలు
- పెద్దలకు వరాలు... పేదలపై భారాలు
- కార్పొరేట్ శక్తుల జేబులు నింపుతున్న ప్రభుత్వం
- నానాటికీ తీసికట్టుగా మారిన పేదల సబ్సిడీలు



న్యూఢిల్లీ : అమెరికా ఆర్థిక వ్యవస్థ రిగ్గింగుకు గురైందని కొన్ని సంవత్సరాల క్రితం నోబెల్ బహుమతి గ్రహీత జోసెఫ్ స్టిగ్‌లిట్జ్ వ్యాఖ్యానించారు. అమెరికాలో ఆదాయ అసమానతలు అధికంగా ఉన్నాయని, అత్యంత సంపన్నులైన 1శాతం ప్రజల చేతిలో లెక్కకు మించిన ఆదాయం పోగు పడిందని ఆయన తెలిపారు. మిగిలిన 99శాతం ప్రజల ఆదాయాలు మాత్రం ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకుండా స్థిరంగా ఉన్నాయని చెప్పారు. వాస్తవానికి అమెరికాలో మాత్రమే కాదు... మన దేశంలో కూడా ఆర్థిక వ్యవస్థ రిగ్గింగుకు గురవుతోంది. అవును...అమెరికా ఆర్థిక వ్యవస్థ కంటే అధికంగానే. భారత జాతీయాదాయంలో అత్యంత సంపన్నులైన 10శాతం మంది వాటా అమెరికా, చైనా దేశాలలోని అత్యంత సంపన్నులైన 10శాతం మంది వాటా కంటే ఎక్కువగానే ఉంది. కానీ దురదృష్టమేమంటే మన దేశంలోని మెజారిటీ ప్రజలు ఆర్థిక వ్యవస్థ రిగ్గింగుకు గురవుతోందన్న విషయాన్ని గుర్తించడం లేదు. నిరంకుశ శక్తుల పాలనలో ఈ కఠోర వాస్తవం మరుగున పడుతోంది. ఎందుకంటే ఈ శక్తులు దేశ రాజకీయ ముఖచిత్రాన్ని శాసిస్తున్నాయి. ప్రతి విషయంలోనూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నాయి.

పెరుగుతున్న ఆదాయ వ్యత్యాసాలు

గత 12 సంవత్సరాల కాలంలో అత్యంత సంపన్నులు, అట్టడుగున ఉన్న పేదల మధ్య ఆదాయ వ్యత్యాసం బాగా పెరిగిపోయింది. 2005లో పేద ప్రజలకు సంపదలో ఎంత వాటా (6.5శాతం) ఉన్నదో 2022లో కూడా అంతే ఉంది. అదే కాలంలో అత్యంత సంపన్నులైన 10శాతం మంది ప్రజలకు సంపదలో వాటా 59.7శాతం నుండి 64.6శాతంకి పెరిగిపోయింది. అంటే 4.9 శాతం పాయింట్లు పెరిగింది. ఇదంతా మధ్య తరగతి ప్రజల నుండి పొందినదే. 1961లో పేద ప్రజలకు జాతీయ సంపదలో 11.4శాతం వాటా ఉంది. అదే సంవత్సరం అత్యంత సంపన్నులైన 1శాతం మందికి 12.9శాతం వాటా, 0.1శాతం మందికి 3.2శాతం వాటా ఉంది. 2022 నాటికి 0.1శాతం ప్రజల సంపద తొమ్మిది రెట్లు పెరిగింది.

పేదలు, మధ్య తరగతి ప్రజలను కొల్లగొడుతూ...

వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ ఇటీవల విడుదల చేసిన నివేదిక అనేక చేదు నిజాలను బయటపెట్టింది. అట్టడుగున ఉన్న 50శాతం మంది పేదలు, ఓ మాదిరి స్థాయిలో ఉన్న 40శాతం మంది మధ్య తరగతి ప్రజల ఆదాయాలను ఈ 10శాతం మంది సంపన్నులే కొల్లగొట్టి జేబులో వేసుకుంటున్నారు. ముఖ్యంగా ఇటీవలి సంవత్సరాలలో 40శాతం మంది మధ్య తరగతి ప్రజల చేతుల్లో ఉన్న సంపద 10శాతం మంది సంపన్నుల జేబుల్లో చేరుతోంది. ఉదాహరణకు 2007లో మధ్య తరగతి ప్రజలు మొత్తం ఆదాయంలో 34.6శాతం వాటాను కలిగి ఉన్నారు. అయితే 2022 నాటికి అది 27.3శాతంకి పడిపోయింది. అదే సమయంలో అత్యంత సంపన్నులైన 10శాతం మంది ప్రజల వాటా 48.1శాతం నుండి 57.శాతానికి పెరిగిపోయింది. మొత్తం ఆదాయంలో పేదల వాటా కూడా 17.5శాతం నుండి 15శాతంకి తగ్గింది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే అత్యంత సంపన్నులైన 10శాతం మంది ప్రజలు మధ్య తరగతి ప్రజల నుండి 7.2 శాతం పాయింట్లను, పేదల నుండి 2.5 శాతం పాయింట్లను కొల్లగొట్టారు.

కట్టు కథల ప్రచారం

దేశంలో పేదరికమే అతి పెద్ద కులమని పాలకులు చెబుతున్నారు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వ అధికారులేమో పేదరికం కేవలం 5శాతానికి తగ్గిపోయిందని కథలు చెబుతారు. సంపదను తిరిగి పంపిణీ చేసినంత మాత్రాన ఆర్థిక అసమానతలు తొలగిపోవని, అసమానత అనేది మార్కెట్ శక్తుల సహజ ఫలితమని, అసలు ఆదాయ అసమానతలు పెద్ద సమస్యే కాదని పాలకులకు వంత పాడుతున్న మీడియా సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి.

పేదల కడుపు కొట్టి...పెద్దల బొజ్జ నింపి

ప్రభుత్వం చేసే పని ఏమిటి? ప్రజల నుండి పన్నులు వసూలు చేయడం...ఆ సొమ్మును ఖర్చు చేయడం. అయితే ఈ పన్నుల వ్యవస్థ ఎప్పుడూ సంపన్నులకే ప్రయోజనకరంగా ఉంటుంది. నిరుపేదలకు నష్టాన్ని, కష్టాన్ని మిగిలిస్తుంది. 2009-10లో మొత్తం వసూలు చేసిన పన్నుల్లో 61శాతం ప్రత్యక్ష పన్నులు, 39శాతం పరోక్ష పన్నులు. 2021-22 నాటికి ప్రత్యక్ష పన్నులు 49శాతానికి తగ్గి పరోక్ష పన్నులు 51శాతానికి పెరిగాయి. వాస్తవానికి పన్నుల భారం సంపన్నుల పైనే అధికంగా ఉండాలి. పేదలపై సాధ్యమైనంత తక్కువ పన్ను భారం మోపాలి. అయితే ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. పేదలు, మధ్య తరగతి ప్రజలపై అధిక భారం మోపుతూ సంపన్నులకు సబ్సిడీలు అందిస్తోంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం పరోక్ష పన్నుల్లో మూడింట రెండు వంతుల ఆదాయం పేద ప్రజల నుండి వస్తున్నదే. ఆ ఆదాయంతోనే ప్రభుత్వం సంపన్నులకు పన్ను రాయితీలు కల్పిస్తోంది.

పెట్టుబడి వ్యయం పెంచుతూ... సబ్సిడీలను తగ్గిస్తూ...

కేంద్రం మూడు ప్రధాన పదులపై ఖర్చులు చేస్తుంది. అవి పెట్టుబడి వ్యయం, సబ్సిడీలు, రక్షణ-దేశ భద్రతపై చేసే వ్యయం. సాధారణంగా పెట్టుబడి వ్యయం కంటే సబ్సిడీలపై పెట్టే ఖర్చు ఎక్కువగా ఉండాలి. కానీ ప్రభుత్వం మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. 2016-17 నుండి (కోవిడ్-19 సంవత్సరంలో తప్ప) పెట్టుబడి వ్యయం పెరుగుతూనే ఉంది. సబ్సిడీలపై ఖర్చు తగ్గిపోతోంది. ఈ చర్యల ద్వారా వనరులను సమానంగా పంపిణీ చేయాలన్న సూత్రాన్ని ప్రభుత్వం బేఖాతరు చేస్తోంది. పెట్టుబడి వ్యయం అనేది కార్పొరేట్ ప్రయోజనాలకే ఉపకరిస్తుంది. ఈ పద్దు కింద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై పెట్టే పెట్టుబడులు అంతిమంగా కార్పొరేట్ శక్తులకు లాభాల పంట పండిస్తాయి. ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచుతాయి. 2008-09 నుండి 2013-14 వరకూ ప్రభుత్వం పేదలకు ఇచ్చే సబ్సిడీలపై 15.7శాతం ఖర్చు చేసింది. అదే కాలంలో పెట్టుబడి వ్యయంపై 11.7శాతం ఖర్చు చేసింది. అయితే 2014-15 నుండి 2022-23 వరకూ సబ్సిడీలపై సగటు ఖర్చు 12.8శాతంకి తగ్గగా పెట్టుబడి వ్యయం 13.9శాతంకి పెరిగింది. ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రతి రోజూ విధానాలను మార్చేస్తోంది. అసమానతలపై పోరాడాల్సిన ప్రభుత్వం తిరోగమన పన్ను విధానాల ద్వారా సంపన్నుల కొమ్ము కాస్తోంది.భారత్ వంటి పెట్టుబడిదారీ సమాజంలో డబ్బు ఎక్కడ ఉంటుందో అధికారం అక్కడికే చేరుతుంది. దేశంలో ఎన్నికల ప్రక్రియ కూడా అపహాస్యం పాలవుతోంది. వేలంలో ఎక్కువ మొత్తంలో పాట పాడిన వ్యక్తి ఎలాగైతే బిడ్డింగును దక్కించుకుంటాడో ఎన్నికల్లో కూడా పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేసిన వారే విజేతలుగా నిలుస్తున్నారు. ఎన్నికల్లో రిగ్గింగ్ ఎలా జరుగుతోందో ఆర్థిక వ్యవస్థలోనూ అలాగే జరుగుతోంది.

కాకతీయ తోరణం.. వరంగల్ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక

- దాన్ని ముట్టుకుంటే వరంగల్ అగ్నిగుండమే
- కడియం శ్రీహరి వెళ్లిపోయాకే కారులో పెరిగిన జోష్
- సీఎం రేవంత్‌రెడ్డివి ఉద్దెర మాటలే..
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం



నవతెలంగాణ-హసన్‌పర్తి

కాకతీయ తోరణం వరంగల్ జిల్లా ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, దాన్ని ముట్టుకుంటే వరంగల్ అగ్నిగుండమే అవుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలంలోని ఎర్రగట్టు గుట్ట క్రాస్‌రోడ్డులోని కేఎల్‌ఎన్ ఫంక్షన్‌హాలులో సోమవారం నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. వరంగల్‌లో కేసీఆర్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, వెయ్యి పడకల ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. వరంగల్ జిల్లాకు టెక్స్‌టైల్ పార్కు, వెటర్నరీ యూనివర్శిటీ ఇచ్చిన సంగతి ప్రజలకు తెలుసన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ చిహ్నంలోని కాకతీయ తోరణం తీసేస్తానని, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని అనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వందరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు చేసిందేమీ లేదని, ఈ వందరోజుల్లో ఉద్దెర మాటలే తప్ప తెలంగాణ ప్రజలనుద్ధరించిందేమీ లేదని అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీ స్కీములు అమలు చేస్తున్నట్టు అన్ని ఫేక్, లీక్ వార్తలే తప్పా.. వాటి అమలులో ప్రజల్లోకి వెళ్లింది లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజస్వరూపం ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థమవుతుందని, అందుకే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రజల వద్దకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించాలని సూచించారు. కేసీఆర్‌కు అద్భుతమైన ప్రజాస్పందన ఉందని, కడియం లాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరిపై హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కడియం శ్రీహరి పార్టీని వీడిన తరువాత వరంగల్ బీఆర్‌ఎస్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తుందన్నారు. కడియం శ్రీహరి కూతురు కావ్యకు టికెట్ ఇచ్చినా, బీఆర్‌ఎస్ పార్టీకి ఆయన ద్రోహం చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని గతంలో లంకె బిందెల దొంగతో పోల్చిన కడియం శ్రీహరి ఇప్పుడు అదే రేవంత్ చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పించుకున్నారని విమర్శించారు. ఇంతగా దిగజారడం అవసరమా అని కడియంను ప్రశ్నించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. టీడీపీ నుంచి కడియం శ్రీహరికి ఎమ్మెల్యే టికెట్, మంత్రి పదవి ఇచ్చింది తానేనంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం ఎన్‌టీ.రామారావు కడియంకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకున్నా.. తాను బతిమిలాడి టికెట్ ఇప్పించానని గుర్తుచేశారు. ఆపై కులం ప్రాతిపదికన తనకు మంత్రి పదవి రాకపోతే.. కడియం శ్రీహరికి మంత్రి పదవి ఇప్పించానన్నారు. కడియం శ్రీహరి కూతురు కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ ఇస్తే బీఆర్‌ఎస్ మూడో స్థానంలో ఉంటుందని తాను ముందే చెప్పానన్నారు. కడియం శ్రీహరి పార్టీ మారే పరిస్థితి ఉందని హరీశ్‌రావు తనతో అన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రావు, మాజీ డిప్యూటీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి, బండ ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పాపాల భైరవుడు కేసీఆర్

- కరువుకు, పంటలు ఎండిపోవడానికి కారణం ఆయనే
- పార్టీ ఫిరాయింపులను సమర్థించడం లేదు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పాపాల భైరవుడు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు, కృష్ణా బేసిన్ ఎండిపోవడానికి, పంటలు ఎండిపోవడానికి ఆయనే కారణమని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేండ్లపాటు కేసీఆర్ చేసిన తప్పులే ఇప్పుడు ఆయన్ను ఊపిరాడకుండా చేస్తున్నాయని చెప్పారు. పంట నష్టానికి ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలంటున్న కేసీఆర్, బీఆర్‌ఎస్ హయాంలో ఎంత పరిహారమిచ్చారో, ఎంత మందికిచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో 2014 నుంచి 2018 వరకు పూర్తి స్థాయి కరువుందన్నారు. ఈ కాలంలో రూ.ఐదు వేల కోట్ల నుంచి రూ.ఆరు వేల కోట్ల వరకు పంట నష్టం జరిగిందని వివరించారు. 2017లో వరదలు, అధిక వర్షాలతో రూ.12 వేల కోట్ల పంట నష్టం జరిగిందన్నారు. గతేడాది ఖరీఫ్‌లో పది లక్షల ఎకరాల్లో రైతులు పంటనష్టపోయారని చెప్పారు. పరిహారం ప్రకటించినా పది శాతం కూడా రైతులకివ్వలేదని విమర్శించారు. 2014 నుంచి కేంద్రం నుంచి రూ.2,483 కోట్లు రావాల్సి ఉందనీ, రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు కింద రూ.817 కోట్లు ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులు ఇవ్వకపోవడం వల్ల రైతాంగానికి నష్టం జరిగిందని చెప్పారు. ఇప్పటికైనా కేంద్రం నిధులను ఉపయోగించు కునేలా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటును చెల్లించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. పంటల బీమా పథకం నుంచి కేసీఆర్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం బయటకొచ్చిందనీ, మళ్లీ చేరుతామంటూ రేవంత్‌రెడ్డి ప్రకటించారని అన్నారు. నీటిని లెక్కలేసి సాగు, వ్యవసాయ రంగాలకు విడతల వారీగా పంపిణీ చేసేలా టైబందీ విధానాన్ని అమలు చేయాల్సి ఉన్నా కేసీఆర్ దాన్ని మర్చిపోయారని విమర్శించారు.

గతేడాది నవంబర్‌లో ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఉన్న నీటిని రైతులు వాడుకున్నారని వివరించారు. ఇప్పుడు ప్రాజెక్టుల్లో నీళ్లు లేవనీ, ఇది ఎవరి పాపమని కూనంనేని ప్రశ్నించారు. యాసంగి పంటల విధానాన్ని పట్టించుకోలేదనీ, ఆరు తడి పంటలను ప్రోత్సహించలేదని అన్నారు. నీరు ఎక్కువగా వాడే వరిని ప్రోత్సహించారని గుర్తు చేశారు. 30 లక్షల టన్నుల కూరగాయలు అవసరమైతే, 20 లక్షల టన్నులు మాత్రమే పంటలు పండుతున్నాయనీ, మిగిలినవి దిగుమతి చేసుకుంటున్నామని వివరించారు. పార్టీ ఫిరాయింపులపై ఇప్పుడు కేసీఆర్, బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఐ ఎమ్మెల్యేను బీఆర్‌ఎస్‌లో చేర్చుకోలేదా?అని ప్రశ్నించారు. డబ్బు, సెంటిమెంట్ ఇప్పుడు పనిచేయడం లేదని చెప్పారు. పార్టీ ఫిరాయింపులను తాము సమర్థించడం లేదని అన్నారు. ఫిరాయింపు చేసిన వారు తక్షణమే రాజీనామా చేయాలనే చట్టం ఉండాలని డిమాండ్ చేశారు. ఎంపీ సీట్లలో పోటీపై జాతీయ సమితికి నిర్ణయాధికారాన్ని అప్పగించామని చెప్పారు.

ఇండియా కూటమి మరింత బలోపేతం : అజీజ్ పాషా


ఇండియా కూటమి మరింత బలోపేతమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఆ కూటమికి దేశవ్యాప్తంగా సానుకూల వాతావరణం వస్తోందన్నారు. 400కుపైగా స్థానాలు వస్తాయంటూ గొప్పలు చెప్తున్న ఎన్డీయే కూటమికి కనీసం 270 స్థానాలు కూడా రావడం కష్టమేనని చెప్పారు. ఇండియా కూటమి ఐక్యంగా వెళ్తే పార్లమెంటు ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. కేజ్రీవాల్, హేమంత్ సోరేన్‌ను జైల్లో పెట్టడంతో సానుభూతి పెరిగిందని చెప్పారు. పంటలు ఎండిపోతున్నాయంటూ మాజీ సీఎం కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. రైతు ఆత్మహత్యలు జరిగితే కనీసం పరామర్శించలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, బాలనర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌లో ఉద్యకారులనూ వదల్లేదు

- సిట్ ఇన్‌చార్జి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి కెకె.మహేందర్‌రెడ్డి ఫిర్యాదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫోన్ ట్యాపింగ్‌లో ఉద్యమకారులను సైతం వదల్లేదని, వారి ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారని కాంగ్రెస్ నాయకులు, సిరిసిల్ల ఇన్‌చార్జి కెకె.మహేందర్ రెడ్డి ఆరోపించారు. తన ఫోన్ ట్యాపింగ్ చేశారని, విచారణను పారదర్శకంగా జరిపించాలని కోరుతూ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యన్నెం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సిట్ కార్యాలయానికి వచ్చారు. సిట్ ఇన్‌చార్జి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని కలిసి కొన్ని సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కెకె.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది పాల్గొన్నారని, కానీ తెలంగాణ రాష్ట్ర ఫలితాలు మాత్రం ఒకే కుటుంబానికే వెళ్లాయన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఏలారని, పదేండ్లు వారికి ఇష్టమొచ్చినట్టు చేశారని ఆరోపించారు. భావస్వేచ్ఛకు, ప్రజాస్వామిక హక్కులు, పౌరహక్కులకు ఆటంకాలు కల్పిస్తూ ఫోన్ ట్యాపింగ్ చేయించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తాము కేసీఆర్ కుటుంబంతో కలిసి మెలిసి తిరిగామని, అన్నదమ్ముండ్లుగా ఉండే వారమని గుర్తు చేశారు. అలాంటిది తమ ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో ఓ వార్ రూమ్ ఏర్పాటు చేశారని.. ప్రణీత్‌రావును సిరిసిల్లలోనే అరెస్టు చేశారని అన్నారు. సెలబ్రిటీలు, అధికారులు, వ్యాపారులతో పాటు ప్రముఖుల ఫోన్లు ట్యాంపింగ్ చేశారని తెలిపారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కేసీఆర్ ప్రభుత్వంపైనా, కేటీఆర్‌పైనా ఫిర్యాదు చేశామని తెలిపారు. తన ఫోన్ సైతం ట్యాంపింగ్ చేయడంతో సిరిసిల్ల నాయకులు తనతో ఫోన్‌లో మాట్లాడాలంటే భయపడేవారని అన్నారు. నిజాయితీగా విచారించాలని, అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సానుకూలంగా స్పందించిన సీపీ అన్ని కోణాల్లో విచారణ జరిపిస్తామని తమకు హామీనిచ్చినట్టు తెలిపారు.



రిలయన్స్ డిజిటల్ స్టోర్ అడ్డాగా మోసాలు

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత మీ సిబిల్ స్కోర్ బాగుంది, వస్తువుతోపాటు డబ్బులు సైతం తీసుకోండి, వడ్డీ లేకుండా డబ్బులు ఈఎంఐలో చెల్లించొచ్చని నమ్మించేవారు. ఇలా ఒక్కరిని.. వారిద్వారా మరికొంత మందిని చైన్ సిస్టంలా కట్టించుకున్నారు. వచ్చిన వారి నుంచి ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ చెక్కు.. ఇలా అన్ని డాక్యుమెంట్లు తీసుకుని స్టోర్‌లోనే ప్రాసెస్ చేసేవారు.

ఒక్కొక్కరి నుంచి లక్షల్లో వసూలు

నగరంతోపాటు శివారు ప్రాంతాలు, సిద్దిపేట్ జిల్లాలో సైతం బాధితులకు గాలం వేశారు. ఉప్పల్‌లోని స్టోర్‌కు రప్పించి డాక్యుమెంట్లు తీసుకుని వారి సిబిల్ చెక్‌చేసి వస్తువులు ఇప్పించేవారు. కస్టమర్లను ఆకర్షించేందుకు ఇందులో మోసం లేదు, తమకు టార్గెట్స్ ఉంటాయి. అందుకే ఇలా చేస్తామని నమ్మించేవారు. కస్టమర్‌ను ఆకర్షించి వారితో వస్తువులు కొనుగోలు చేయించేవారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు వస్తువులు కొనుగోలు చేయించేవారు. వాటికి రిసిప్ట్ సైతం ఇచ్చేవారు. స్టోర్ నుంచి ఆ వస్తువులను మరో ఆటోల్లో తీసుకెళ్లే వారని తెలిసింది. వస్తువు వస్తుందని ఫోన్‌లో చెప్పి ఓటీపీని తెలుసుకునే వారు. ఆ తర్వాత తీసుకెళ్లిన వస్తువులను కస్టమర్లకు తెలియకుండానే మార్గమధ్యలోనే మాయం చేసేవారు. ముందుగా వచ్చిన కస్టమర్లకు పూర్తిగా నమ్మకం కలిగేందుకు వారికి నాలుగైదు రోజుల్లోనే డబ్బులు చెల్లించేవారు. కొనుగోలుదారులు సైతం వారికి డబ్బులు వచ్చాయని మరికొంత మందిని స్టోర్‌కు తీసుకొచ్చేవారు. అలా వచ్చిన వారికి మాత్రం 10రోజులు గడువు విధిస్తున్న నిందితులు.. ముందుగా రూ.10 నుంచి 20వేలు మాత్రమే చెల్లించేవారని తెలిసింది. ఆ తర్వాత వివిధ కారణాలు చెప్పి వాయిదాలు వేస్తున్నారు. ఇలా వందలాది మంది బాధితులను మోసం చేసిన నిందితులు రూ. లక్షలు దండుకున్నారు. తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితులు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. స్టోర్‌లో పనిచేస్తున్న సాగర్, జ్యోతి తమను నమ్మించి మోసం చేశారని ఫిర్యాదు చేశారు. వారు సంస్థకు చెందిన ఐడీ కార్డులు వేసుకోవడం, స్టోర్‌లోనే అన్ని విషయాలు మాట్లాడటంతో పాటు పూర్తి ప్రాసెస్‌ను చేయడంతో పూర్తిగా నమ్మాల్సి వచ్చిందని తెలిపారు.

వస్తువులు ఇవ్వలే, డబ్బులు రాలే.. : బాధితులు

వస్తువులు కొనుగోలు చేస్తే.. ఆ డబ్బులు వెంటనే ఇస్తామని, 'జీరో' వడ్డీతో కట్టుకోవచ్చని నమ్మించడంతో దాదాపు రూ.3లక్షల వస్తువులు కొనుగోలు చేసినట్టు కొందరు బాధితులు తెలిపారు. నగరంలోని నాలుగైదు రిలయన్స్ డిజిటల్ స్టోర్స్‌లో ఇలాంటి వ్యవహారం కొనసాగుతుందని, చైతన్యపురి, సరూర్‌నగర్ తదితర పోలీస్‌స్టేషన్లలో సైతం కేసులు నమోదయ్యాయని తెలిపారు. డబ్బులు అడిగితే.. ఏం చేసుకుంటారో చేసుకోండని సాగర్, జ్యోతి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటు వస్తువులు ఇవ్వలేదని, డబ్బులు రాలేవని, ఈఎంఐలు మాత్రం కట్టాలంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులే తమకు న్యాయం చేయాలని కోరారు.

కేసు నమోదు చేశాం: ఉప్పల్ సీఐ

కొందరు బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేశామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఈ వ్యవహారంలో ఒక్కరిద్దరి ప్రమేయమే ఉందా లేక మరికొంత మంది ఉద్యోగుల ప్రమేయం ఉందా అనేది తేలాల్సి ఉందన్నారు. ఎవరికైనా కష్టపడందే డబ్బులు రావని, అత్యాశకు పోయి మోసపోవద్దని సూచించారు.

ఐజీ ఆదేశాల మేరకే..

(మొదటిపేజీ తరువాయి)

ఫోన్‌ట్యాపింగ్ చేయటం, దాని ఆధారంగా నిఘా వేయటం, తద్వారా రూ. లక్షల మేర డబ్బులను పట్టుకోవటం జరిగిందని రాధాకిషన్‌రావు వెల్లడించారు. ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఎస్‌ఐబీ ఆఫీసులో స్పెషల్ ఆపరేషన్ టీమ్(ఎస్‌ఓటీ) కార్యాలయం ఏర్పాటు చేసి, అక్కడ ప్రణీత్‌రావు నేతృత్వంలో కార్యాచరణను అమలు చేశారని ఆయన వివరించారు. ముఖ్యంగా, ప్రభాకర్‌రావు నుంచి విపక్ష ప్రముఖులకు చెందిన ఫోన్ నెంబర్లను ప్రణీత్‌రావు బృందం ట్యాపింగ్ చేసేదనీ, దాని ద్వారా వచ్చిన డబ్బుల పంపిణీ సమాచారాన్ని తమకు అందజేసేవారనీ, ఆ సమాచారం మేరకు తాము నిఘా వేసి, వాహనాలను అడ్డగించి డబ్బులను స్వాధీనపర్చుకునేవాళ్లమని రాధాకిషన్‌రావు వెల్లడించినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకుబంధువు కారునుంచి రూ. కోటి, భవ్య సిమెంట్స్ అధినేత కారు నుంచి రూ.70 లక్షలు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మునుగోడు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో ఆయన అనుచరుల కారులోనుంచి శ్రీనాథ్‌రెడ్డి అనే ఇన్‌స్పెక్టర్ సహాయంతో రూ.3.5 కోట్లను సీజ్ చేశామని రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్ట్‌లో వివరించారు. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు విపక్షానికి చెందిన నాయకులు, వారికి సమీపంగా మెలిగిన వ్యాపారస్థులు ఇతర ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేసి, సమాచారాన్ని ప్రభాకర్‌రావుకు చేరవేశామన్నారు. దీనిపై విచారణను మంగళవారానికి న్యాయమూర్తి వాయిదా వేశారు. కస్టడీలోని దనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలను రాధాకిషన్‌రావు ఇచ్చిన రిమాండ్ రిపోర్ట్ ఆధారంగా విచారించారు.

టెట్‌కు 43,991 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 43,991 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్‌కు 44,935 మంది ఫీజు చెల్లించారని వివరించారు. వారిలో పేపర్-1కు 16,060 మంది, పేపర్-2కు 24,556 మంది, రెండింటికీ 4,319 మంది ఫీజు కట్టారని తెలిపారు. దరఖాస్తులను సమర్పించిన వారిలో పేపర్-1కు 15,768 మంది, పేపర్-2కు 24,050 మంది, రెండింటికీ 4,173 మంది కలిపి 43,991 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల పదో తేదీ వరకు ఉందని తెలిపారు. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
మంగళవారం | ఏప్రిల్ 02, 2024 | www.navatelangana.com

శ్రీరాం నగర్‌లో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని శ్రీరాం నగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సమస్యలను తెలుసుకున్నారు. డ్రయినేజీ, రోడ్లు తదితర సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని, తనను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట కాలనీ అధ్యక్షుడు పెంటారెడ్డి, లక్ష్మీనారాయణ, జగ్గారెడ్డి, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఏర్పాటు





నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటర్ వివరాల కోసం కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబర్ 1950ను ఏర్పాటు చేసినట్టు మేడ్చల్-మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది, పోలింగ్ స్టేషన్ల నెంబర్లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలోని ప్రజలు లోక్‌సభ ఎన్నికల ఓటర్ వివరాలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఫారం 6, 7, 8 గూర్చి సంక్షిప్త సమాచారం, ఓటర్ ఐ డీ వివరాలు, పోలింగ్ స్టేషన్ వివరాలు, ఎపిక్ కార్డు వివరాలు, ఏఆర్ఓ, ఈఆర్ఓ/బీఎల్ఓ సూపర్‌వైజర్స్/ బీఎల్ఓ తదితర వివరాలు తెలుసుకోవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో.. న్యూటన్, విలియం హార్వే సంస్మరణ సభ



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం పూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్తలు ఐజాక్ న్యూటన్ వర్ధంతి, విలియం హార్వే జయంతి సందర్భంగా కమలానగర్ ఆఫీసులో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా భౌతిక శాస్త్రవేత్త ఐజాక్ న్యూటన్ చిత్రపటానికి ప్రముఖ విజ్ఞాన వేత్త జయప్రకాష్, విలియం హార్వే చిత్రపటానికి సామాజిక ఉద్యమ నేత కేకే. ప్రసాద్‌బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జయప్రకాష్ మాట్లాడుతూ.. న్యూటన్ పేద కుటుంబంలో పుట్టినా విద్యాభ్యాసంలో నైపుణ్యత సంపాదించా రన్నారు. గురుత్వాకర్షణ శక్తిపై అనేక ప్రయోగాలు చేసి ఎన్నో సైద్ధాంతిక విషయాలను వెలుగులోకి తెచ్చారని చెప్పారు. ఆకాశంలో ఉండే చంద్రుడు, ఇతర గ్రహాలు ఎందుకు కిందపడటం లేదని పరిశీలించి వాటిపై పరిశోధనలు చేసి గురుత్వాకర్షణ శక్తి చంద్రుడు, గ్రహాలల్లో సైతం ఉంటుందని, వాటి శక్తులను బట్టి ఒక పాయింట్ దగ్గర స్థిరీకరిస్తుందన్నారు. ఉదాహరణకు ఒక తాడుకు రెండువైపులా బలాలు సమానంగా ఉన్నప్పుడు ఎలా స్థిరంగా ఉంటుందో అలాగే ఉంటుందని చెప్పారు. కేకే ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. విలియం హార్వే ప్రయోగాలు మానవ శరీర శాస్త్రం పురోభివృద్ధి చెందటానికి దోహదపడ్డాయన్నారు. గుండెకు రక్త ప్రసరణ ధమనులు, సిరలు ద్వారా జరుగుతుందని రుజువు చేశారని పేర్కొన్నారు. గుండె కవాటాల ద్వారా రక్తం ఒకే వైపుకి పయనిస్తుందని, రెండో వైపుకి వెళ్లకుండా నిరోధించే శక్తి ఉంటుందని గుర్తించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ..అనేక మంది శాస్త్రవేత్తలు కృషి ఫలితంగానే శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం ముందుకు నడుస్తోందన్నారు. మనావళి మతం, మూఢత్వంలో నలిగిపోయిన రోజుల్లో అనేక మంది శాస్త్రవేత్తలు సాంకేతిక రంగాల పురోభివృద్ధికి కృషి చేశారని, వారందరికీ మనం రుణపడి ఉన్నామని చెప్పారు. అనంతరం సభ్యులకు శాస్త్రవేత్తల చిత్రపటాలకు పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోమటి రవి, నర్సింగరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, గౌస్య శారద, కేకే. ప్రసాద్ బాబు, జయప్రకాష్, లక్ష్మయ్య, శివప్రసాద్, పిబి. చారి పాల్గొన్నారు.

అలియాబాద్ చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం దోహదపడుతుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు కంఠం కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అలియాబాద్ చౌరస్తా వద్ద శ్రీరామ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృత చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో యూనియన్ వారు సేవా దృక్పథంతో ప్రయాణికుల దాహం తీర్చడానికి చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రయాణికుల దీవెనలు వారిపై ఉండాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీశ్రీరామ ఆటో యూనియన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్, ఆటో యూనియన్ అధ్యక్షుడు కరుణాకర్, మాజీ అధ్యక్షుడు యాదగిరి, రసినఫిక్, శ్రీనివాస్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డీల హక్కుల సాధనకు ఐక్యతతో పోరాడాలి



- సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ
- చీర్యాలలో రెడ్డి సంఘం భవనం ప్రారంభోత్సవం

నవతెలంగాణ-కీసర

రెడ్డిల హక్కుల సాధన కోసం రెడ్డి బిడ్డలందరూ ఐక్యతతో ముందుకు పోవాలని సింగిరెడ్డి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కీసర మండల పరిధిలోని చీర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన రెడ్డి సంఘం భవనాన్ని ఎంపీపీ మలారపు ఇందిరా లక్ష్మీనారాయణ, రెడ్డి భవనం స్థలదాత సింగిరెడ్డి కృష్ణారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో రెడ్డిలందరూ ఐక్యంగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చీర్యాల మాజీ సర్పంచ్ ధర్మేందర్, మాజీ ఉపసర్పంచ్ జిల్లాల తిరుమలరెడ్డి, బందారు నీలంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రామిడి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి అంజిరెడ్డి, జంగారెడ్డి, సంజీవ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రామిరెడ్డి, మల్లారెడ్డి, సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, రెడ్డి సంఘం నేతలు, పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహించొద్దు



- కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి
- పోస్టల్ బ్యాలెట్‌పై సిబ్బందికి అవగాహన

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అలసత్వం ప్రదర్శించరాదని జవహర్ నగర్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో వృద్ధులకు, వికలాంగులకు, పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగంపై బీఎల్ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వికలాంగులు, వృద్ధులు ముందస్తుగానే ఓటు కోసం దరఖాస్తు చేసుకోనేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీఎల్‌వోలు వికలాంగులకు, వృద్ధులకు, అవగాహన కల్పించి ఓటింగ్ శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, బీఎల్‌వోలు ఉన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో..
జీహెచ్ఎంసీ కొత్త రికార్డు

- గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ. 257 కోట్లకు పైగా వసూలు
- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ కొత్త రికార్డు సృష్టించింది. ఆస్తిపన్ను వసూళ్లలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది రూ. 257 కోట్లకు పైగా ఆస్తిపన్ను అదనంగా వసూలైంది. 2023-2024 సంవత్సరం సవరించిన బడ్జెట్ అంచనాల మేరకు రూ.1810 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.1917 కోట్ల పన్ను వసూలైంది. గత సంవత్సరం 2022-2023లో ఆస్తి పన్ను సేకరణ రూ.1660 కోట్లతో పోలిస్తే 15.5 శాతం పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అమలు ద్వారా ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీని ప్రారంభించడంతో మంచి ఫలితాలు వచ్చాయి. పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడంతో ఈ ఏడాది దాదాపు రూ.300 కోట్ల పన్ను వసూళ్లు చేయగలిగారు. 31న చివరి రోజున రూ. 123 కోట్ల పన్ను వసూళ్లు నమోదు అయినట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సోమవారం తెలిపారు. బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు పలువురు బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్ల వంటి కీలకమైన ఎన్నికల విధులు నిర్వహిస్తున్నప్పటికీ లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిల వసూళ్లు సమిష్టి కృషితో సులభతరమైందని అన్నారు.

సభ్యులకు సామాజిక సేవా బాధ్యత



నవతెలంగాణ-కల్చరల్

జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సభ్యులు ఏ పదవిలో ఉన్న సామాజిక సేవే బాధ్యత అని ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆలుమిని క్లబ్ జాతీయ ఉపాధ్యక్షుడు వినయ్ మెహతా అన్నారు. సోమవారం చాంబర్ కార్యాలయంలో వివిధ హోదాలలో పని చేసిన కొణిజేటి సత్యనారాయణను వినయ మెహతా జోన్ చైర్మెన్ జీ.వీ.ఎస్.రాజు కార్యదర్శి డీ.వీ.ఎస్.పీ. గుప్తాలతో కలిసి సత్కరించారు. జీ.వీ.ఎస్.రాజు మాట్లాడుతూ సత్యనారాయణ అంకిత భావంతో సంస్థ చేపట్టిన ప్రతి సామాజిక కార్యక్రమాలలో పాల్గొన్నారని తెలిపారు. కోశాధికారి నాగేశ్వర రావు పోలిశెట్టి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

4న వెంకట్ రచన చిన్మయ చింతనం గ్రంథావిష్కరణ

నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 4న రవీంద్ర భారతి ప్రధాన వేదికపై వాగ్గేయకారుడు అన్నమాచార్య సంకీర్తనలపై టీకా సహిత విశ్లేషణ చేసిన వ్యాఖ్యాన వాచస్పతి వెంకట్ గరికపాటి 20వ రచన చిన్న తిరుమలయ్య సంకీర్తనల పై వ్యాఖ్యాన సహిత చిన్మయ చింతనం ఆవిష్కరణ జరుగుతుందని శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహకుడు గొర్తి చంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ ప్రకాష్ చంద్ర బారర్ పాల్గొంటారని, సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రచయిత సుధామ పాల్గొనే సభకు తొలుత శ్రీనిధి తిరుమల శిష్య బృందంతో అన్నమయ్య కీర్తనల గాన గోష్ఠి ఉంటుందని చెప్పారు.

మల్కాజిగిరిలో ఈటలను తరిమికొట్టాలి

- ఈటల దళిత బాధితుల సంఘం అధ్యక్షుడు తిప్పారపు సంపత్



నవతెలంగాణ-ఉప్పల్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్ గెలువకుండా మల్కాజిగిరిలో చావుడప్పుతో సాగనంపుతామని ఈటల దళిత బాధితుల సంఘం అధ్యక్షుడు తిప్పారపు సంపత్ అన్నారు. సోమవారం ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఈటల ఒక మోసగాడని, ఆయన అరాచకాలు, అక్రమ కేసుల, హత్యలపై యాభై వేల కరపత్రాలు విడుదల చేశామని తెలిపారు. ఆయన దుర్మార్గాలను మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని గడపగడపకు వివరిస్తామని చెప్పారు. హుజురాబాద్ నియోజకవర్గంలో ఎంతో మందిపై దాడి చేసి, అక్రమ కేసులు పెట్టి చంపిండాని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నరరూప రాక్షసుడని మండిపడ్డారు. వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామంలో బాలరాజు హత్య ఈటల రాజేందర్ చేయించాడని గ్రామస్తులు ఆందోళన చేసి ప్రశ్నిస్తే 45 మందిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన నీచుడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అక్రమ ఆస్తులపై సీబీఐ విచారణ జరపాలని ప్రశ్నిస్తే ఐదేండ్ల క్రితం 12 కుటుంబాలపై కేసులు పెట్టి 62 రోజులు జైలుకు పంపిచా డని గుర్తు చేశారు. హుజురాబాద్ మండలం పాపాయపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ యాదవ్‌పై అక్రమ కేసులు పెట్టి పోలీసు లతో కొట్టిస్తే చనిపోయింది నిజం కదా అన్ని ప్రశ్నించారు. ఈటల అరాచకాలు చూడలేకనే హుజురాబాద్ ప్రజలు ఎమ్మెల్యేగా ఓడించారని తెలిపారు. ఉద్యమం ముసుగులో అనేక దోపిడీ చేశారని పేర్కొన్నారు. బీసీ నేత అనేది ఒక బూటకమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను వేధించే రాక్షసుడని తెలిపారు. ఈటల దళిత బాధితుల సంఘం నాయకులను చంపడానికి కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. తమకు ఏదైన జరిగితే ఆయనదే బాధ్యత హెచ్చరించారు. ఈ ప్రభుత్వం తమకు రక్షణ కల్పించాలని కోరారు. మల్కాజిగిరి ప్రజలు ఈటలను తరమికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నమ్మిండ్ల రాజేశ్వర్, మేకల జానీ, చల్లూరి రాహుల్, మమత, రమ, వెన్నెల, నవీన్, ప్రతాప్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-కీసర

కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ ఇందిరమ్మ కాలనీఫేజ్-2, సైలెంట్ ఎవెన్యూ శ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి దివ్య ఆశీస్సులతో శ్రీకనకదుర్గ విజయ గణపతి, శివలింగ, సుబ్రహ్మణ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు ముప్ప రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ లు వరగంటి వెంకటేష్, స్వప్న, సరిత, నాయకులు హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తూంకుటలోని అక్రమాలకు అడ్డుకట్ట వేయండి

- అనుమతులు లేని గోదాంలు, బహుళ అంతస్తులు, వెంచర్లను ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీకోవాలి
- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్లు



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా వెలుస్తున్న గోదాంలు, వెంచర్లు, బహుళ అంతస్తులకు అడ్డుకట్ట వేయాలని మున్సిపల్ కమిషనర్‌కు పలువురు కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు పలు అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో కొందరి అండదండలతో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతూ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారని వివరించారు. ఇలాంటి అక్రమార్కులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని వార్డులలో అక్రమంగా వెంచర్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దేవరయంజాల్ పరిధిలోని దేవాయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని పేర్కొన్నారు. గతంలోని మున్సిపల్ కమిషనర్ జైత్రం నాయక్‌తో మున్సిపాలిటీ చైర్మెన్ కారంగుల రాజేశ్వరరావు, వైస్ చైర్మెన్ పన్నాల వాణి వీరారెడ్డి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కరుణాకర్, కొందరు కౌన్సిలర్లు చేతులు కలిపి పలు అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. తూంకుంట మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, అక్రమాలకు పాల్పడి వారి జేబులు నింపుకున్నారే తప్పా ఖజానాకు ఎలాంటి లాభం చేకూర్చలేదని మండిపడ్డారు. ఇప్పటికే వేల ఎకరాల దేవాలయ భూమి బినామీ పేర్లతో అప్పనంగా కాజేశారని తెలపారు. అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వెంచర్లతో పాటు బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని, ఈ అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దేవరయంజాల్ పరిధిలోని దేవాలయ భూముల్లో వెలిసిన గోదాంలు, ఇతర నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని కోరారు. మున్సిపాలిటీ ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై గతంలో పలుమార్లు వినతి పత్రం అందజేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇకనైనా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో తూంకుంట మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, బొల్లబోయిన రాజ్ కుమార్ యాదవ్, తదితరులు ఉన్నారు.

ముగిసిన 'విశ్వబ్రాహ్మణుల రౌండ్ టేబుల్ సమావేశం'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థలను ఒకే వేదిక మీదకు తెచ్చి వారిని ఐక్యపరిచే లక్ష్యంతో మార్చి 31న హైదరాబాద్ హనుమాన్ టెక్డి బీసీ హాల్లో "విశ్వ బ్రాహ్మణుల కీలక సమస్యలపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత జస్టిస్ బీ. చంద్ర కుమార్ హైకోర్టు జడ్జి (అవిభాజ్య ఆంధ్రప్రదేశ్), సభాధ్యక్షులుగా బెంగళూరుకు చెందిన డాక్టర్ కశ్యప్ దాకోజు, అమెరికాకు చెందిన వినోద్ కుకునూరు (వ్యవస్థాపకులు కవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ యూఎస్ఏ కమిటీ సభ్యులు గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ ఫౌండేషన్), వరప్రసాద్ గురజాపుగా (విశ్వకర్మ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా కమిటీ సభ్యులు) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ విద్యానిధికి వినోద్ కుకునూరు రూ. లక్ష చెక్ ను విరాళంగా అందజేశారు. ప్రకాశం జిల్లా మార్టూరులో నిర్మిస్తున్న అమ్మ ఆశ్రమానికి విరాళంగా వెన్సో ట్రస్ట్ తరఫున అధ్యక్షుడు బంగారు తాతారావు రూ.30,366 చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బంగారు తాతారావు విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షులు చింతాడ నరేంద్రకుమార్, పెంటా శ్రీనివాసా చారి మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన విశ్వబ్రాహ్మణ సేవా సంస్థల ప్రతినిధులకు, వారి సలహాదారులకు, దాతలకు, "సృజనకారులు" పక్ష పత్రిక ఎడిటర్ కొత్తపల్లి సీతారామ్ ఆచార్యకు, నిర్వాహకులు నక్కా సుధాకర్‌కు, హాజరై వారికి ధన్యవాదాలు తెలిపారు.

ముత్యాలమ్మ గుడిలో 41వ రోజు మండలపూజ



పూజల్లో పాల్గొన్న చిన్నారులు, మహిళలు, తదితరులు

- ఆలయ కమిటీ చైర్మెన్ బూడిద వెంకటేష్

నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ మదర్ థెరిస్సా కాలనీలోని ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన జరిగి 41 రోజులు పూర్తి కావడంతో సోమవారం మండల పూజా కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మెన్ బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హరిస్వామి పంతులు చేతుల మీదుగా వేదమంత్రోచ్చారణలతో జరిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, రమేష్ చారీ, బండకింది ప్రసాద్, బోయినిపల్లి నరసింహ, కేకే . చారి, మహేందర్ యాదవ్, దివాకర్, చంద్రశేఖర్, చెన్నారెడ్డి, గుడి కమిటీ వైస్ చైర్మెన్ మీనాక్షి, రవి, నరసింహచారి, మహేందర్, పర్వతాలు, మంజుల, కాలనీ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నటుడు వెంకటరెడ్డికి నంది అవార్డు



నవతెలంగాణ-కల్చరల్

సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ రుద్రా స్టూడియో వారి నిర్వహణలో బిర్లా సైన్స్ ప్లానిటోరియంలో నిర్వహించిన నంది అవార్డు బహుకరణ వేడుకల్లో ప్రముఖ సినీ టీ.వీ.సీరియల్ నటుడు వెంకటరెడ్డిని నంది అవార్డుతో సత్కరించారు. ముఖ్యఅతిథిగా అంభిక కృష్ణ, అంభిక సమస్త పాల్గొని వెంకట రెడ్డి నాలుగు దశాబ్దాలుపైగా సినీ పరిశ్రమలో ఉన్నారని అభినందించారు. సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రకటన విడుదల చేయాలి

- డాక్టర్ కట్ట శేఖర్



నవతెలంగాణ-ఓయూ

పీజీ కోర్సుల్లో ప్రవేశా లకు ప్రకటన విడుదల చేయాలని తెలంగాణ డిగ్రీ ప్రయి వేట్ లెక్చరర్స్ సమి తి రాష్ట్ర అధ్యక్షులు కట్టా శేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓయూ తో పాటు రాష్ట్రంలోని వివి ధ విశ్వవిద్యాలయాల్లో ఎంఎ, ఎంకామ్ ,ఎంఎస్సీ ఇతర పిజి, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశా లకు నిర్వహించే కామన్ పీజీ ఎం ట్రన్స్ టెస్ట్ 2024(సిపిజిఈటి)నోటిఫికే షన్ విడుదల ప్రతిఏటా జాప్యంతో విద్యా ర్థులు నష్టపోతున్నారన్నారు.లాసెట్, ఐసె ట్, ఇంజనీరింగ్ పీజీ సెట్, హెడ్ సెట్ తదితర సేట్ల నోటిఫికేష న్లు విడుదలైన పీజీ కోర్సుల ప్రకటనపై నిర్లక్ష్యం చే స్తున్నారని పీజీ ప్రవే శాల ప్రకటన జాప్యంతో ఓయూతో పాటు జేఎన్టీ యూ, కాకతీయ, శాత వాహన, తెలంగాణ మహా త్మాగాంధీ పాలమూరు తెలంగాణ ప్రభుత్వ మహి ళా యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ మొద లుకొని ప్రవేశాల ప్రక్రియ, తరగతులు, సెమిస్టర్ పరీ క్షలు ఫలితాల విడు దలలో ఆలస్యం అవుతుందన్నారు. సకా లంలో పీజీ కోర్సులు నోటిఫికేషన్ విడుదల చేయా లని డిమాండ్ చేశారు.



ఈస్టర్ పండుగ సందర్భంగా ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, ఇంద్రాహిల్స్ జెరూసలేం ప్రార్థన మందిరం పాస్టర్, క్రిస్టియన్ కమిటీ అధ్యక్షులు యం.రాజు ఆధ్వర్యంలో.. నిర్వహించిన ర్యాలీ కార్యక్రమానికి యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 129 - సూరారం కాలనీ డివిజన్ ఎం.జే.ఎస్ గార్డెన్స్ నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ హోం శాఖ మంత్రి వర్యులు మహమూద్ అలీ, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు హైదరాబాద్ నగర సంస్కృతి, మతసామరస్యా నికి ప్రతీక అని అన్నారు. ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో నెల రోజులపాటు ఉపవాసాలు చేస్తూ ఆ అల్లాను ఆరాధిస్తారు. అల్లా దయతో అందరి కుటుంబాల్లో సంతోషాలు వెల్లివెరియాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మైనార్టీ సోదరులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి పాపిరెడ్డి నగర్ బస్తీలో అక్రమ వాటర్ ప్లాంటు నిర్వహణతో బస్తీ వాసులు మరింత నీటి కష్టాలు ఎదురుకుంటున్నారని అక్రమ వాటర్ ప్లాంటును తొలగించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకేపూడి గాంధీకి ఊట్ల చంద్రారెడ్డి వినతి పత్రం అందజేశారు. చంద్రారెడ్డి మాట్లాడుతు అసలే వేసవి కాలం, పైగా నీటి ఎద్దడి బస్తీ వాసులు ఎదుర్కోంటున్నరన్నారు. వ్యాపార కేంద్రాలుగా మారిన వాటర్ ప్లాంటు నిర్వాహకులు భూగర్భ నీటిని తోడేస్తూ నీటిని విక్రయిస్తూ సొమ్ముచేసుకోవడంతో, భూగర్భ జలాలు అడుగంటి పోయి నీటి కొరత ఏర్పాడి బస్తీ వాసులు ఇబ్బందులు పడుతున్నారనీ తెలిపారు. ఇంట్లో ఉన్న బోర్లు సైతం ఎండిపోతున్నాయనీ, బోరు వేయాలంటే కినీసం 1000 నుంచి 1500 ఫీట్ల వరకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికే బస్తీలో ఉన్న వాటర్ ప్లాంటుకు తోడుగా రోడ్ నెం.16, బ్లాక్.సిలో మరో నూతన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి ఎద్దడికి అడ్డుగా మారిన వాటర్ ప్లాంటును తక్షణమే తొలగించాలని బస్తీ వాసులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సోమవారం బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీని కలిసి వినతి పత్రం అందిస్తూ విన్నవించుకున్నారు. అదే విధంగా కూకట్ పల్లి మండల తహశీల్దార్ స్వామికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, సిహెచ్ రామకృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి, శంకర్ బస్తీ వాసులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా

- తాగునీటి సరఫరా పరిశీలనకు ప్రత్యేక అధికారుల నియామకం
- నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో మద్దతు ధరపై కొనుగోలు
- పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రానున్న 2 నెలల పాటు పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వేసవి తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రతి రోజూ తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలనీ, ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. సజావుగా తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన పనులు పూర్తి చేశామన్నారు. తాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని కలెక్టర్లకు సూచించారు. మిషన్ భగీరథ వ్యవస్థ, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకుంటూ గ్రామస్థాయిలో రానున్న రెండు నెలలకు తాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను వినియోగిం చుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సప్లిమెంట్ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గురించి సత్వర పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. తాగునీటి సరఫరాను ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయనీ, అన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని, ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే సకాలంలో సరఫరా చేసే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాల న్నారు. నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకూ మద్దతు ధరపై కొనుగోలు చేస్తామన్నారు. ఈ విషయమై రైతులకు విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,203, సాధారణ రకం ధాన్యానికి రూ.2,183 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్ పోస్టులను అప్రమత్తం చేయాలన్నారు. కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎండ తీవ్రతను దష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో వరి సాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలనీ, ప్రణాళిక బద్ధంగా కొనుగోలు కేంద్రం వద్దకు రైతు ధాన్యం తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానాకాలం 2023-24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రతిరోజూ రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలనీ సీఎంఆర్, రా రైస్ డెలివరీపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకునిరావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్ మేజర్ మరమ్మత్తులు తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రతి మండలంలో పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ నియమించాలనీ, క్షేత్రస్థాయిలో మరోసారి పాఠశాలలను తనిఖీ చేసి పక్కగా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రతీ మండల స్థాయిలో పాఠశాల మౌలిక వసతుల కల్పనపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవో, పాఠశాల నిర్వహణ కమిటీలో ఉన్న స్వశక్తి మహిళా సంఘాలతో వర్క్ షాప్ ఏర్పాటు చేయాలన్నారు. ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వడ దెబ్బల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఏప్రిల్, మే నెలలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని, కార్మికులకు అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. అత్యవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలని, బయటకు వస్తే అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, వడ గాల్పులు గురైన వ్యక్తులకు వెంటనే అవసరమైన ప్రథమ చికిత్స చేసి సమీప హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ విజయకుమారి, డీఎంఅండ్‌హెచ్‌ఓ రఘునాథ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ కమిటీల నియామకం



నవతెలంగాణ-దుండిగల్

తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత మొగిలి రావు ఆదేశాలతో.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి అధ్యక్షతన సోమవారం బాచుపల్లిలోని కేఎహెచ్ఆర్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్ని డివిజన్‌ల మహిళా కాంగ్రెస్ కమిటీలను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరా ఏర్పాటు చేశారు. అట్టి కమిటీలకు సంబంధించిన నియామక పత్రాలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లడుతూ మహిళల అన్ని రంగాల్లో ముందుండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రతి ఒక్క మహిళకు వివరించారు. అందరికి పథకాలు అందేలా చూడాలని, రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫియా బేగం, సెక్రటరీ జాజుల రమ్య, అన్ని డివిజన్ల మహిళా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై బీజేపీ దాడి హేయమైన చర్య

- సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్



జర్నలిస్టులపై బీజేపీ శ్రేణుల దాడి హేయమైన చర్య అని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఈ.ఉమా మహేష్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరినగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హుజురాబాద్ లో ఎస్సీల పై దాడి చేయించారన్నారు. వాటి వివరాలను ప్రెస్ క్లబ్‌లో వివరిస్తున్న సమయంలో బీజేపీ కార్యకర్తలు గుండాలుగా ప్రవర్తించి వారిపై భౌతిక దాడులకు దిగడం, ఫర్నిచర్‌ను ధ్వంసం చెయ్యడం అనాగరిక చర్య అని అభివర్ణించారు. అదే విదంగా వార్త సేకరిస్తున్న విలేకరి పైన దాడి చెయ్యడం దారుణమని అన్నారు. దాడి చేసిన వారి పై కేస్ నమోదు చేసి రిమాండ్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. సత్యం (నిజాలు) చెప్పే వారంటే బీజేపీ కి భయం అని వాటిని అరిక ట్టడం కోసం భౌతిక దాడులకు దిగడం వారికి ఏపాటి ఓర్పు, సహనం ఉందో తెలుస్తోందని వ్యాఖ్యానించారు. మళ్ళీ బీజేపీ అధికారంలోకి వస్తే మాత్రం ప్రశ్నిం చిన వారు ఎవరైన సరే విలేఖరులు కూడా బాధితులే కాబట్టి దేశంలో విద్వేశం తగ్గి శాంతి సామరస్యం ఉండా లంటే బీజేపీ చేస్తున్న అన్యాయాలను మీడియా ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వారిని ఓడగొట్టాలని కోరారు. జర్నలిస్టుల పై ఎటువంటి దాడి జరిగినా సీపీఐ అండగా ఉంటూ ఖండిస్తుందని అన్నారు. పోలీస్ వారు కూడా నిందితులను అరెస్టు చెయ్యాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

మార్వాడి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గుజరాత్ రాష్ట్రం రాజ్ కోట్‌లోని మార్వాడి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని, అక్షర ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో, హైదరాబాద్ కూకట్‌పల్లిలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్ర మానికి మార్వాడి యూనివర్సిటీ ప్రో.వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్‌బీ జడేజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వము నుండి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహించిన అత్యంత తక్కువ కాలేజీల్లో మార్వాడి యూనివర్సిటీ ఒకటి అని తెలియజేశారు. 480 పైచిలుకు కంపెనీలు, క్యాంపస్ ఇంటర్వ్యూ చేయడం గర్వకారణంగా భావిస్తు న్నామన్నారు. 54 దేశాలకు చెందిన అంతర్జాతీయ విద్యార్థులు, 22 రాష్ట్రాలకు సంబంధించిన విద్యార్థులు మార్వాడి యూనివర్సిటీలో చదువుతున్నారని తెలి పారు. అత్యున్నతమైన నాణ్యతా ప్రమాణాలతో కూడు కున్న కంప్యూటర్ ల్యాబ్స్, లైబ్రరీ క్వాలిఫైడ్ అధ్యాపకుల తో విద్యను అందిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్ భోజన వసతి కల్పిస్తు న్నామనీ పేర్కొన్నారు. అక్షర ఎడ్యు కేషన్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ కన్యాపురి శ్రీనివాసులు, డైరెక్టర్స్ సుధాకర్ రెడ్డి, బ్రహ్మారెడ్డి, రఫీ, కిరణ్, శివ పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో మేయర్ పీఏ అరెస్టు

నవతెలంగాణ-బేగంపేట్

వ్యభిచారం కేసులో గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పీఏ అరెస్టయిన సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 23న బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్మెంట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్కోర్స్ పోలీసులు ఆ ఇంటిపై దాడులు నిర్వహించారు.ఈ దాడిలో మహిళా వ్యభిచార గృహ నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఆమెతో పాటు కొంతమంది అమ్మాయిలు, ఐదుగురు విటులను అదుపు లోకి తీసుకుని బేగంపేట పోలీసులకు అప్పగించగా పోలీసులు కేసు నమోదుచేసి వారికి సెక్షన్ 41 కింద నోటీసులు జారీ చేశారు. అటు తరువాత ఈ ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసిన సమయంలో పోలీసు లకు చిక్కిన ఐదుగురు విటులలో గ్రేటర్ హైదరాబాద్ మేయర్ పీఏ తోట రాజేష్ కూడా ఉన్నాడు. కాగా ఈ విషయం ఆలస్యంగా తెలియడంలో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయమై బేగంపేట ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించగా వ్యభిచారం గృహంలో పట్టుబడిన ఐదుగురు నిందితుల్లో తోట రాజేష్ అనే వ్యక్తి కూడా ఉన్నాడని, అతన్ని కూడా వారితో పాటు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. తోట రాజేష్ అనే వ్యక్తి మేయర్ పీఏ అనే విషయం తమకు ముందుగా తెలియదని, అందువల్లనే ఆ విషయాన్ని వెల్లడించలేకపోయామని తెలిపారు.

తోట రాజేష్‌కు మేయర్ కార్యాయంతో సంబంధం లేదు..

వ్యభిచారం కసులో పట్టుబడిన తోట రాజేష్‌తో గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదని మేయర్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన జారీ చేశారు. తోట రాజేష్ మేయర్ కార్యాలయంలో పీఏగా పనిచేసి గత ఫిబ్రవరిలో విధుల నుంచి తప్పుకున్నాడని, ప్రస్తుతానికి తోట రాజేష్‌కు మేయర్ కార్యాలయానికి గాని, మేయర్ కి గాని ఎటువంటి సంబంధం లేదని వెల్లడించారు. సామాజిక మాధ్యమంలో ప్రచారం అవుతున్న న్యూస్‌కు మేయర్ కార్యాలయానికి సంబంధం లేదని ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



గోకరాజ్ రంగరాజు ఇంజినీరింగ్ కళాశాలలో కుటుంబ యోగా దినోత్సవం

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ గోకరాజ్ రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో పతంజలి యోగ ఆధ్వర్యంలో సోమవారం కుటుంబ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని యోగా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరికీ యోగా కుటుంబ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ యోగా చేయడం వలన మనిషి ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటారని రోజు ఒక గంట పాటు యోగా చేస్తే మనము ఏ డాక్టర్ దగ్గరికి వెళ్ళవసరం లేదని తెలిపారు. యోగతో అనేకమైన రోగాల నుంచి కాపాడుకోవచ్చు అన్నారు. ముఖ్యంగా బీపీ షుగర్ క్యాన్సర్ ఉంటే రోగాల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కనుక ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఒక గంట యోగ చేయాలని సూచించారు. ఇక్కడ పతాంజలి యోగవారు గత రెండు సంవత్సరాల క్రితం ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నా వారికి అభినందనలు ధన్యవాదములు తెలియజేశారు. ఈ యోగాకు సంబంధించి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని పతంజలి యోగ వారికి తెలిపారు. పతంజలి యోగ వారు మాట్లాడుతూ మేము రెండు సంవత్సరాల క్రితం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పతాంజలి యోగ అనే పేరుతో ఉచితంగా యోగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఉచిత యోగా శిక్షణలో ఎంతోమంది ఆసక్తిగా వచ్చి యోగ చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో యోగా చేసిన వారికి కరోనా వారి ఇంటి దరిదాపులకు కూడా చేరలేదన్నారు. సుగర్ కంట్రోల్లో ఉండాలి అంటే యోగ మంచి ఉపశమనమని అన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగ నిర్వాహకులు రిటైర్ జడ్జి కే.జనార్ధన్ మాస్టర్ మల్లికార్జున్, మాస్టర్ ఏ నాగేశ్వరరావు, కే లక్ష్మారెడ్డి, బైండ్ల నగేష్, ఇంద్రసేనారెడ్డి, శ్రీలక్ష్మి, కాశి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన సదస్సు

- ఏసీపీ శ్రీనివాస రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో, వేసవి కాలం దృష్ట్యా అగ్నిప్రమాదాల నివారణకై, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని గోడౌన్లు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమల యజమానులతో, అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై కొన్ని సూచనలిచ్చారు. అగ్నిమాపక నివారణ చర్యల్లో భాగంగా పరిశ్రమలు, గోడౌన్‌ల వద్ద, షాపింగ్ మాల్స్ వద్ద వివిధ రకాల అగ్నిమాపక యంత్రాలు అమర్చాలనీ, సంఘటన జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, ఇతర అత్యవసర సేవలకు సమాచారమివ్వాలని ప్రమాదం జరిగిన సమయంలో, మానవ ఆస్తీ నష్టాన్ని నివారించడానికి తీసుకోవలసిన చర్యలు, అగ్నిమాపక శాఖ సూచించారు. మార్గదర్శకాలు, నియమ, నిబంధనలను తప్పని సరిగా అనుసరించడంతో పాటు ప్రతి ఒక్కరూ ఫైర్ సేఫ్టీకి సంబందించిన నియమాలు పాటించాలని తెలిపారు.ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఎస్ హెచ్ ఓ కృష్ణ మోహన్, కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర రావు, బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్, కూకట్‌పల్లి డివిజన్‌లోని అందరు ఎస్ఐలు, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఉన్నారు.

నేటి విద్యార్థులు భావితరాలకు దిక్సూచిగా నిలవాలి



- మానసిక వ్యక్తిత్వ నిపుణులు సుధీర్ సంద్ర

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి విద్యార్థులు భావితరాలకు దిక్సూచిగా నిలవాలని, ప్రముఖ మానసిక వ్యక్తిత్వ నిపుణులు సుధీర్ సంద్ర సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని, రంగారెడ్డినగర్ ప్రాంతంలో గల బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాలలో (బ్రైట్ కల్చరల్ ఫెస్ట్. 2024) వార్షికోత్సవ వేడుకలు చిన్నారి విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ వినోద్ జాదవ్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా ప్రోత్సహిస్తేనే వారు ఉన్నతులుగా ఎదుగుతారన్నారు. క్రమశిక్షణ, పట్టుదల కనబరిస్తే సమాజం గర్వించే పౌరులుగా రాణిస్తారని ఆకాంక్షించారు. పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ లయన్ వినోద్ జాదవ్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండే పిల్లలలోని నైపుణ్యతను వెలికి తీస్తూ విద్యతో పాటు సామాజిక విలువలు నేర్పుతూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం నర్సరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమిష్టిగా పనిచేసి భారీ మెజార్టీని కట్టబెడతాం



- 132 డివిజన్ బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

132 డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కేపీ వివేకానందని, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ అఖండ మెజార్టీని సాధించిం న్నారు. తిరిగి మరో మారు పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి అయిన రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించే విధంగా పనిచేయాలన్నారు. అనంతరం 132 డివిజన్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు అందరం సమన్వయంతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 132 డివిజన్ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దయ, కరుణాకటాక్షాలు కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రజలందరి పైన ఉండాలని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీలోని శ్రీ పోచమ్మ అమ్మవారి నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ,ధ్వజస్తంభ ప్రతిష్ఠ,బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం వద్ద సోమవారం నిర్వహించిన శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి, కాలభైరవ సహిత నవగ్రహ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుష్ట శిక్షణ,శిష్ట రక్షణ కోసం అమ్మవారు వివిధ రూపాలలో అవిర్భవించారని అందులో ఒకటే భద్రకాళి అవతారమన్నారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
హైదరాబాద్
మంగళవారం ఏప్రిల్ 02, 2024 www.navatelangana.com

ఎస్‌వీకేలో 6న 'పాటపై తూట' సదస్సు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కాల్పులు జరిపిన సందర్భాన్ని పుర స్కరించుకుని ఈనెల 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వీకే)లో పాటపై తూటా సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు గద్దర్ ఫౌండేషన్ కార్యదర్శి సూర్యం తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరిలతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బావ ప్రకటన-పాలకుల అణిచివేత-గాయపడ్డ పాట అనే అంశంపై వక్తలు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ కంచి ఐలయ్య, సీనియర్ సంపాదకులు కే.శ్రీనివాస్ హాజరవుతారని చెప్పారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం సాయంత్రం : 6.35గం.
సహర్ : బుధవారం ఉదయం : 4.46గం.

పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

- టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు కేంద్ర ప్రభుత్వం వెంటనే భారతరత్న అవార్డు ప్రకటించాలని టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కెహెచ్ఎస్ జగదాంబ ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్ గుండులోని ట్రస్ట్ కార్యాలయంలో జాతీయ పతాక 103 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంజన్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య చరిత్ర భావితరాలకు తెలిసే విధంగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పాఠ్య అంశాల్లో పొందు పరచాల్సిన అవసరం ఉందన్నారు. పింగళి వెంకయ్య చేసిన కృషిని పింగళి చారిటబుల్ ట్రస్ట్ ప్రజలకు తెలియజేసినందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కేహెచ్ఎస్ జగదాంబ పలువురు ప్రముఖులకు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మెన్ కె. శ్యామలరావు, సభ్యులు శ్రీకాంత్, అనుదీప్ వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల బాబురావు, పొన్నాడ సుబ్రహ్మణ్యం, వరదరాజు కర్ణం సురేష్, ఆనంద్ విజయ యాదవ్, జి.నాగేంద్ర ప్రసాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

- ఇసామియా బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహక



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వేసవి కాలంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోఠి ఇసామియబజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహక అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రజలు ఎండా కాలంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలందరికీ ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. వేడిని తట్టుకునేందుకు ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రజలు పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల తాగడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలన్నారు. ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. కూరగాయలు, పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. పసి పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు తల్లి పాలు తప్పనిసరిగా పట్టించాలని చెప్పారు. వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అత్యవసర సమయాల్లోనే బయటకు వెళ్లే ప్రజలు గొడుగు, తలకు టోపీలు ధరించాలని సూచించారు. ప్రజలు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తమ ఆసుపత్రిలో బీపీ, బిషుగర్, థైరాయిడ్ వ్యాధులకు మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందిస్తున్నామన్నారు. ప్రజలు ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు.

పాతబస్తీలో రంజాన్ శోభ..

- బట్టల కొనుగోలులో ముస్లింలు
- సంప్రదాయ దుస్తుల వైపు యువత మొగ్గు..
- కుర్తా పైజామాల ప్రత్యేకం..





నవతెలంగాణ-ధూల్‌పేట్

రంజాన్ ఉపవాసాలు చివరి దశకు చేరుకుని పండుగ సమీపించడంతో దుస్తుల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గత 20 రోజులుగా ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్న ముస్లింలు పండుగ దగ్గర పడడంతో ఇక షాపింగ్‌పై దృష్టి పెట్టారు. యువత ఎక్కువగా సంప్రదాయ దుస్తులైన కుర్తా పైజామా, పఠానీలను ఇష్టపడుతున్నారు. గత రెండేళ్లు అంతంత మాత్రంగానే సాగిన వ్యాపారాలు ఈఏడాది ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయనీ వ్యాపారులు పేర్కొంటున్నారు. సాయంత్రం ఇఫ్తార్ విందులు అనంతరం దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి. సాధారణ రోజుల్లో ఎంత మోడ్రన్ డ్రెస్సులు వేసే వారైనా సరే రంజాన్ పండుగ రోజు ఖచ్చితంగా కుర్తా పైజామా ధరించడానికే ఇష్టపడుతుంటారు. అందుకే పండుగ సమీపిస్తుండడంతో ఇప్పుడు సంప్రదాయ దుస్తులను కొనుగోళ్లు ఊపందుకున్నాయి.

విభిన్న రకాలు..

దుస్తుల విషయంలో రొటీన్‌కు భిన్నంగా పండుగల సీజన్‌లో ప్రత్యేక జాగ్రతలు తీసుకుంటున్నారు. ఇందుకు పురుషులూ మినహాయింపు కాదు. రంజాన్ కోసం స్వదేశీ సంప్రదాయ దుస్తులే కాకుండా పాకిస్తానీ, గల్ఫ్ దేశాల సంప్రదాయ డిజైన్లు సైతం మార్కెట్‌లో పోటీ పడుతున్నారు. బీడ్, థ్రెడ్, హ్యాండ్ వర్క్, ఎంబ్రాయిడరీతో ఆకర్షణీయమైన రంగులతో ముస్తాబైన పఠానీ సూట్ల ధగధగలు, హుందా తనాన్నిచ్చే 'సద్'లు యువతను కట్టిపడేసున్నాయి. డార్క్, స్కై, బ్లూ, మదురు ఆకుపచ్చ, ఎరుపు, క్రీమ్, తెలుపు రంగు సిల్క్, కాటన్ దుస్తులతో డిజైన్ చేసిన సంప్రదాయపు దుస్తులు ఆకట్టుకుంటున్నాయి. వాస్‌కోట్లు, బార్డర్లు, గోల్డెన్ థ్రెడ్ వర్క్ యాంటిక్ బీడ్లతో వేసిన సున్నితమైన డిజైన్ల మధ్యలో పొదిగిన కృత్రిమ రత్నాలు, ఎంబ్రాలు డరీ తళుక్కుమనే బూటాలతో యాంటెక్ డిజైన్లను ఆదుకుని యువతరాన్ని కట్టిపడేస్తున్నాయి. చిన్నారుల్ని సైతం ఆకట్టుకునే విభిన్నంగా కొత్త తరహా దుస్తుల్లో ప్రధానంగా పండగ వేళ ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి. మరి కొంత మంది తమకు నచ్చిన డిజైన్లలో దుస్తులు తీసుకొని దర్జీల వద్ద కుట్టించుకుంటున్నారు. ముఖ్యంగా రంజాన్ పర్వదినాలలో చిన్న పెద్దా తేడా లేకుండా అన్ని వయస్సుల వారు తెల్లటి కుర్తా, పైజామాలనే ధరించడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. దీంతో దుకాణాలలో కుర్తా పైజామాల అమ్మకాలు ఎక్కువగా సాగుతుంటాయి. యువత ఆసక్తికి అనుగుణంగా ఇప్పుడు కొత్త కొత్త రకాల రంగుల్లో, ఆధునికత ఉట్టిపడేవిధంగా కుర్తా పైజామాలు అందుబాటులోకి వచ్చాయి.

కుర్తా, పైజామాలపై ఎక్కువ ఆసక్తి..
ఆబిద్ మొహియుద్దీన్.. (మగ్దూమ్ బ్రదర్స్ నిర్వాహకుడు)



రంజాన్ మాసంలో అన్ని వయసుల వారు ఎక్కువగా కుర్తా పైజామాలనే కొనుగోలు చేస్తుంటారని మదీన చౌరస్తాలో గల మగ్దూమ్ బ్రదర్స్ షోరూమ్ యజమాని ఆబిద్ మొహియుద్దీన్ తెలిపారు. సాధారణ రోజుల్లో మోడ్రన్ డ్రెస్సులు వేసేవారు కూడా రంజాన్ మాసంలో ముఖ్యంగా పండుగ రోజు కుర్తా, పైజామాలనే ధరిస్తారు. యువతకు నచ్చే విధంగా ఎన్నో వెరైటీలు దొరుకుతున్నాయి. యువత అభిరుచికి అనుగుణంగా వందలాది వెరైటీలు అందుబాటులో ఉన్నాయి. 20కి పైగా రంగుల్లో 300 రకాల ప్యాటర్న్లలో దుస్తులు లభ్యమవుతున్నాయి. అన్ని వర్గాల వారు వస్తుంటారు.

'అపార్ట్ మెంట్‌లలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు అవగాహన'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

సమాజంలో ఇటీవలి కాలంలో జరుగుతున్న నేరాలను దృష్టిలో పెట్టుకుని నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అపార్ట్‌మెంట్‌లలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు సోమవారం సీఐ యూ.చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అపార్ట్‌మెంట్‌లలోకి తెలియని వ్యక్తులు రావడం, వెళ్లడం వంటి వాటిపై నిఘా ఉంచాలని, అపార్ మెంట్‌లలో జరిగే దొంగతనాలు, వారికి సంబంధించిన డాటా, ఫోన్ నెంబర్లను సంబంధిత సెక్టర్ ఎస్ఐకి షేర్ చేయాలని వారికి సూచించారు. సెక్యూరిటీ డ్యూటీ చేస్తున్నప్పుడు చేయవలసిన, చేయకూడని పనులపై సీఐ చంద్రశేఖర్ వారికి పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ కాళీ మాత దేవాలయం రూపా బిల్డింగ్ ప్రాంతానికి చెందిన సువరంకర్ అమరేశ్వరి అలియాస్ జ్యోతి(48), ముచకుంద్‌లు భార్యభర్తలు వారి మధ్యలో కుటుంబ గొడవ చోటు చేసుకుంది. సోమవారం 1వ తేదీ ఉదయం 11గంటలకు ఇంట్లో నుండి బయటకు ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లింది. స్థానికంగా బంధు మిత్రులతో వాకాబు చేసిన ఫలితం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోదరభావానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులు..



నవతెలంగాణ - ధూల్ పేట్

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక పవిత్ర రంజాన్ నెలలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు హిందూ-ముస్లింల మధ్య సోదరభావానికి, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తాయని జమాఅతె ఇస్లామీహింద్ సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ముబష్షిర్ అన్నారు. లకడీకాపూల్‌లోని హోటల్ అశోకలో ఇంటర్ ఫెయిత్ ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఒకరి మత విశ్వాసాలు, సంప్రదాయాలు తెలుసుకోవడం వల్ల అపోహలు, అపార్థాలు తొలగిపోతాయన్నారు. కులమతాలకతీతంగా అందరూ ఏకమైతై బలమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని పిలుపునిచ్చారు. ముస్లింలు రంజాన్ ఆశయాలకనుగుణంగా పవిత్ర నెలను సద్వినియోగం చేసుకోవాలని ముబష్షిర్ కోరారు. ఉపవాసం కేవలం తిండ తిప్పలు మానుకోవడం మాత్రమే కాదని, మంచిని పెంచడం, చెడును తుంచడం కూడా జరగాలన్నారు. ఇఫ్తార్ ఆతిథ్యాన్నిచ్చిన జమాఅతె ఇస్లామీహింద్ వారిని పలువురు అభినందించారు. ఈ సమావేశంలో కులమతాలకతీతంగా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

చరిత్రను తిరగరాసిన మహానుభావుడు పీవీ



- మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత దివంగత పీవీ తనయుడు ప్రభాకర్ రావు

నవతెలంగాణ-ముషీరాబాద్

మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత పీవీ నరసింహారావు వ్యక్తి కాదు ఒక శక్తి చరిత్రను తిరగరాసిన మహా వ్యక్తి అంటూ ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు అన్నారు. పీవీ నరసింహారావుకి ప్రభుత్వం ప్రకటించిన భారతరత్న అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శనివారం అందుకొని హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా టీ.వై.జే.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ తనుగుల జితేందర్‌రావు ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పీ.వీ నరసింహారావు ఒక ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు సాగుతూ తనకు తాను దిశా నిర్దేశం చేసుకుంటూ ఉన్నత స్థితికి చేరుకొని యావత్ భారతదేశం గర్వించదగ్గ వ్యక్తిగా చరిత్రలో నిలిచారన్నారు. మా తండ్రికి దక్కిన గౌరవ పురస్కారాన్ని తన చేతుల మీదుగా అందుకోవడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. తమ కుటుంబ సభ్యులందరూ ఉన్నత స్థితిలో ఉన్నామంటే తమ బాల్యంలో పీవీ తమకు బోధించిన బోధనలే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమం లో టీ.వై.జె.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు,సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ తనుగుల జితేందర్ రావు గారు పీ.వి ప్రభాకర్ రావు గారి కుమార్తె జర్నలిస్ట్ దివ్య, ఉమ్మడి మెదక్ జిల్లా టీ.వై.జె.ఎఫ్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ నగర్‌లోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్‌లోని పలు బస్తీలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. సోమవారం అరుంధతి నగర్ బస్తీలో పర్యటించిన కార్పొరేటర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తీలో షాబాద్ బండల ఏర్పాటు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న కాలిస్థలంలో నిర్మించిన స్లాబ్‌ను కూల్చి వేసి అదే చోట ప్రజల ఉపయోగానికి షెడ్డు నిర్మించాలన్న బస్తీ వాసుల కోరిక మేరకు త్వరలో షెడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని పెండింగ్‌లో వున్న పైప్ లైన్ పనులు, బండల ఏర్పాటు మొదలైన పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ , ఓ బి సి మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, ఆకుల సురేందర్, ఆనంద్ రావు, ప్రశాంత్, సతీష్ అరుంధతి నగర్ బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ యాదవ్, జి.డి.రాజు,శ్రీనివాస్ గౌడ్, స్థానికులు రాజయ్య,స్వామి గౌడ్, భారతి రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల వేళలు మార్చాలి'

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్టేట్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రెటరీకి వినతి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర వ్యాప్తంగా ఒక పూట బడులు నిర్వహిస్తున్న తరుణంలో సమ్మేటివ్ అసెస్మెంట్ 8,9 తరగతులకు మధ్యాహ్నం కాకుండా ఉదయమే పరీక్షలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ మదన్ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక పూట బడులు నడుస్తున్న తరుణంలో మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఎండ తీవ్రత రోజు రోజుకు పెరిగిపోతుందని, తద్వారా విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఇబ్బందులకు గురవుతారన్నారు. కావున ఇచ్చిన టైం టేబుల్ మార్పు చేసి ఉదయం పూటనే పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓలను విధుల నుంచి తొలగించాలి

- ఏఐడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోద్రమోని భానుప్రసాద్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్న డీఈఓలను తమ విధుల నుంచి వెంటనే తొలగించాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐడీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు బోద్రమోని భానుప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నారాయణగూడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోద్రమోని భానుప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికై డీఈఓలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని, అక్రమ అడ్మిషన్లు వసూలు చేస్తున్న స్కూళ్లు, కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా శాఖ మంత్రిని వెంటనే నియమించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని కోరారు. సొంత భవనాలను ప్రభుత్వం వెంటనే నిర్మించాలని, ప్రభుత్వ కళాశాలలలో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, అలాగే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, విద్యా సంస్థల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రచారాలు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రైవేటు యూనివర్సిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఏఐడీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలు చేపట్టి జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐడీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు రవి, నాయకులు రామ్ చరణ్, రాహుల్, సాయి కిరణ్, జి.అఖిల, జి.కిరణ్, ఆర్.ఝాన్సీ, బోండా రాజు, కమ్మరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయసులోనే ఆటల్లో దూసుకెళ్తున్న సాన్వి లట్టా



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని మ్యాచ్ పాయింట్ బాడ్మింటన్ అకాడమీ చైర్మెన్ ముప్పాల వేణు అన్నారు. తమిళనాడు ఓపెన్ స్టేట్ సబ్ జూనియర్ బాడ్మింటీన్ టోర్నమెంట్ అండర్-9 బాలికల విభాగంలో రాణించిన సాన్వి లట్టాలను సోమవారం ఇండోర్ స్టేడియంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్న వయస్సులో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించడం ఎంతో ఆనందంగా ఉందని రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అండర్-11 విభాగంలో సైతం పోరాడి సెమి ఫైనల్కు చేరుకోవడం అభినందనీయమన్నారు. తమ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

వైస్ ప్రెసిడెంట్‌గా న్యాయవాది కొత్త కాపు ప్రవీణారెడ్డి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎం. ప్రవీణా అలియాస్ కొత్త కాపు ప్రవీణారెడ్డి ఎన్నికైన సందర్భంగా ఆమెను పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. న్యాయవాదుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు. న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయి



నవతెలంగాణ-ధూల్‌పేట్

హైదరాబాద్ పాతబస్తీలో ముస్లిం మహిళలు ఇతర మతాల స్త్రీల కోసం ఏర్పాటు చేసే రంజాన్ ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పెంపొందిస్తున్నాయని జమాఅతె ఇస్లామీహింద్ సీనియర్ మెంబర్ ఆయిషా సుల్తానా అన్నారు. ఆదివారం ఛత్తాబజార్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కులమతాల కతీతంగా అంతా కలిసి ఒకే పంక్తిలో కూర్చుని ఇఫ్తార్ విరమించడం స్నేహపూర్వక వాతావరణానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయన్నారు. హిందూ-ముస్లింల మధ్య బలమైన బంధానికి, గంగా-జమునా తహ్ జీబ్‌కి చక్కని ఉదాహరణగా నిలిచిందన్నారు. ప్రజల మధ్య మత విద్వేషాలను నివారించేందుకు ఇలాంటి సామరస్యపూర్వక కార్యక్రమాలు నగరంలో క్రమం తప్పకుండా నిర్వహించాలని వారు భావిస్తున్నారు. 'నాకు ముస్లింలు, హిందువులు, క్రైస్తవ స్నేహితులున్నారనీ, వారంతా నా శ్రేయోభిలాషులనీ, వారితో సంతోషకరమైన క్షణాన్ని గడపడానికి ఇఫ్తార్ చక్కని వేదిక అని నేను నమ్ముతున్నాను." అని అభిప్రాయపడ్డారు. రంజాన్, ఇఫ్తార్ సందేశాన్ని ఈ సందర్భంగా వివరించారు. జకాత్ ఇస్తే పేదరికం ఉండదన్నారు. విందుకు హాజరైన మహిళలకు హిజాబ్ వస్త్రాలు అందించారు. ఖుర్ఆన్ గ్రంథాన్ని బహుకరించారు. ఇఫ్తార్ ఆతిథ్యాన్ని పాల్గొన్న వారంతా అభినందించారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రేమగా కలిసి మెలిసి జీవిస్తున్నామని, ఏ మతమూ ద్వేషాన్ని బోధించదని ఇఫ్తార్‌లో పాల్గొన్న ప్రముఖ రచయిత్రి అనురాధ చెప్పారు. కొన్ని శక్తులు మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ఈ కాలంలో ఇలాంటి ఇఫ్తార్ సమావేశాలు నిర్వహించి మత సామరస్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని మహిళా నాయకులకు ఉందని నొక్కి చెప్పారు.

మంచి నీటి సమస్యపై టోల్ ఫ్రీ నెంబర్

- జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

జల్ పల్లి మున్సిపల్ పరిధిలో మంచి నీటికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ 7330877393కు ఫోన్ చేయాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణి సోమవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞ చేశారు. వేసవి కాలంలో మంచి నీటి సమస్య ఏర్పడటం జరుగుతుందన్నారు. కావున రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని వార్డుల ప్రజలు వేసవి కాలంలో మంచి నీటి కోసం ఎలాంటి సమస్య ఉన్నా మున్సిపల్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లో మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించటం జరిగిందన్నారు.

ఆస్తి పన్ను వసూలులో మొదటి స్థానంలో 'హయత్ నగర్'

నవతెలంగాణ -ఎల్‌బీనగర్



జీహెచ్ఎంసీలో ఆస్తి పన్ను వసూలులో ఆర్థిక సంవత్సరం 2023 - 2024కి సంబంధించి ఎల్.బి.నగర్ జోన్ లో హయత్ నగర్ సర్కిల్ మొదటి స్థానంలో నిలిచింది. హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య మహా నగరం లో ఇచ్చిన టార్గెట్ కు మించి ఆస్తి పన్ను వసూలు చేశారు. డిప్యూటీ కమిషనర్ యాదయ్య, రెవిన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో ఆస్తి పన్ను వసూలు చేశారు.

హయత్ నగర్ సర్కిల్ : లక్ష్యం : 74.01 కోట్లు, వసూలైంది : 74.46 కోట్లు100.61 శాతం వసూలు

ఆస్తి పన్ను వసూలులో కృషి చేసిన డిప్యూటీ కమిషనర్ . తిప్పర్తి యాదయ్యను, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, వాల్యుయేషన్ ఆఫీసర్లను, ,టాక్స్ ఇన్‌స్పెక్టర్లను, బిల్ కలెక్టర్లను కమిషనర్ రోనాల్డ్ రోస్ అభినందించారు. ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ పి. ముకుంద్ రెడ్డిని ప్రతేకంగా అభినం దించారు. అదే విధంగా ఆస్తి పన్ను దారులు ఆర్థిక సంవత్సరం 2024 - 2025 ఎర్లీ బర్డ్ స్కీం సద్వినియోగం చేసుకొని 5 శాతం రెబేట్ పొందవచ్చును అని డిప్యూటీ కమీషనర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు.



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో నూతనంగా నిర్మించే శ్రీ వెంకటేశ్వర రామాలయ నిర్మాణానికి బుధవారం చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణాన్ని చేపట్టడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, ఆలయ నిర్వాహకులతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ ఛైర్మెన్ చేయూత

నవతెలంగాణ- నాగోల్

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మెన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, ఉప్పల ఫౌండేషన్ ఛైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త సోమవారం మంగళసూత్రం, మెట్టెలు, చీరతో పాటు గాజులను అందించి చేయూతనిచ్చారు. జనగామ జిల్లా రఘునాథపల్లి గ్రామానికి చెందిన ఓ నిరుపేద వధువు మమత వివాహం కోసం వారి కుటుంబ సభ్యులు నాగోల్‌లో గల శ్రీనివాస గుప్త నివాసంలో ఆయనను కలిసి తమ కూతురు వివాహం కోసం సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని కోరారు. దాంతో స్పందించిన ఉప్పల శ్రీనివాసగుప్త వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకుని మమత వివాహం కోసం ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళసూత్రం మెట్టెలు, చీరలతో పాటు గాజులు అందించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయం కోసం ఆశించి తన వద్దకు వచ్చిన వారికి ఎవరికీ లేదనకుండా తోచిన సహాయ సహకారాలు అందించి ఆదుకోవడమే సంతోషకరంగా ఉంటుందన్నారు. తాను సహాయ సహకారాలు కులలకతీతంగా అందించి వారికి చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెండ్లి కూతురు, తండ్రి అయిలయ్య, రఘునాథపల్లి సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు శివ కుమార్, సురేష్ తదితరులు ఉన్నారు.



మల్లాపూర్‌లో ఆలయ పున: నిర్మాణానికి శ్రీకారం

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 14వ డివిజన్ మల్లాపూర్ గ్రామంలో శ్రీ శివసమేత సీతారామాంజనేయ స్వామి దేవాలయ పున: నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా శిథిలావస్థలో ఉన్న దేవాలయ పున: నిర్మాణానికి శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. దాతలు, ప్రజలు దేవాలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు పోరెడ్డి వెంకట్ రెడ్డి,బొర్ర జగన్ రెడ్డి, జెనిగ శ్రీనివాస్ యాదవ్, వరికుప్పల వెంకటేష్,కుంట శ్రీనివాస్ రెడ్డి,మహిపాల్ రెడ్డి, వరికుప్పల యాదయ్య,శ్యామల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కూర్మగూడలో పర్యటించిన మాధవీలత

నవతెలంగాణ-సంతోష్ నగర్

కూర్మగూడ డివిజన్ లో బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవి లత సోమవారం పర్యటించారు. ముఖ్య నాయకులు కార్యకర్తలు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. బీజేపీ ఎస్సీ మోర్చా యాకుత్‌పురా నాయకులు మోహన్ కృష్ణ,రాష్ట్ర బీజేపీ కన్వీనర్ ఇంద్రసేన్ రెడ్డి,బీజేపీ కూర్మగూడ డివిజన్ అధ్యక్షుడు వెంకట్, ధీరజ్ లాల్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డి. ప్రదీప్, యుగేందర్, ప్రేమ్ కుమార్, గౌతం, అజయ్, నాగరాజు,హరీష్, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జహంగీర్ బాబుగౌడ్

నవతెలంగాణ -ఎల్‌బీనగర్



కాంగ్రెస్ నాయకులు మల్ రెడ్డి రాంరెడ్డి నాయకత్వంలో పని చేయడం కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు జహంగీర్ బాబు గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఎల్‌బీనగర్ లో రాం రెడ్డి కాంగ్రెస్ జెండా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వాని ంచారు. వైయస్సార్ అభిమానంతో సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో పనిచేశానని బాబు గౌడ్ గుర్తుచేశారు. గతంలో కొన్ని కారణాల వల్ల పార్టీ మారడం జరిగిందని.. మళ్ళీ సొంత గూటికి తిరిగి రావ డం సంతోషంగా ఉందన్నారు. ఇన్ని రోజుల తనకు సహకరించినందుకు అంద రికీ ధన్యవాదాలు తెలిపారు. తన మీద ఎంతో నమ్మకంతోని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన మల్ రెడ్డి రాంరెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో మరమ్మతు పనుల

తుది అంచనా నివేదిక వారంలోగా ఇవ్వాలి



- క్షేత్రస్థాయిలో వెళ్లి అంచనాల నాణ్యత ప్రతిపాదనలు సమర్పించాలి
- ఏప్రిల్ 4న వర్క్ షాప్ నిర్వహించి కార్యచరణ ప్రణాళిక
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు బాధ్యతాయుతంగా పని చేయాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులకు సంబంధించిన పనుల తుది అంచనా నివేదికలను వారం రోజుల్లోగా ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో టీఎస్ఎంఎస్ఐడీసీ, టీఎస్ఈ డబ్ల్యూఐడీ, టీఎస్ ఈ ఆర్ఐసీ, కంటోన్మెంట్ బోర్డ్ డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్, డీఎల్ఎఫ్, విద్యాశాఖ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టవలసిన పనులపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలోని 562 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, పాఠశాలల్లో మేజర్ మైనర్ మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం పెయింటింగ్, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం,పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మెన్, హెచ్ఎం, ఏఈ /డీఈ లు క్షేత్ర స్థాయి లో పనులను పరిశీలించి ఫైనల్ ఎస్టిమేట్ ను ఇవ్వాలని ఆదేశించారు. ఏప్రిల్ 4న వర్క్ షాప్ నిర్వహించి కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, పి కదిరవన్, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, టీఎస్ ఈడబ్ల్యూఐ డి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీ మియా, టీఎస్ ఎమ్మెస్ ఐడిసి ఈ ఈ చలపతిరావు, టీఎస్ ఈ ఆర్ ఐ సి ఈఈ విభూ కుమార్, కంటోన్మెంట్ బోర్డ్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఫణి కుమార్, టీఎల్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

'వడదెబ్బ నుండి రక్షించుకుందాం' పోస్టర్ ఆవిష్కరణ

పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగినందున వడదెబ్బ తగలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన వీడియో సమావేశంలో 'వడదెబ్బ నుండి రక్షించుకుందాం' పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగినందున ప్రజలకు ముఖ్యంగా చిన్నపిల్లలకు, వృద్ధులు అవసరమైన జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి చేయవలసినవి, చేయకూడనివి, వడదెబ్బకు గురైన వారికి చికిత్స విధానం, చికిత్స, వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఆశ బస్తీ దవాఖాన, పట్టణ ఆరోగ్య కేంద్రంలో సరిపోయే విధంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాలని ఆదేశించారు. బస్తీ దవాఖాన, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్, ఐవి ఫ్లూయిడ్స్, ఇతర మందుల వివరాలను ప్రతిరోజు ఉదయం 9 గంటల వరకు పంపించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఆదేశించారు. వడదెబ్బ నివారించడానికి ఒక ఓరియంటేషన్ ట్రైనింగ్ సిబ్బందికి ఇప్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, కదిరవన్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీకళ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హర్ష, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ జె.రాములు తదితరులు పాల్గొన్నారు.



అబ్బాయిల్లోనే ఆటిజం ఎక్కువ

- డాక్టర్ చరణ్ తేజ కోగంటి, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, కిమ్స్ హాస్పిటల్స్, కొండాపూర్
- నేడు అంతర్జాతీయ ఆటిజం అవగాహనా దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

"ఆటిజం అనేది న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్, ఇది మెదడులోని కొన్ని భాగాల్లో ఇన్‌పుట్, ప్రాసెస్ లాంగ్వేజ్‌ని అర్థం చేసుకునే సమస్యల నుంచి ఉత్పన్నమవుతుంది. ఆడపిల్లల కంటే అబ్బాయిల్లో ఆటిజం నాలుగు రెట్లు ఎక్కువ" అని కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్స్ డాక్టర్, కన్సల్టెంట్, సైకియాట్రిస్ట్ చరణ్ తేజ కోగంటి తెలిపారు. నేడు అంతర్జాతీయ ఆటిజం అవగాహనా దినోత్సవం సందర్భంగా పలు విషయాలను వెల్లడించారు. ఆటిజం కమ్యూనికేషన్, సోషల్ ఇంటరాక్షన్, పరిమితం చేయబడిన, పునరావృతమయ్యే ప్రవర్తనా విధానాలతో సమస్యల ద్వారా వర్గీకరించారు. ఈ పిల్లలు ఇతర వ్యక్తులు ఏమనుకుంటున్నారో అర్థం చేసుకోవడంలో సమస్య ఉంది. ఇది పదాలతో లేదా సంజ్ఞలు, ముఖ కవళికలు, స్పర్శ ద్వారా తమను తాము వ్యక్తీకరించడం కష్టతరం చేస్తుంది. వారు నేర్చుకోవడంలో కూడా సమస్యలు ఉండవచ్చు. వారి నైపుణ్యాలు అసమానంగా అభివద్ధి చెందుతాయి. ఉదాహరణకు, వారు కమ్యూనికేట్ చేయడంలో ఇబ్బంది పడవచ్చు కానీ కళ, సంగీతం, గణితం లేదా జ్ఞాపకశక్తిలో అసాధారణంగా నైపుణ్యం కలిగి ఉంటారు.

ఆటిజం సాధారణ లక్షణాలు

1.కంటి చూపు లేకపోవడం
2.కొన్ని విషయాలపై తెలియజేయలేకపోవడం
3.చెప్పిన పదాలనే పదే పదే చెప్పడం. ముందుకు వెనుకకు ఊపడం లేదా తల తిప్పడం వంటి ఏదైనా పదే పదే చేయడం
4.ఇతర వ్యక్తులకు సాధారణంగా కనిపించే శబ్దాలు, స్పర్శలు, వాసనలు లేదా దశ్యాలను పసిగట్టలేకపోవడం
5.ఇతర వ్యక్తులను పదే పదే చూడటం
6.వేరొక వ్యక్తి ఏదైనా వస్తువులను చూపించినప్పుడు వాటిని చూడకపోవడం
7.పట్టుకోవడం లేదా కౌగిలించుకోవడం ఇష్టం పడకపోవడం
8.ప్రసంగం, సంజ్ఞలు, ముఖ కవళికలు లేదా స్వర స్వరాన్ని అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడటం
9.పాటలు పాడటం లేదా రోబోటిక్ వాయిస్‌లో మాట్లాడటం
10.రొటీన్‌లో మార్పులను స్వీకరించడంలో ఇబ్బంది

9 నెలలు, 18 నెలలు, ముఖ్యంగా 24 లేదా 30 నెలల వయస్సులో వారి రెగ్యులర్ చెక్-అప్‌ల సమయంలో నేర్చుకోవడం, మాట్లాడటం, ప్రవర్తన, కదిలే వంటి ప్రాథమిక నైపుణ్యాలతో మీ పిల్లలు ట్రాక్‌లో ఉన్నారో లేదో డెవలప్‌మెంటల్ స్క్రీనింగ్ తెలియజేస్తుంది. ప్రారంభ చికిత్స ఆటిజంతో పిల్లల అభివృద్ధిలో పెద్ద మార్పును కలిగిస్తుంది. బిహేవియరల్ థెరపీ, ఇంద్రియ ఏకీకరణ. థెరపీ, కమ్యూనికేషన్ థెరపీ మొదలైనవి సహాయం చేస్తాయి.

ప్రతీ సంవత్సరం, ఏప్రిల్ 2 న ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్స్‌గురించి అవగాహన పెంచడానికి ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం నిర్వహిస్తారు. ఈ ప్రత్యేక రోజు ఆటిజం పై అవగాహన కల్పించడం, దానితో బాధపడుతున్న వారికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది గ్లోబల్ హెల్త్‌కేర్ ఈవెంట్.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఇఫ్తార్ విందును మత సామరస్యానికి ప్రతీక అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 4వ డివిజన్, అల్మాస్ గూడ పరిధిలోని సౌభాగ్య కాలనీ కమ్యూనిటీ హాల్‌లో స్థానిక కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ పార్టీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు కుల మతాలకతీతంగా కలసి మెలసి జీవించాలని కోరారు. పవిత్ర రంజాన్ పండుగలో ముస్లిం సోదరులు రోజాను జరుపుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, వెంకటరెడ్డి, మహేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- శిక్షణకు హాజరుకాని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయండి
- హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో/మలక్‌పేట్

పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ సమిష్టిగా పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పీవో, ఏపీవోలకు ఇబ్రహీం బాగ్ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో, మలక్‌పేట, ఉస్మానియా వర్సిటీ కోఠిలో ఏర్పాటుచేసిన శిక్షణా కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. శిక్షణకు ఎంతమంది హాజరు, గైర్హజరైనారని శాఖల వారీగా గుర్తించి రానికివారికి షోకాజ్ నోటీసులు జారీ చేయవల్సింగా ఏఆర్వో జ్యోతిని ఆదేశించారు. అనంతరం శిక్షణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన తప్పిదాలు మళ్లీ జరగకుండా శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల కోసం ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 3 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫారం-12 నింపి సంతకం చేసి ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది సమర్పించిన ఆప్షన్ ప్రకారం ఏ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి అనే అంశం ఎస్ఎంఎస్ ద్వారా పంపడం జరుగుతుందన్నారు. సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్, తాగునీరు, కరెంటు, సౌకర్యాలు బాగుండేలా చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు, పీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ లో రూ. 3 లక్షలు స్వాధీనం

నవతెలంగాణ-హాయత్ నగర్

ఎల్‌బీ నగర్ పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం చింతల కుంట చెక్ పోస్ట్ వద్ద మల్లారెడ్డి అనే వ్యక్తి ద్వీ చక్ర వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఈ మేరకు రూ. 3లక్షల నగదు దొరికింది. అందుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ -ఎల్‌బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరుతున్న నాయకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు నిరాశకు లోనయ్యారు. తమ రాజకీయ భవిష్యత్తు అవసరాల కోసం అధికార పార్టీలో చేరిక తప్పడం లేదని గుర్తించిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. దాంతో పార్లమెంట్ ఎన్నికల ముందు ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు పుంజుకుంటోంది. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో మూడవ స్థానంతో సరిపెట్టుకున్నది. బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. అయితే బీజేపీ ఎల్బీనగర్ లో ఓటమిని చవిచూసిన తర్వాత అపార్టీ పెద్దగా కార్యక్రమాలు చేపట్టలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎల్బీనగర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఇటీవల కర్మాన్‌ఘాట్‌లో కొత్త కాపు యాదవ రెడ్డి గార్డెన్ లో కాంగ్రెస్ వందరోజుల ప్రజా పాలన పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించాలని బూతు స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని అన్ని డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. వంద రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తూ ప్రజల ఆదరభిమానాలను సంపాదించిందని తెలిపారు.

కాంగ్రెస్ లో చేరుతున్న నాయకులు

కర్మన్ ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయం ఛైర్మెన్ నల్ల రఘుమారెడ్డిబీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా ఎల్బీనగర్ టీడీపీ అధ్యక్షులు ఎస్వీ కృష్ణ ప్రసాద్ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో సన్నిహితం ఉన్న ఎస్‌వీ కృష్ణ ప్రసాద్ కాంగ్రెస్‌లో చేరి ముఖ్య మంత్రిని కలిశారు. ఎల్బీనగర్ మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మెన్, బీఆర్ఎస్ నాయకులు లింగాల నాగేశ్వరరావు కాంగ్రెస్ లో చేరారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి నష్టం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. రాబోయే రోజులలో ఎంతమంది కాంగ్రెస్ పార్టీలో చేరుతారో వేచి చూడవలసిందే. గతంలో మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి టీడీపీలో పనిచేశారు. అదేవిధంగా టిఆర్ఎస్ లో కూడా పనిచేశారు. దాంతో ఆయనతో సన్నిహితంగా ఉన్న నాయకులు అంతా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరుతున్నారు. చంపా పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. గతంతో పోల్చుకుంటే అన్ని డివిజన్‌లలో కాంగ్రెస్ బూత్ స్థాయిలో కొంతమేరకు పట్టు సాధించినట్టు కనిపిస్తున్నది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు ఏ విధంగా ఉంటాయో వేచి చూడాలి మరి.



ఆందోళన వద్దు... కుటుంబసభ్యులతో ఆనందంగా జీవించాలి

- జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీవితంలో పదవీ విరమణ అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. జలమండలి పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు జనరల్ మేనేజర్లుతోపాటు మరో 16 మంది ఉద్యోగులకు పదవీ విరమణ పొందారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ మాట్లాడుతూ ఉద్యోగ సమయంలో అందులోనూ జలమండలి లాంటి అత్యవసర సేవల విభాగంలో పనిచేసిన వారికి సొంత వారితో సమయం గడిచే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. రిటైర్మెంట్ తర్వాత ఆ లోటును పూడ్చుకోవచ్చున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో మరింత సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన వారిని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఆపరేషన్స్ డైరెక్టర్స్ స్వామి, విజయరావు, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ విజయం ఇతరులకు ఆదర్శం కావాలి

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మెన్,ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ- నాగోల్

క్రీడాకారులుగా మీరు సాధించిన ప్రతీ విజయం ఇతరులకు ఆదర్శం కావాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మెన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా క్రీడాకారులకు సూచించారు. సోమవారం నాగోల్, బండ్లగూడ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ఆవరణలో రెండు రోజులపాటు జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ లో (సౌత్ జోన్ హైదరాబాద్) విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు మార్చి 30, మార్చి 31న నిర్వహించారు. ఐదు సౌత్ స్టేట్స్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ కర్నాటక, కేరళ తమిళనాడు నుంచి 75 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-16, అండర్-18, అండర్-18 ప్లస్, జూనియర్స్ అండ్ సీనియర్స్ ఉమెన్స్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ శారీరక శ్రమతో కూడిన క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ క్రీడలతో క్రీడాకారులకు ఆనందం, ఆరోగ్యంతో పాటు అందరికి స్ఫూర్తి దాయకంగా ఉంటుందన్నారు. ఇలాంటి ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా..ఉన్నత ఆశయంతో అంకితభావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని, క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. తీర్చిదిద్దాల్సిన భాధ్యతలు ప్రతి ఒక్కరూ తీసుకొవాలని సూచించారు. ఆరోగ్యవంతంగా జీవించాలంటే అనవసరమైన విషయాలు వదిలేసి మంచి అలవాట్లు, సమయపాలన తీసుకునే ఆహారంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆటల పోటీలు క్రీడాస్ఫూర్తిని పెంచుతాయని,గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ప్రతి ఆటను స్పోర్టివ్ గా తీసుకోవాలని ప్రతి ఒక్కరూ కొంత సమయం ఆటల కోసం కేటాయిస్తే ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారని చెప్పారు. క్రీడాకారులు రాణించి రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో విజయం సాధించి, దేశానికి , మన తెలంగాణ రాష్ట్రానికి, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తేవాలని కోరారు. తనకు క్రీడలు అంటే ఇష్టమని , క్రీడలకు, క్రీడాకారులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డా. మాక్స్వెల్ ట్రావెర్, జి.కష్ణమూర్తి రీజనల్ డైరెక్టర్, ఆర్.జయకుమార్ కమిషనర్ ,ఓబులేష్,నార్మన్ ఇస్సాకు, అలొసిఎస్, నితీష్,అనిల్, గౌతమ్, బీ ఆర్ రెడ్డి, సుశీల్ రావు ఎస్.కె పాష, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: సబ్ జూనియర్స్ గర్ల్స్15 కి.మి : ప్రియమణి కేఆర్ కేరళ గోల్డ్, శివ బిండియ తెలంగాణ సిల్వర్, ఎస్ వైష్ణవి తెలంగాణ బ్రోన్జ్, **ఉమెన్ జూనియర్స్ 30 కి.మి.** అనుపమ కర్ణాటక గోల్డ్ ,పూజ కర్ణాటక సిల్వర్, డివినా జాయ్ తెలంగాణ బ్రోన్జ్, **ఉమెన్ ఎలైట్ 30 కి.మి.** సబ్ జూనియర్స్ గర్ల్స్ ,ఉమెన్ జూనియర్స్ విజేతలు బీలి సౌమ్య ,ధనమ్మ సావిత్రి, సేతులక్ష్మి ప్రియమణికేఆర్, వైష్ణవి,అనుపమ, పూజ, డివినా జాయ్,



సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్థానిక కార్పొరేటర్ ఎమ్మెల్యే అభ్యర్థి పి విజయరెడ్డి సోమవారం ఆమె కార్యాలయంలో ఖైరతాబాద్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన కరాటే రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ, మోహన్ యాదవ్, ధనరాజు రాథోడ్, విజయ్, భీమ్రావు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా వైస్ ప్రెసిడెంట్‌గా చీర సత్యనారాయణ (శ్రీకాంత్) నియమించినందుకు తెలంగాణ రథసారథి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి, ఆల్ ఇండియా ఓబీసీ మోర్చా ప్రెసిడెంట్ డాక్టర్ లక్ష్మణ, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రెసిడెంట్ ఆనంద్‌గౌడ్‌లు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



నవతెలంగాణ-బేగంపేట

అభ్యర్థులను ప్రకటించినా.. కనిపించని జోరు..!

- ప్రచారానికి దూరంగా అధికార కాంగ్రెస్ అభ్యర్థి
- బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారంపై ఆ పార్టీ పరిణామాల ఎఫెక్ట్
- బీజేపీ అభ్యర్థి ప్రచారంలో ముందున్నా.. ఆదరణ అంతంతే!
- అయోమయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన పార్టీల అభ్యర్థులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇప్పటికే తమ పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటించాయి. అందులో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్‌కు కూడా మూడు పార్టీలు తమ అభ్యర్థులను డిక్లేర్ చేశాయి. కానీ రోజులు గడుస్తున్నా.. ఆయా పార్టీల అభ్యర్థులు అనుకున్న స్థాయిలో ప్రచార జోరు ప్రదర్శించడం లేదు. ఒకవైపు బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ప్రచారంలో ముందున్నా.. ఆయనకు ఆశించిన స్థాయిలో జనం నుంచి స్పందన లభించకపోగా.. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఇంకా ప్రచార కార్యక్రమాలు కూడా ప్రారంభించలేదు. ఇంకోవైపు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ కొంతమేర జోరు ప్రదర్శిస్తున్నా.. ఆ పార్టీలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు కాస్త ఆయన్ను ఆందోళనకు గురిచేస్తున్నాయని సమాచారం.

సైలెన్స్ మోడ్‌లో దానం..!

సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్‌ను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. అభ్యర్థిగా దానం పేరు ఖరారు కావడంతో ఇవ్వాలో.. రేపో ఆయన ప్రచారంలోకి వస్తారని అంతా భావించారు. కానీ గత కొన్నిరోజులుగా నగర రాజకీయాలు దానం చుట్టే నడుస్తున్నాయి. ఒకవైపు నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్‌పై గెలిచిన దానం నాగేందర్‌ను ఆ పదవికి రాజీనామా చేసి.. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలువాలని డిమాండ్ చేస్తుండగా.. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా రాజీనామా చేసిన తర్వాతే.. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి బరిలోకి దిగాలని ఖరాఖండీగా చెప్పడంతో దానంకు ఏం చేయాలో అర్థం కావడం లేదని తెలుస్తోంది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీకి పోటీ చేసేదానిపై ఆయన అంతగా ఆసక్తి కనబర్చడం లేదని.. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగానే సికింద్రాబాద్ ఎంపీ స్థానానికి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆయన సన్నిహితులు, కీలక నేతలు, ముఖ్య కార్యకర్తలు సైతం ఇదే చెబుతున్నారు. కానీ ఏఐసీసీ నిర్ణయం కాస్త ఆయనను సంక్లిష్టంలో పడేసింది. మొత్తంగా దానం అటు ఎమ్మెల్యేకు రాజీనామా చేయకుండా.. ఇటు జనంలోకి వెళ్లకపోవడంతో పార్టీ కార్యకర్తల్లో ఆందోళన కనిపిస్తోంది. అసలు ఆయనకు ఎంపీగా పోటీచేసే ఆసక్తి ఉందా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ ప్రచారాన్ని ముమ్మరం చేసే పనిలో పడ్డాయి. అధికార పార్టీ అభ్యర్థిగా బరిలో ఉండి.. జనంలోకి వెళ్లకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని ప్రచారం జరుగుతున్నా.. దానం మాత్రం ప్రచారంపై దృష్టి పెట్టకుండా సైలెన్స్‌గానే ఉంటున్నారు. ఈ అంశాలన్నీ అధికార కాంగ్రెస్‌కు లష్కర్‌లో భారీ డ్యామేజ్ చేయనున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇలా ఉండగానే కాంగ్రెస్ అధిష్టానం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అభ్యర్థిత్వాన్ని సైతం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

డైలామాలో పద్మారావు గౌడ్..!

సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎవరిని నిలుపాలనే దానిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంతో కసరత్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ధీటైన అభ్యర్థిని బరిలో ఉంచాలని కేసీఆర్ సికింద్రాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. పద్మారావు కూడా కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ పోటీలో ఉండేందుకు ఆసక్తి చూపించారు. ముఖ్య నేతలతో సమావేశమవుతూ వస్తున్నారు. తాజాగా అంబర్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో కేటీఆర్‌తో కలిసి ప్రచారం సైతం నిర్వహించారు. అయితే పద్మారావు గౌడ్ కుమారులు మాత్రం అధికార కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం. ఆ పార్టీలో చేరికపై ఇప్పటికే తమ సన్నిహితులు, దగ్గరివాళ్లతో చర్చలు జరిపారని తెలిసింది. సీఎం రేవంత్ రెడ్డికి పద్మారావుపై మంచి అభిప్రాయం కలిగి ఉండడం, అధికార పార్టీలో ఉంటే పదవులు, కావాల్సిన పనులు జరుగుతాయి... ఎలాంటి ఇబ్బందులు ఉండవనే ఆలోచనలో వారుండగా.. పద్మారావు మాత్రం బీఆర్ఎస్, కేసీఆర్‌తోనే ఉండాలని భావిస్తున్నారు. కానీ రోజురోజుకీ బీఆర్ఎస్ బలహీనపడుతుండడంతో ఇప్పుడు ఆయన కూడా డైలామాలో పడినట్టు సమాచారం. ఇప్పుడున్న పరిస్థితుల్లో అధికార కాంగ్రెస్, బీజేపీలను అంత ఈజీగా ఎదుర్కోవడం సాధ్యం కాదనే అంచనాకు వచ్చారని తెలిసింది. దానికితోడు పదేండ్లుగా కేసీఆర్ వెన్నంటి నడిచిన కేకే, ఆయన కూతురు నగర మేయర్ విజయలక్ష్మి హస్తం గూటికి చేరి అందరిని షాక్‌కు గురిచేయగా.. మిగతావారు కూడా కాంగ్రెస్ గూటికి చేరితే తన పరిస్థితి ఏంటనే అయోమయంలో ఉన్నారని తెలిసింది. దీంతో ఆయన కూడా కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య దారిలోనే వెళ్లొచ్చనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

అవతలి పార్టీలోని పరిణామాలపై నజర్

సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి మరోసారి బరిలో నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన.. రోజుకో అసెంబ్లీ సెగ్మెంట్‌లో ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఆయనకు జనం నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణ లభించడం లేదని.. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో జరుగుతున్న పరిణామాలపై దృష్టిసారించారని తెలిసింది. ఆ రెండు పార్టీల మధ్య జరిగే పరిణామాలను తమకు అనుకూలంగా మల్చుకునే పనిలో నిమగ్నమయ్యారని సమాచారం. దానం రాజీనామా వ్యవహారం, గ్రేటర్‌లో బీఆర్ఎస్ పార్టీ బలహీనం వంటి అంశాలు తనకు ఏ విధంగా లాభం చేస్తాయని, వాటిని తమ గెలుపునకు ఎలా మల్చుకోవాలని, దీనిపై ముఖ్యనేతలతో చర్చిస్తున్నారని తెలుస్తోంది. మొత్తానికి బీజేపీ తన మైండ్ గేమ్‌తో ఎన్నికల ప్రచారంలో ముందుకు వెళ్తుండగా.. అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మాత్రం ఈ విషయంపై సీరియస్‌గా దృష్టిపెట్టకపోవడం అందరిని విస్మయానికి గురిచేస్తోంది.

రూ.37.50 లక్షల నగదు సీజ్

నవతెలంగాణ-బేగంపేట



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా తనిఖీల్లో భాగంగా సోమవారం రూ.37.50లక్షల నగదును పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడుకు చెందిన లక్ష్మణ్ రామ్ బ్యాగును తనిఖీ చేయగా సరైన పత్రాలు లేని నగదు ఉన్నట్లు గుర్తించి పోలీసులు ఆ నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆదాయ శాఖాధికారులకు నగదు అప్పజెప్పినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న నివేదిత

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ నియోజకవర్గం నాలుగోవార్డు గాంధీనగర్‌లో ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారితో పాటు కంటోన్మెంట్ బోర్డ్ మాజీ సభ్యురాలు నళిని కిరణ్ హాజరయ్యారు. కార్యక్రమంలో నూర్, సంతోష్ రామ్మోహన్, ఆనంద్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నివేదిత



నవతెలంగాణ-కంటోన్మెంట్

అనారోగ్యంతో బీఆర్ఎస్ కార్యకర్త మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఐ సీనియర్ నాయకురాలు నివేదిత మృతిని సోదరున్ని సోమవారం పరామర్శించారు. గాంధీనగర్ మడ్‌ఫోర్ట్‌లో సోదరుడు సురేశ్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. నివేదితతో పాటు, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్.. సురేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. సురేష్, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ఇబ్బందులు లేకుండా వ్యాపారాలను నిర్వహించుకోవాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఫుట్ పాత్ వ్యాపారుల సమస్యలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం మోండా మార్కెట్ డివిజన్ లోని పాలికా బజార్‌లో ఆయన సోమవారం ట్రాఫిక్, లాఅండ్ ఆర్డర్ పోలీసు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక చిరువ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన స్థలంలో మాత్రమే తమ వ్యాపారాలు జరుపుకోవాలని, రోడ్లపైకి వచ్చి పాదచారులు, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఫుట్‌పాత్ వ్యాపారులపైనే ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, పాలికాబజార్, బండిమెట్, మోండామార్కెట్, ఓల్డ్‌జైల్‌ఖానా తదితర ప్రాంతాల్లో గత 40, 50 సంవత్సరాల నుండి అనేక మంది పేదలు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారిపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ట్రాఫిక్, పోలీసు శాఖల అధికారులకు ఆయన సూచించారు. తోపుడుబండ్ల వ్యాపారులు కూడా ఇష్టానుసారంగా రోడ్లపై నిలిపి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కల్పించవద్దన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఐ శంకర్, మోండా మార్కెట్ సీఐ రాఘవేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆకుల హరికృష్ణ, నాగులు, రాములు, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, మహేష్ యాదవ్, వ్యాపారుల అసోసియేషన్ సభ్యులు అశోక్, బబ్లూ, అల్తాఫ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రకటన విడుదల చేయాలి

- డాక్టర్ కట్ట శేఖర్



నవతెలంగాణ-ఓయూ

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేయాలని తెలంగాణ డిగ్రీ ప్రయివేట్ లెక్చరర్స్ సమితి రాష్ట్ర అధ్యక్షులు కట్టా శేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓయూ తో పాటు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకామ్ ,ఎంఎస్సీ ఇతర పీజీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ 2024(సిపిజిఈటి)నోటిఫికేషన్ విడుదల ప్రతిఏటా జాప్యంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. లాసెట్, ఐసెట్, ఇంజనీరింగ్ పీజీ సెట్, హెడ్ సెట్ తదితర సేట్ల నోటిఫికేషన్లు విడుదలైన పీజీ కోర్సుల ప్రకటనపై నిర్లక్ష్యం చేస్తున్నారని పీజీ ప్రవేశాల ప్రకటన జాప్యంతో ఓయూతో పాటు జేఎన్టీయూ, కాకతీయ, శాతవాహన, తెలంగాణ మహాత్మాగాంధీ పాలమూరు తెలంగాణ ప్రభుత్వ మహిళా యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ మొదలుకొని ప్రవేశాల ప్రక్రియ, తరగతులు, సెమిస్టర్ పరీక్షలు ఫలితాల విడుదలలో ఆలస్యం అవుతుందన్నారు. సకాలంలో పీజీ కోర్సులు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

జూబ్లీహిల్స్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్‌నగర్ బిలాల్ మస్జిద్‌లో సోమవారం సయ్యద్ అజీజ్, మహమ్మద్ మోసిన్ ఆధ్వర్యంలో ఇఫ్తారు విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మహమ్మద్ అజారుద్దీన్, నవీన్ యాదవ్‌లు విందులో పాల్గొన్నారు. వారితో పాటు రహమత్‌నగర్ కార్పొరేటర్ సిఎంఎ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్క ముస్లిం కుటుంబంలో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలన్నారు.

బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటిన రమేష్ స్వప్నిల్

- సత్కరించిన ఓయూ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

మార్చి 18 నుండి 25 వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో నోయిడాలో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో జరిగిన 3వ, సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో తార్నాక డివిజన్ విజయపురి కాలనీకి చెందిన కుమ్మరి రమేష్ స్వప్నిల్ సబ్ జూనియర్ అండర్ 14 సం, రాల, 40 - 43 కెజిల బాలుర విభాగంలో స్విల్వర్ మెడల్ సాధించారు. ఈ విభాగంలో తెలంగాణ రాష్ట్రంలో స్విలర్ మెడల్ సాధించిన మెదటి వ్యక్తి స్వప్నిల్ మెదటి వ్యక్తి కావడం విశేషం. స్వప్నిల్ నాచారం లోని సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్‌లో ప్రస్తుతం 8వ,తరగతి అభ్యశిస్తున్నారు. తన తల్లిదండ్రులకు మరియు ఐవిఆర్ బాక్సింగ్ అకాడమీ వారి సహకారంతోనే ఈ మెడల్ సాధించినట్లు అయిన తెలిపారు. సోమవారం సాయంత్రం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఐక్య విద్యార్థి సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో రమేష్ స్వప్నిల్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది డా. సౌడ నవీన్, సునీల్ శెట్టి, నిరాడి సునీల్, డా.సుదర్శన్, క్రాంతి, విజయ్ ,జంగయ్య మిథున్, కుమ్మరి వెంకట్, సైదులు పాల్గొన్నారు.

జీవితాలను ఆగం చేస్తున్న ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు

- బెట్టింగ్ నిర్వహకులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- జాజుల లింగంగౌడ్



నవతెలంగాణ-ఓయూ

ఐపీఎల్ క్రికెట్ నిర్వహణ సందర్భంగా బెట్టింగ్ నిర్వహకులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని కోరారు. బెట్టింగ్ అనేది ఒక విష సంస్కృతి అని దీనివల్ల అనేక జీవితాలు ఆర్థికంగా నష్టపోయి, అనేక కుటుంబాలు రోడ్డున పడి నాశనం అవుతున్నాయన్నారు. ఈ బెట్టింగ్ విష సంస్కృతి పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశతో భార్యల మీద బంగారం తాకట్టు పెట్టి మరి బెట్టింగ్‌లు పెడుతు న్నారన్నారు. చివరకు చాలామంది ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. ఎంతమంది జీవితాలను ఆగం చేస్తున్న ఈ బెట్టింగ్ వ్యసనానికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని లింగంగౌడ్ పేర్కొన్నారు.

ఆర్థిక ప్రయోజనాల కోసమే వ్యాక్సిన్ దోసులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

యూనివర్సల్ హెల్త్ ఆర్గనైజేషన్, అవేకన్ ఇండియా మూవ్ మెంట్ వ్యాక్సిన్ల విషయంలో శాస్త్రీయత లోపించి ఆర్థిక ప్రయోజనాలు ముఖ్యంగా మారాయనీ, గతంలో ప్రపంచంలో జరిగిన మహ్మారి కోవిడ్ 19 విషయంలో ఇదే జరిగిందనీ యూనివర్సల్ హెల్త్ ఆర్గనైజేషన్, అవేకన్ ఇండియా మూవ్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, ప్రొఫెసర్ భాస్కర్ రామన్, డాక్టర్ ప్రవీణ్ సక్సేన్, డాక్టర్ సుధా చెప్యాల, సరస్వతి కవులలు పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా భారతదేశంలో పది సంవత్సరాలు టీకాపై పరిశోధన జరగాల్సిన ఆవశ్యకత ఉన్న ఐసిఎంఆర్, ఈ విషయాన్ని వెల్లడించిన సంగతి తెలిసిందే,. కానీ కేంద్ర ప్రభుత్వం వీటన్నింటినీ పక్కనపెట్టి ప్రజా ఆరోగ్యాన్ని సైతం నిర్లక్ష్యం చేసి వ్యాక్సిన్ల ఆవశ్యకత తప్పనిసరి అని ప్రజా స్వేచ్ఛ పౌరుల హక్కులకు అంగం వాటిల్లే విధంగా ప్రతి ఒక్కరు టీకా వేసుకోవాల్సిందే అని నిబంధన పెట్టి ప్రజల ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. నీటి వలన మహిళలకు గర్భధారణకు సంబంధించిన వ్యాధులు శరీరంలో రక్తం గడ్డకట్టి ఇతర వ్యాధులు గుండె సంబంధిత వ్యాధులు అత్యధికం కావడంతోపాటు ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ప్రజా ఆరోగ్యానికి మరింత ముప్పు వాటిలో అవశ్యకత ఉందని తెలిపారు. ప్రజలందరూ సాధారణ న్యాచురల్‌గా శాస్త్రీయబద్ధంగా లభించే మందులను వాడి వారి రోగ నిరోధక శక్తిని పెంచుకొని ఈ వ్యాక్సిన్ తీసుకున్న వారందరూ ఇకనైనా వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

ఓయూలో ధర్మపురి ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో ప్రభుత్వవిప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ కొలపురి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా, అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం ఆలోచించే ప్రజల మనిషి అని నియోజకవర్గ ప్రజలు అందరు హక్కుగా భావించే ప్రజా నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ బీఎస్ఎఫ్ అధ్యక్షులు అంబేద్కర్, ఇందిరా గాంధీ నేషనల్ అవార్డు గ్రహీత హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ యువ నాయకులు తగరపు నవీన్, టీఎస్‌యూ నేత ప్రవీణ్, టీఎస్పీ నేత, ప్రవీణ్, పెగడపల్లి మండల్ యువ నాయకుడు ఉదయ్ కుంటలా, వివిధ విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమె పేరు పూనమ్ సింగ్. ఢిల్లీ వాసి. తను కలలుగన్న ప్రపంచం వేరు. డాక్టర్ చదవాలనుకుంది. సమాజానికి తనకు చేతనైన సాయం చేయాలనుకుంది. తనేమిటో నిరూపించుకోవాలనుకుంది. కానీ తను అనుకున్నదేదీ జరగలేదు. చదువు పూర్తి కాకముందే 19 ఏండ్లకే వివాహం చేశారు పెద్దలు. చిన్న వయసులోనే పెండ్లి కావటం.. ఆ తర్వాత పిల్లలు సంసారం.. రోజువారీ జీవితం ఇంటి చుట్టూ ముడిపడి పోవటంతో ఆమె కలలు నెరవేరలేదు. ఏదో నిరాశ ఆమెను వెంటాడేది. అలాంటి ఆమె వ్యాపార విజయ గాథ ఇప్పుడు మీ కోసం...



అడుగేయటం మొదలెడితే...

పూనమ్‌కు ఇద్దరు పిల్లలు. వారి చుట్టే జీవితం. పిల్లలు స్కూలుకు వెళ్లటం ప్రారంభించాక.. కొంత సమయం దొరికింది. అంతే తనూ విద్యాభ్యాసం ప్రారంభించింది. ప్రయివేటుగా డిగ్రీ పూర్తిచేసింది. ఉపాధ్యాయ వృత్తిలో శిక్షణ కూడా పొందింది. అయితే, ఆమె ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించలేకపోయింది. ఇంటి పనులు, తన కుటుంబాన్ని చూసుకోవడంలో బిజీ అయిపోయింది. పూనమ్ సింగ్‌కు స్నేహితులు కూడా పెద్దగా లేరు. 2018లో పిల్లలిద్దరూ హాస్టల్‌కు వెళ్లారు. ఇక ఖాళీ సమయం దొరకటంతో తనదంటూ ఓ ప్రపంచాన్ని నిర్మించాలని నిర్ణయించుకుంది. 'ఏం చేయాలో నాకు అర్థం కాలేదు. నా జీవిత ఉద్దేశ్యం ఏమిటో బోధపడలేదు. చాలా నిరుత్సాహానికి గురయ్యాను. స్పష్టమైన జీవిత లక్ష్యమేదీ లేదు.. ఓ సమయంలో డిప్రెషన్‌లోకి కూడా వెళ్లాను... ఓ చిన్న ఆలోచన నా జీవితాన్ని మార్చింది' అంటుంది పూనమ్.

షాక్‌కు గురిచేసిన ఘటన

ఒంటరిగా, మానసికంగా కుంగిపోతున్న పూనమ్‌కు ఆమె తల్లి మానసిక ప్రశాంతత కోసం ఆలయానికి వెళ్లమని చెప్పింది. సమీపంలోని ఆలయానికి కొన్ని పూలను తీసుకొని వెళ్లింది పూనమ్. దేవతకు సమర్పించేందుకు ఆ పూలను పూజారికి ఇచ్చింది. ఆ తర్వాత జరిగిన సంఘటన ఆమెను షాక్‌కి గురి చేసింది. దేవుడి పాదాల దగ్గర కూడా ఉంచకుండా పూలను పక్కనే ఉన్న చెత్త కుండీలో పడేశారు. అక్కడే కాసేపు కూర్చుని మొత్తం గమనించింది. పువ్వులన్నిటిదీ అదే దారి. చెత్తకుండీలో పడేస్తున్నారు. కొన్ని గంటలకు చెత్త కుండీ కాస్తా... పూల కుండీగా మారింది. ఇంటికి తిరిగి వచ్చిన పూనమ్... దేవాలయాల్లోని పూల వ్యర్థాలతో ఏం జరుగుతుందోనని ఇంటర్‌నెట్‌లో పరిశోధించింది. ఇంటర్నేషనల్ జర్నల్ ఫర్ రిసెర్చ్ ఇన్ అప్లయిడ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ నివేదిక ప్రకారం, ప్రతి ఏడాదీ సుమారు 80 లక్షల టన్నుల పువ్వులు మన దేశ నదుల్లో డంప్ అవుతున్నాయి. నది కాలుష్య కారకాల్లో పూల వ్యర్థాల శాతం 16 అని తెలుసుకుంది. పూల వ్యర్థాలను ఉపయోగించుకునే మార్గాల కోసం వెతకటం ప్రారంభించింది పూనమ్.



మూడు వేల మందికి శిక్షణ

పూనమ్ ఇప్పుడు ఖాదీ ఇండియా, నేషనల్ కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియాలో మాస్టర్ ట్రైనర్. జమ్మూలోని కృషి విజ్ఞాన కేంద్రాలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమంతోపాటు అనేక ప్రభుత్వ సంస్థల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. ఆమె 3,000 మందికిపైగా మహిళలకు శిక్షణనిచ్చింది. ముఖ్యంగా పర్యావరణానికి సహాయం చేస్తూనే.. వారి స్వయం సమృద్ధికి ఓ మార్గాన్ని చూపుతున్నది.

అన్ని అడ్డంకులనూ అధిగమించి..

ఆమె తన ఇంటి దగ్గర ఆవు పేడ పొడిని అగరబత్తుల తయారీకి ఉపయోగించే ఒక చిన్న వ్యాపారాన్ని చూసింది. పువ్వులతో కూడా అలా చేయవచ్చా.. అన్న ఆలోచన ఆమెలో మొదలైంది. 'రోజూ టన్నుల కొద్దీ పూలను నదుల్లో పోయటం నేను గుర్తించాను. పూలను రీసైక్లింగ్ చేస్తున్న ఓ కంపెనీకి వెళ్లి అక్కడ అధ్యయనం చేశాను. వారి సహాయం అడిగాను... వారి గైడెన్స్‌తో పని మొదలుపెట్టాను' అని పూనమ్ చెప్పింది. ఉదయం అయిదు గంటలకే నిద్రలేచి.. తన నివాసానికి సమీపంలోని దేవాలయాలకు వెళ్తుంది. అక్కడ సిబ్బందిని అడిగి వృథాగా పడేసిన పువ్వులను తెస్తుంది. అప్పటికి దాదాపు ఉదయం తొమ్మిదవుతుంది. తను తెచ్చిన వ్యర్థాలన్నిటినీ వేరు చేసి ఎండలో ఆరబెడుతుంది. ఈ ఎండిన పూలతో ప్రయోగాలు చేయొచ్చన్న ఆశ.. లక్ష్యమే అన్ని అడ్డంకులనూ అధిగమించగలిగింది. మొదట్లో పూలన్నీ పాడయిపోయేవి. అయినా పట్టు వదల్లేదు. ప్రయత్నం ఆపలేదు.

వెంచర్ ఇలా..

2019 జూన్‌లో.. తన స్నేహితురాలు పింకీ యాదవ్‌తో కలిసి 'ఆరుహి ఎంటర్ ప్రైజెస్‌ను ప్రారంభించింది. తన సోదరుడు అందించిన కొద్దిపాటి స్థలంలో పూనమ్ ఆ యూనిట్‌ను ఏర్పాటుచేసింది. అప్పుడు ఆమె వయసు 37 ఏండ్లు. ఆమె ఈ రోజు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని 15 ఆలయాల నుంచి ప్రతీ మూడు రోజులకు దాదాపు 100 కిలోలకుపైగా పూల వ్యర్థాలను సేకరిస్తుంది. ఆమె వెంచర్‌లో ప్రతి నెలా 1,000 కిలోలు పూలు రీసైకిల్ చేస్తుంది. వాటితో అగరబత్తులు, దూప్ బత్తీలు, దియాలతో పాటు, ఎయిర్ ఫ్రెషనర్‌లనూ తయారుచేస్తుంది. ఆమె ఉత్పత్తుల రేటు రూ.50-350 వరకు ఉంటాయి. నెలవారీ ఆదాయం రూ.2 లక్షలుపైనే. ఆమె ధూప్ స్టాండ్, ప్యాకేజీలు కూడా వ్యర్థాలతోనే తయారు చేస్తుంది. తన యూనిట్‌లో అయిదుగురు మహిళలను నియమించు కుంది. వారిని ఆమె 'ఫ్లవర్ రీసైక్లర్స్' అని పిలుస్తుంది. మొదట్లో తన పొదుపు మొత్తాన్ని వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన పూనమ్ తన వెంచర్ కోసం కొంత రుణాన్నీ తీసుకుంది. తన ఉత్పత్తులు సేంద్రీయమైనవని, దాదాపు 80శాతం పూల వ్యర్థాలతో తయారు చేసినవేనని పూనమ్ చెబుతుంది.



ఎగ్జిబిషన్‌లలో విక్రయం

తయారుచేయటమైతే ప్రారంభించింది. వాటి విక్రయాలు ఎలా? ఢిల్లీ హాట్ (దక్షిణ ఢిల్లీలోని అత్యంత ముఖ్యమైన వాణిజ్య కేంద్రాల్లో ఒకటి), ఇతర ప్రదర్శనల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. 'ఢిల్లీ హాట్‌లో నేను ఏర్పాటు చేసిన మొదటి స్టాల్‌కు మంచి స్పందన వచ్చింది. ఉపాధ్యాయులు కొందరు వస్తువులను చూసి ఫ్యాక్టరీని చూడటానికి వచ్చారు. వీటి గురించి తమ విద్యార్థులతో మాట్లాడాలని నన్ను ఆహ్వానించారు' అని పూనమ్ చెప్పింది. వ్యాపారం పుంజుకుంటున్న సమయంలోనే కోవిడ్ మహమ్మారి ప్రభావం పూనమ్ బిజినెస్‌పైనా పడింది. అప్పుడు కూడా తన వస్తువుల అమ్మకాలపై దృష్టి పెట్టింది. వెబ్‌సైట్, వాట్సాప్, ఫేస్ బుక్ ద్వారా ప్రచారం చేసుకుంది. ఆన్‌లైన్‌లో తన ఉత్పత్తులను విక్రయించడం ప్రారంభించింది.

- కె లలిత



పర్యావరణానికి తన వంతు సాయం

ఈ వ్యాపారం పూనమ్‌కు మంచి గుర్తింపుతోపాటు.. వేల మంది మహిళల జీవితాల్లోనూ మార్పుతెచ్చింది. మరోవైపు పర్యావరణానికీ తన వంతు సాయం చేస్తున్నది. ఏ ఒక్క ఆలయంలోనూ పూలను చెత్తలో వేయని దేశంగా మన దేశాన్ని తీర్చిదిద్దాలన్నది ఆమె కల. 'మన కోసం ఓ మార్గాన్ని రూపొందించు కోవడానికి మనందరికీ జీవితంలో ఓ అవకాశం లభిస్తుంది. దానిని మిస్ చేసుకోకూడదు. మీ కోసం జీవించండి, మీకు సంతోషాన్నిచ్చేది చేయండి... మొదటి అడుగు ఎప్పుడూ కష్టమే... కానీ మీరు అడుగువేయటం మొదలుపెడితే.. వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం ఉండదు..' అంటుంది పూనమ్.

మజ్జిగతో ఎంతో మేలు..



రోజు మొత్తం మీద ఒక గ్లాసు చల్లని మజ్జిగను తాగితే ఆరోగ్యానికి ఎంతో మేలు. వేసవిలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు మజ్జిగ చక్కని పరిష్కారం.

మజ్జిగలో పొటాషియం, కాల్షియం, విటమిన్ బి అధికంగా ఉండి శరీరానికి పోషకాలు లభిస్తాయి.

ఇందులో ప్రోబయోటిక్ వంటి ఉపయోగకరమైన బ్యాక్టీరియా జీర్ణక్రియను పెంచి, మలబద్ధక సమస్యను తగ్గిస్తుంది.

రోజూ ఉదయం మజ్జిగ తాగడం వల్ల కడుపులో మంట, ఎసిడిటి సమస్యలు తగ్గుతాయి.

మజ్జిగలో కరివేపాకు, జీలకర్ర, మిరియాలపొడి వంటి పదార్థాలను చేర్చి తాగడం వల్ల అనేక ఔషధ గుణాలను పొందవచ్చు.

పొట్ట ఉబ్బరంగా ఉన్నప్పుడు గ్లాసు మజ్జిగలో అల్లం లేదా జీలకర్ర పొడి కలిపి తాగితే త్వరగా ఉపశమనం కలుగుతుంది.

డీహైడ్రేషన్‌కి గురైనప్పుడు ఒక గ్లాసు మజ్జిగలో కొన్ని మసాలా దినుసులు, ఉప్పు కలిపి తీసుకుంటే మంచిది.

మజ్జిగ వల్ల శరీరంలోని కొవ్వు శాతం కంట్రోల్ అయ్యి రక్త ప్రసరణ (బీపీ) తగ్గుతుంది.

మజ్జిగలో ఉండే బయో యాక్టివ్ ప్రోటీన్, యాంటీ క్యాన్సర్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలను కలిగి ఉంటుంది. ■

తీహార్ జైల్‌కు అరవింద్ కేజ్రీవాల్

(మొదటిపేజీ తరువాయి)

తీహార్ జైలులోని జైల్ నెంబర్-2లో కేజ్రీవాల్ ఒక్కరే ఉంటారు. ఇప్పటికే ఈ కేసులో అరెస్టైన మనీష్ సిసోడియా జైల్ నెంబర్-1, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్ జైల్ నెంబర్-7, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ జైల్ నెంబర్-5లో ఉంటున్నారు. బీఆర్ఎస్ నేత కె.కవిత తీహార్ జైలులోని జైల్ నెంబర్-6 (మహిళా జైలు)లో ఉంటున్నారు.

జైలులో కేజ్రీవాల్ దినచర్య

కేజ్రీవాల్‌తో పాటు జైలులోని ఇతర ఖైదీల దినచర్య ఉదయం 6.30 గంటలతో మొదలవు తుంది. ఖైదీలకు బ్రేక్‌ఫాస్ట్‌గా టీ, బ్రెడ్ ముక్కలు ఇస్తారు. ఆ తర్వాత కేసువిచారణ ఉంటే కోర్టుకు కేజ్రీవాల్ వెళ్తారు. లేదంటే తన న్యాయవాదుల బృందంతో సమావేశమవుతారు. 10.30 నుంచి 11 గంటల వరకూ మధ్యాహ్న భోజనం (లంచ్) ఉంటుంది. పప్పు, సబ్జీ, ఐదు రొట్టెలు లేదా రైస్ ఇస్తారు. ఆ తర్వాత 3 గంటల నుంచి ఖైదీలను సెల్‌లోనే ఉంచుతారు. 3.30 గంటలకు టీ, రెండు బిస్కట్లు ఇస్తారు. సాయంత్రం 4 గంటలకు తమ లాయర్లను కలవవచ్చు. సాయంత్రం 5.30 గంటలకు ఎర్లీ డిన్నర్ ఉంటుంది. రాత్రి 7 గంటల నుంచి జైలుగదిలోనే ఉంచుతారు.

జైలులో సౌకర్యాలు

కేజ్రీవాల్‌కు జైలులో టీవీ చూసే సౌకర్యం కల్పించారు. వార్తలు, వినోదం, క్రీడలు సహా 18 నుంచి 20 ఛానెల్స్ చూసే అవకాశం ఉంది. 24 గంటలూ మెడికల్ స్టాఫ్ అందుబాటులో ఉంటుంది. డయాబెటిక్ పేషెంట్ కావడంతో కేజ్రీవాల్‌కు జైలులో రెగ్యులర్‌గా మెడికల్ చెకప్‌లు ఉంటాయి. కుటుంబ సభ్యులను వారంలో రెండుసార్లు కలుసుకునే వీలు కల్పించారు. కుటుంబ సభ్యుల జాబితాను నిర్ధారించుకున్న తర్వాతే జైలు భద్రతా సిబ్బంది వారికి అనుమతి ఇస్తారు.

కేజ్రీవాల్ సహకరించడం లేదు: ఈడీ

లిక్కర్ స్కాం కేసు దర్యాప్తునకు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహకరించడం లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. అలాగే ఒక కీలక ప్రశ్నకు సమాధానంగా ఆప్ మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్ పేర్లను ఆయన బయటపెట్టారని ఢిల్లీ కోర్టుకు తెలిపింది. ఈ కేసులో నిందితుడైన ఆప్ మాజీ కమ్యూనికేషన్ ఇన్‌చార్జ్ విజయ్ నాయర్‌తో తనకు అంతగా సంప్రదింపులు లేవని, అతిషి, సౌరభ్ భరద్వాజ్‌లను ఆయన కలిసేవాడని కేజ్రీవాల్ చెప్పారని ఈడీ వెల్లడించింది. కాగా, ఢిల్లీలో మద్యం రిటైల్ వ్యాపారంలోకి ప్రవేశించేందుకు కేజ్రీవాల్ ప్రభుత్వానికి వంద కోట్ల ముడుపులు అందించిన 'సౌత్ గ్రూప్'నకు మధ్యవర్తిగా విజయ్ నాయర్ వ్యవహరించినట్లు చార్జిషీట్‌లో ఈడీ ఆరోపించింది. కేజ్రీవాల్‌తో తన సమావేశాన్ని విజయ్ నాయర్ ఏర్పాటు చేసినట్లు ఈ కేసులో మరో నిందితుడు సమీర్ మహేంద్రుడు దర్యాప్తులో చెప్పాడని ఈడీ పేర్కొంది. మరోవైపు నేరుగా సమావేశం కుదరకపోవడంతో వీడియో కాల్ ద్వారా కేజ్రీవాల్‌తో సమీర్‌ను విజయ్ నాయర్ మాట్లాడించాడని ఈడీ తెలిపింది. వీడియో కాల్ సందర్భంగా నాయర్ తమ వ్యక్తి అని ఆయనను నమ్మవచ్చని, ఆయనతో మాట్లాడవచ్చని సమీర్‌తో కేజ్రీవాల్ అన్నట్లుగా ఆ చార్జిషీట్‌లో ఈడీ పేర్కొంది. కాగా, తనను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ ఇప్పటికే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్ పిటిషన్ నేడు (మంగళవారం) విచారణకు రానుంది.

స్పెషల్ లీగల్ యాంటీ క్వాకరీ కమిటీల ఏర్పాటు : టీఎస్ఎంసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అర్హత లేకుండా వైద్యం చేస్తున్న వారి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు స్పెషల్ లీగల్ యాంటీ క్వాకరీ కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) తెలిపింది. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారీగా డాక్టర్లతో ఈ కమిటీలను ఏర్పాటు చేశారు.

19 మందిపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు

రాష్ట్రంలో అర్హత లేకుండా వైద్యం చేస్తున్న 19 మందిపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్టు టీఎస్ఎంసీ తెలిపింది. వీరే కాకుండా ఆయుష్ వైద్య విధానాల అర్హత కలిగి అల్లోపతిక్ ప్రాక్టీస్ చేస్తున్న 17 మంది డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆయుష్ బోర్డుకు ఫిర్యాదు చేసింది. అర్హత లేకుండా చేస్తున్న వైద్యాన్ని ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలున్న కొంత మంది డాక్టర్లు, ఆస్పత్రులకు నోటీసులను జారీ చేశారు.

కళంకితులకు వెల్‌కం



(మొదటిపేజీ తరువాయి)

దోపిడీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బీరాలు పలికిన ప్రధానమంత్రి, ఇప్పుడు ఆ కుంభకోణంలో నిందితుడిని ఎన్నికల బరిలో నిలిపారు. ఎన్నికల బాండ్లను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసిన పది మంది దాతల్లో నవీన్‌కు చెందిన జిందాల్ గ్రూపు కూడా ఉండడం గమనార్హం. ఈ గ్రూపు గత ఐదు సంవత్సరాలలో రూ.202 కోట్ల ఎన్నికల విరాళాలు ఇచ్చింది.

అక్రమ ఆస్తుల నిందితులకూ...

అక్రమ ఆస్తుల కేసులో మహారాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కృపా శంకర్ సింగ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులు పెట్టాయి. సింగ్, ఆయన కుటుంబసభ్యులు రూ.230 కోట్ల మేర అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆరోపించాయి. సింగ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ 2012లో బీజేపీ డిమాండ్ చేసింది కూడా. సింగ్ 2021లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరిపోయారు. ఇప్పుడాయన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు. తన స్వస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని జాన్‌పూర్ నుండి ఎన్నికల బరిలో దిగారు.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన దెబాశిష్ ధార్ మాజీ ఐపీఎస్ అధికారి. అక్రమ ఆస్తుల కేసులో దెబాశిష్ నివాసంపై 2022లో రాష్ట్ర సీఐడీ దాడులు చేసింది. దెబాశిష్ గతంలో కూచ్‌బిహార్ ఎస్పీగా పనిచేశారు. 2021 శాసనసభ ఎన్నికల తర్వాత ఆయనను సస్పెండ్ చేశారు. కేంద్ర దళాలు జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోయిన ఉదంతానికి సంబంధించి ఆయనపై చర్యలు తీసుకున్నారు. ఆయన ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. బీజేపీ తరఫున బిర్‌భుమ్ నుండి పోటీ చేస్తున్నారు.

'దొంగ' అంటూనే...

తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత, ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన తపస్ రాయ్ గత నెలలోనే బీజేపీలో చేరారు. ఇప్పుడాయన కొల్‌కతా నార్త్ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీకి దిగారు. మున్సిపాలిటీలలో జరిగిన ఉద్యోగ నియామకాల కుంభకోణంలో జరిగిన అవకతవకలకు సంబంధించి ఈడీ ఆయన నివాసంపై దాడి చేసింది. ఆ దాడి తర్వాత రాయ్‌ని బీజేపీ నేత, శాసనసభలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఓ దొంగగా అభివర్ణించారు. సువేందు కూడా తృణమూల్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన వారే.

అప్పుడు ఆరోపణలు చేసి...

జార్ఖండ్‌లో కాంగ్రెస్‌కు చెందిన ఏకైక ఎంపీ గీతా కోడా గత నెలలో కాషాయదళంలో చేరిపోయారు. ఇప్పుడామె సింగ్భుమ్ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గీతా కోడా జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా భార్య. బొగ్గు గనుల కుంభకోణం కేసులో ఆయనను 2017లో జైలులో ఉంచారు. గీత 2018లో కాంగ్రెస్‌లో చేరినప్పుడు బీజేపీ నాయకులు ఆమెపై పలు ఆరోపణలు గుప్పించారు. కాగా గీత తండ్రి మధు కోడా కూడా త్వరలోనే బీజేపీలో చేరతారని వార్తలు వస్తున్నాయి.

కేకేకు మతిభ్రమించింది

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్‌ను మోసం చేసి కాంగ్రెస్‌కు జై కొట్టిన ఎంపీ కేశవరావుకు మతిభ్రమించిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రసమయి బాలకిషన్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రసమయి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే తెలంగాణ ద్రోహుల పార్టీ అని ఎద్దేవా చేశారు. మిలియన్ మార్చ్ సందర్భంగా కేకేను కోడిగుడ్లతో కొట్టిన సంఘటనలు తనకు ఇంకా గుర్తే ఉన్నాయన్నారు. ఆయన భాష ఎవ్వరికీ అర్థం కాదని ఎద్దేవా చేశారు. అలాంటి కేకే ఇప్పుడు తెలంగాణ ఉద్యమంలో మాట లేదు.. పాట లేదు అంటూ వ్యాఖ్యానించటం ఆయన అహంభావానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి వైఖరి వల్లే బీఆర్ఎస్ నుంచి తాటికొండ రాజయ్య, ఆరూరి రమేశ్ వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాదిగల ద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్లో కడియం శ్రీహరిపై చావు డప్పు కొట్టాలని పిలుపునిచ్చారు. శ్రీహరిని ఓడగొట్టి పాతిపెట్టే వరకు తాను గజ్జె కట్టి ఆడతానని హెచ్చరించారు.

కరెంట్ కోతల్లేవని రైతుల ముందు అనగలరా..?

(మొదటిపేజీ తరువాయి)

నల్లగొండ మండలంలోని ముషంపల్లిలో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతుల కుటుంబాలను పరామర్శించారు. రైతులు గండేపోయిన మల్లయ్య యాదవ్, బోర్ల రామిరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు మల్లయ్యకు కేటీఆర్ రూ.లక్ష చెక్కును అందజేశారు. పంటలు ఎండిపోయినాయి.. తాగునీరు దొరకని పరిస్థితి ఉందని రైతులు కేటీఆర్‌కు విన్నవించారు. అనంతరం గ్రామంలో విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టును ఉపయోగం లేని ప్రాజెక్టుగా చూపిస్తూ, రిజర్వాయర్లలో నీళ్లు నింపకుండా ఈ ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పర్యటన భయంతో నంది పంప్‌హౌస్‌లో ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసి కరీంనగర్‌కి నీళ్ల వదిలారని తెలిపారు. నిన్నటిదాకా కాళేశ్వరం ఫెయిల్ అయిందని చెప్పి ఇదే రోజు అదే బాహుబలి మోటార్లతో కరీంనగర్‌కు నీళ్ల అందిస్తున్నారని చెప్పారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు నాగార్జునసాగర్ నుంచి మొదలుకొని ప్రతి ఒక్కరికీ సాగునీరు అందిందని చెప్పారు. పదేండ్ల కాలంలో ఏనాడూ మళ్లీ బోరు వేయాల్సిన పరిస్థితి రైతులకు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో గ్రామాల్లో బోరు బండ్ల మోత మోగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు రైతాంగం పరిస్థితి దారుణంగా ఉందన్నారు. చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వల్ల రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. కేవలం కేసీఆర్‌ని బద్నాం చేయాలన్న దుర్మార్గపూరిత, చిల్లర తాపత్రయంతో లక్షల మంది రైతుల పంటలను ప్రభుత్వం ఎండబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఎక్కడ పంట నష్టం జరిగిందో అక్కడ ఎకరానికి రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి, ఒక్క మంత్రి కూడా రైతుల వద్దకి వెళ్లి పరామర్శించిన పాపాన పోలేదన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా తాము, తమ నాయకుడు కేసీఆర్ తన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా మూడు నాలుగు జిల్లాలు తిరిగి రైతులను పరామర్శించి ధైర్యం చెబుతున్నారని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన పొంకనాల పోతిరెడ్డి రేవంత్ రెడ్డి ఎక్కడ పోయిండని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇప్పటికే 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచైనా హామీలను నెరవేర్చేలా ఒత్తిడి తీసుకొస్తామన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమస్యను పరిష్కరించకుండా ఉత్త మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు రాజకీయ చేరికలపై ఉన్న శ్రద్ధ రైతాంగం సమస్యలపై లేదన్నారు. ముఖ్యమంత్రి కేశవరావు ఇంటికి వెళ్లినప్పుడు కూడా కరెంటు పోయిందని చెప్పారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎంత బుకాయించినా వాస్తవాలు వాస్తవాలేగానీ అబద్ధాలు కావని చెప్పారు. మంత్రులకు దమ్ము ధైర్యం ఉంటే రైతుల ముందుకొచ్చి కరెంటు కోతలు, సాగునీటి కొరత లేదని చెప్పాలని సవాల్ విసిరారు. అంతకు ముందు నల్లగొండ పార్లమెంటరీ బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఆలోచన మాకు లేదన్నారు. ఖమ్మం, నల్లగొండ బాంబులతోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రమాదముందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, నల్లబోతు భాస్కరరావు, రమావత్ రవీందర్ కుమార్ నాయక్, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, తదితర నాయకులు ఉన్నారు.

తాగు.. సాగు నీరే ఆయుధాలు..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వర్షాభావ పరిస్థితులు, మండుతున్న ఎండలు, ఫలితంగా తలెత్తిన తాగు, సాగునీటి ఎద్దడులు... ఇవన్నీ అధికార కాంగ్రెస్‌కు కొంత ఇబ్బందికర పరిస్థితులుగా మారితే, వాటినే తన అస్త్రాలుగా మలుచుకోవాలని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మంచినీటి ఇక్కట్లు మొదలయ్యాయనీ, నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అంచనా వేశారు. ఆ మేరకు ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ఆ సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా రైతుల నుంచి మంచి స్పందన వచ్చిందని గులాబీ పార్టీ చెబుతోంది. ఈ స్పందనను మరింత సానుకూలంగా మార్చుకోవటం ద్వారా త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు ఒక బలమైన ఆయుధంగా మార్చుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది. వీటితోపాటు కరెంటు కష్టాలను తనకు అనుకూలంగా మలచుకోవాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారెంటీలు, వాటి అమలు, వాటికి నిధులు తదితరాంశాలపై ఇప్పటికిప్పుడే ప్రజల్లో వ్యతిరేకత రాదని కేసీఆర్ అంచనా వేశారు. అందువల్ల వాటి జోలికెళ్లకుండా ప్రత్యక్షంగా జనం అనుభవించే, వారు నేరుగా ఇబ్బందిపడే తాగు, సాగు నీరు, కరెంటు సమస్యలను అజెండాగా ఎంచుకుని ముందుకు పోవాలని ఆయన నిర్ణయించారు. వీటిపైన్నే ప్రధానంగా దృష్టి సారించి, సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలంటూ పార్టీ నేతలను ఆదేశించారు. ప్రధానంగా పదేండ్ల తమ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించిన వైనాన్ని, సాగునీరు పుష్కలంగా వదిలిన తీరును, ఫలితంగా భూగర్భ జలాలు పెరిగిన వైనాన్ని లెక్కలు, గణాంకాలతో సహా ప్రతీ మీటింగులోనూ వివరించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. దీంతోపాటు రైతు బంధు నిధులు ఆలస్యంగా పడటం, రైతు భరోసా పథకంపై రేవంత్ సర్కార్ ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవటం అనే అంశాలను ప్రధాన ఇతివృత్తాలుగా ఎంచుకోవాలనీ, ఈ విషయాలపై క్యాడర్‌కు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వీటిని ఎంపీ ఎలక్షన్లలో సాధ్యమైనంత ఎక్కువగా వాడుకోవాలని కేసీఆర్ ఆదేశించారు. ఆదివారం పర్యటన ద్వారా ఈ అంశాలన్నింటిపై ఒక స్పష్టతకు వచ్చినట్టు ఆయన వారికి వివరించినట్టు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించిన కేసీఆర్... తన తదుపరి పర్యటనకు బీఆర్ఎస్‌కు మంచి పట్టున్న కరీంనగర్ లోక్‌సభ స్థానాన్ని ఎంచుకున్నారు. ఆ ఎంపీ స్థానం పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల అసెంబ్లీ స్థానాలను కారు పార్టీ గెలుచుకుంది. అందువల్ల కొద్దిగా కష్టపడితే ఆ లోక్‌సభ స్థానాన్ని సులభంగా కైవసం చేసుకోవచ్చని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే ఈనెల ఐదున తన తర్వాతి పర్యటనను ఆ జిల్లాలో కొనసాగించనున్నారు. ఒకవైపు బీఆర్ఎస్‌ను వీడుతున్న నేతల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండగా, ఆ నైరాశ్యం నుంచి కార్యకర్తలు, నాయకులను బయటపడేసేందుకు, వారిలో ధైర్యం నింపేందుకు గులాబీ బాస్ ఇలాంటి వ్యూహాలను ఎంచుకున్నారని కొందరు కీలక నేతలు వ్యాఖ్యానించారు.

'సుప్రీం' నుంచి పిటిషన్ వెనక్కి

- హేమంత్ సొరెన్‌కు సర్వోన్నత న్యాయస్థానం అనుమతి

న్యూఢిల్లీ : హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరెన్.. తన పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమై మార్చి 2 నాటికి ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరవటం కోసం హేమంత్ సొరెన్ జార్ఖండ్ హైకోర్టును గతంలో అనుమతి కోరారు. అయితే, న్యాయస్థానం ఆ సమయంలో అయన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును హేమంత్ సొరెన్ ఆశ్రయించాడు. సోమవారం ఆయన పిటిషన్ విచారణ.. న్యాయమూర్తులు జస్టిస్ సూర్య కాంత్, కె.వి విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. హేమంత్ తరఫున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాలు మార్చి 2న ముగిసినందున పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతించాలని కపిల్ సిబల్ కోర్టును కోరారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరించింది. మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ మాజీ సీఎంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈ ఏడాది జనవరి 31న అరెస్టు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం ఈయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.



బెంగళూర్ పుంజుకునేనా?



నేడు లక్నోతో ఆర్సీబీ పోరు

బెంగళూర్ (కర్ణాటక) : ఐపీఎల్‌లో సీజన్లు మారుతున్నా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ కథ మారటం లేదు. ఎప్పటిలాగే స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి ఒక్కడే ఒంటరి పోరాటం చేస్తుండగా.. సహచరుల నుంచి కనీసం మద్దతు లభించటం లేదు. దీంతో ఐపీఎల్17లో ఆడిన మూడు మ్యాచుల్లో రెండింట బెంగళూర్ ఓటమి పాలైంది. ప్రతి జట్టు సొంతగడ్డపై విజయాలు సాధించగా.. ఆర్సీబీ మాత్రమే ఓటమి చవిచూసింది. తాజాగా నేడు సీజన్లో నాల్గో మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌తో డుప్లెసిస్ సేన తలపడనుంది. రెండు మ్యాచుల్లో ఓ విజయంతో లక్నో సూపర్‌జెయింట్స్ మంచి ఊపుమీదుంది. చిన్న బౌండరీల చిన్నస్వామి స్టేడియంలో నేడు భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది.

ఆ ముగ్గురు మెరిస్తేనే : రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు విదేశీ క్రికెటర్లు డుప్లెసిస్, గ్లెన్ మాక్స్‌వెల్, కామెరూన్ గ్రీన్ కీలకం. ఈ ముగ్గురు అంచనాల మేరకు రాణించటం లేదు. దీంతో ఆ జట్టు ఆశించిన పరుగులు సాధించటంలో తేలిపోతుంది. బ్యాటింగ్ లైనప్‌లో విరాట్ కోహ్లి ఒక్కడే పోరాటం చేస్తున్నాడు. డెత్ ఓవర్లలో దినేశ్ కార్తీక్ ధనాధన్ మెరుపులతో అదిరే ముగింపులను అందిస్తున్నాడు. కానీ ఇతర బ్యాటర్లు నిరాశపరుస్తున్నారు. సీజన్లో నాల్గో మ్యాచ్ ఆడుతున్న బెంగళూర్ బ్యాట్, బంతితో రాణించకపోతే కోలుకోవటం మరింత కష్టమవనుంది.

చాంప్స్ ఆనంద్, అరుణ్ జోడీ

ముగిసిన 17వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్



హైదరాబాద్ : 17వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ముగిసింది. హైదరాబాద్‌లోని లేక్‌వ్యూ టెన్నిస్ అకాడమీలో జరిగిన పోటీల్లో సుమారు 300 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) డైరెక్టర్ జనరల్ సి.వి ఆనంద్, హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం (హెచ్‌ఓటీ) అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డితో విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతి అందజేశారు. పురుషుల 40 ప్లస్ డబుల్స్ విభాగంలో సి.వి ఆనంద్, అరుణ్ జోడీ టైటిల్ సాధించారు. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో లగ్గాని శ్రీనివాస్, రాజా జోడీపై 10-7తో విజయం సాధించారు. మెన్స్ 40 ప్లస్ సింగిల్స్‌లో తన డబుల్స్ భాగస్వామి అరుణ్‌కు సివి ఆనంద్ టైటిల్ కోల్పోయారు. 10-4తో ఆనంద్‌పై అరుణ్ సాధికారిక విజయం నమోదు చేశారు. పురుషుల సింగిల్స్ విభాగాల్లో 30 ప్లస్ సింగిల్స్‌లో మంజునాథ్, 50 ప్లస్ సింగిల్స్‌లో నర్సింహారెడ్డి, 60 ప్లస్ సింగిల్స్‌లో రామ్‌రెడ్డి, 70 ప్లస్ సింగిల్స్‌లో గజపతి విజేతలుగా నిలిచారు. పురుషుల డబుల్స్ విభాగాల్లో సాయిరాంబాబు (70 ప్లస్), ఆనంద్ స్వరూప్, శ్రీనివాస్ (60 ప్లస్),అజయ్, రాహుల్ (50 ప్లస్), మంజునాథ్, సురేశ్ (30 ప్లస్) టైటిల్స్ సాధించారు.

రాయల్స్ హ్యాట్రిక్



- రాజస్థాన్ వరుసగా మూడో విజయం
- బౌల్ట్, చాహల్‌కు ముంబయి దాసోహం
- ముంబయి125/9, రాజస్థాన్ 127/4

నవతెలంగాణ-ముంబయి

వాంఖడేలో హ్యాట్రిక్ హ్యాట్రిక్. రాజస్థాన్ రాయల్స్ వరుసగా మూడో విజయం సాధించగా, ముంబయి ఇండియన్స్ వరుసగా మూడో పరాజయం చవిచూసింది. 126 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ ఊదేసింది. మరో 27 బంతులు ఉండగానే లాంఛనం ముగించింది. రియాన్ పరాగ్ (54 నాటౌట్, 39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. రవిచంద్రన్ అశ్విన్ (16), శివం దూబె (8 నాటౌట్) రాణించారు. యశస్వి (10), బట్లర్ (13), సంజు (12) వికెట్లతో రాయల్స్ ఒత్తిడిలో పడినా పరాగ్ ఫటాఫట్ ఇన్నింగ్స్‌తో హ్యాట్రిక్ విజయాన్ని అందించాడు. అంతకుముందు, ట్రెంట్ బౌల్ట్ (3/22), చాహల్ (3/11), నండ్రె బర్గర్ (2/32) మ్యాజిక్‌తో ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులే చేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్య (34, 21 బంతుల్లో 6 ఫోర్లు), తెలుగు తేజం తిలక్ వర్మ (32, 29 బంతుల్లో 2 సిక్స్‌లు) ముంబయి ఇండియన్స్‌కు గౌరవప్రద స్కోరు అందించారు.



ముంబయి విలవిల

తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన ముంబయి ఇండియన్స్‌కు ట్రెంట్ బౌల్ట్ కోలుకోలేని షాక్ ఇచ్చాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి రెండు బంతులకు రెండు వికెట్లు పడగొట్టిన బౌల్ట్.. తన రెండో ఓవర్ రెండో బంతికి సైతం వికెట్ తీశాడు. రోహిత్ శర్మ (0), నమన్ దిర్ (0), డెవాల్డ్ బ్రెవిస్ (0) ఎదుర్కొన్న తొలి బంతికే డకౌట్‌గా నిష్క్రమించి డగౌట్‌కు చేరుకున్నారు. ఓపెనర్ ఇషాన్ కిషన్ (16, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడుతూ మెప్పించగా అతడినీ బర్గర్ సాగనంపాడు. దీంతో 20/4తో ముంబయి ఇండియన్స్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. తిలక్ వర్మ (32), కెప్టెన్ హార్దిక్ పాండ్య (34) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే పనిలో పడ్డారు. 36 బంతుల్లో 56 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను మళ్లీ పట్టాలెక్కించారు. చాహల్ వరుసగా తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యను అవుట్ చేసి ముంబయి ఆశలపై నీళ్లు చల్లాడు. చివర్లో టిమ్ డెవిడ్ (17, 24 బంతుల్లో 1 ఫోర్) వేగంగా పరుగులు సాధించటంలో విఫలమయ్యాడు. పియూశ్ చావ్లా (3), గెరాల్డ్ (4) తేలిపోయారు.

మెరిసిన మీరాబాయి

- పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- ఐడబ్ల్యూఎఫ్ ప్రపంచకప్




బ్యాంకాక్ (థాయ్‌లాండ్) : భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను మెరిసింది. హిప్ గాయం నుంచి కోలుకున్న టోక్యో ఒలింపిక్స్ సిల్వర్ మెడలిస్ట్.. ఆరు నెలల విరామం తర్వాత అదరగొట్టింది. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఐడబ్ల్యూఎఫ్ (అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్) ప్రపంచకప్‌లో మీరాబాయి చాను సత్తా చాటింది. మహిళల 49 కేజీల విభాగం గ్రూప్-బిలో మూడో స్థానంలో నిలిచిన మీరాబాయి చాను..ఏకంగా 184 కేజీలను ఎత్తిపడేసింది. స్నాచ్‌లో 81 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 103 కేజీల బరువు అలవోకగా ఎత్తిన మీరాబాయి చాను 2024 పారిస్ ఒలింపిక్స్‌కు లాంఛనంగా అర్హత సాధించింది. ఒలింపిక్స్ అర్హత ప్రక్రియ ప్రకారం వెయిట్‌లిఫ్టర్లు కనీసం రెండు తప్పనిసరి ఈవెంట్లు, మూడు ఇతర క్వాలిఫయింగ్ టోర్నీల్లో పోటీపడాలి. క్లీన్ అండ్ జెర్క్‌లో కనీసం 103 కేజీలు, స్నాచ్‌లో కనీసం 81 కేజీలు.. ఓవరాల్‌గా కనీసం 184 కేజీల బరువు ఎత్తాలి. అప్పుడే 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించవచ్చు. తాజా ఐడబ్ల్యూఎఫ్ ప్రపంచకప్‌లో అన్ని అర్హత కొలమానాలను అందుకున్న మీరాబాయి చాను ముచ్చటగా మూడోసారి ఒలింపిక్స్‌లో పోటీపడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్ (ఓక్యూఆర్)లను త్వరలోనే అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య విడుదల చేయనుంది. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం మహిళల 49 కేజీల విభాగంలో మీరాబాయి చాను రెండో స్థానంలో కొనసాగుతుంది. అగ్రస్థానంలో చైనా వెయిట్‌లిఫ్టర్ జియాన్ హుహువా నిలిచింది. నిబంధనల ప్రకారం ప్రతి వెయిట్ విభాగంలో ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో నిలిచిన అథ్లెట్లు నేరుగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. ఆరు నెలల విరామం తర్వాత తొలి ప్రయత్నంలోనే మెప్పించిన మీరాబాయి చాను.. పారిస్ ఒలింపిక్స్ నాటికి అత్యుత్తమ ఫిట్‌నెస్, ఫామ్ అందుకునే అవకాశం ఉంది. పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారత్ నుంచి వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో మీరాబాయి చాను మాత్రమే పోటీపడనుంది.




విన్నర్ జానిక్ సిన్నర్

- కొలిన్స్‌కు మహిళల టైటిల్ • మియామి ఓపెన్ టెన్నిస్

మియామి (కాలిఫోర్నియా) : 2024 క్యాలెండర్ ఏడాదిలో ఇటలీ కుర్రాడు జానిక్ సిన్నర్ జోరు కొనసాగుతుంది. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న జానిక్ సిన్నర్.. తాజాగా మియామి ఓపెన్ టైటిల్‌ను సైతం దక్కించుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో బల్గేరియా ఆటగాడు గ్రిగర్ దిమిత్రోవ్‌పై వరుస సెట్లలో విజయం సాధించిన సిన్నర్ తొలిసారి మిమామి ఓపెన్‌ను ముద్దాడాడు. 6-3, 6-1తో దిమిత్రోవ్‌పై సిన్నర్ ఏకపక్ష విజయం సాధించాడు. గతంలో రెండు సార్లు ఇక్కడ ఫైనల్స్‌కు చేరినా సిన్నర్ టైటిల్ సాధించలేదు. గత ఏడాది ఫైనల్లో రష్యా స్టార్ డానిల్ మెద్వదేవ్‌కు టైటిల్‌ను కోల్పోయాడు. కానీ మూడో ప్రయత్నంలో సిన్నర్ ఎటువంటి పొరపాటు చేయలేదు. 73 నిమిషాల్లోనే లాంఛనం ముగించి టైటిల్ కైవసం చేసుకున్నాడు. సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో ప్రత్యర్థికి ఒక్క గేమే కోల్పోయిన జానిక్ సిన్నర్ తనదైన జోరు చూపించాడు. టైటిల్ పోరులో 6 ఏస్‌లు కొట్టిన దిమిత్రోవ్.. సిన్నర్‌కు తగిన పోటీ ఇవ్వటంలో విఫలమయ్యాడు. నాలుగు ఏస్‌లు కొట్టిన సిన్నర్.. నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించాడు. గ్రిగర్ దిమిత్రోవ్ మాత్రం ఒక్క బ్రేక్ పాయింట్ సాధించలేదు. పాయింట్ల పరంగా 55-38తో జానిక్ సిన్నర్ ఆధిపత్యం చూపించాడు. కొలిన్స్ కొట్టేసింది. మహిళల సింగిల్స్ విభాగంలో అమెరికా స్టార్ డానిలె కొలిన్స్ చాంపియన్‌గా అవతరించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో కజకిస్థాన్ క్రీడాకారిణి ఎలెనా రిబకినాపై వరుస సెట్లలో విజయం సాధించింది. 7-5, 6-3తో ఎలెనా రిబకినాపై గెలుపొందిన డానిలె కొలిన్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్లో కొలిన్స్ నాలుగు ఏస్‌లు కొట్టగా, ఎలెనా రిబకినా ఐదు ఏస్‌లు కొట్టింది. కొలిన్స్ మూడు కీలక బ్రేక్ పాయింట్లు సాధించగా, ఎలెనా ఒక్క బ్రేక్ పాయింట్‌తో ఆగిపోయింది. తొలి సెట్లో 5-5 నుంచి వరుసగా రెండు గేములు నెగ్గిన కొలిన్స్ టైబ్రేకర్‌లో పైచేయి సాధించింది. కానీ రెండో గేమ్‌ను 6-3తో మెరుగ్గా సాధించింది. పాయింట్ల పరంగా కొలిన్స్ 82-75తో పైచేయి సాధించింది. కానీ ఎలెనా రిబకినా సైతం గట్టి పోటీ ఇచ్చింది. ఇక పురుషుల డబుల్స్ విభాగంలో భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ విజేతగా నిలువగా...మహిళల డబుల్స్ విభాగంలో అమెరికా జంట కెనిన్, మాటెక్ శాండ్స్‌లు గెలుపొందారు.



డిజిటల్ యుగంలో సరికొత్త అధ్యాయానికి నాంది

తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ నిర్వహించిన డిజిటల్ క్రియేటర్స్ మీట్ 'ఆరిజిన్ డే' డిజిటల్ రంగంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలవడమే కాకుండా, అపూర్వమైన మైలురాళ్లను కూడా నెలకొల్పింది. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నోవోటెల్‌లో జరిగిన ఈ వేడుకకు 700 మందికి పైగా డిజిటల్ క్రియేటర్‌లు, ఇన్‌ఫ్లుయెన్సర్‌లు హాజరయ్యారు. ఎంతో వైభవంగా జరిగిన ఈ వేడుక, డిజిటల్ క్రియేటర్ కమ్యూనిటీ బలాన్ని, చైతన్యాన్ని ప్రదర్శిస్తూ దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద సమావేశంగా నిలిచింది.
ఈ వేడుకలో విజయ్ దేవరకొండ, మెగాస్టార్ చిరంజీవి మధ్య జరిగిన ఇంటర్వ్యూ ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షించింది. భారతీయ సినీ రంగంలో అత్యంత ప్రభావవంతమైన ఇద్దరు వ్యక్తుల మధ్య ఎటువంటి దాపరికం లేకుండా హృదయపు లోతులలోనుంచి వచ్చిన మాటలతో జరిగిన ఈ చర్చ, తరాల సినిమా, డిజిటల్ కంటెంట్ సృష్టికి వారధిగా నిలిచింది. ఈ చారిత్రాత్మక వేడుక వివిధ వేదికలలో 100కి పైగా డిజిటల్ సృష్టికర్తల పేజీలు, ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారమై డిజిటల్ రంగంలో మునుపెన్నడూ చూడని ఘనతను సాధించింది. వేడుక ముఖ్య ఘట్టాలు, ముఖ్యంగా విజయ్ దేవరకొండ చేతుల మీదుగా 'తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్' సభ్యత్వ కార్డు, చిరంజీవి చేతుల మీదుగా హెల్త్ కార్డ్‌ను ప్రారంభించడం ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చేరువయ్యాయి. డిజిటల్ సృష్టికర్తలు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, అలాగే వృత్తిపరమైన వృద్ధిని పెంపొందించడంలో 'తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్' నిబద్ధతను ఈ కార్యక్రమాలు నొక్కి చెబుతున్నాయి.

ఆద్యంతం ఫ్రెష్‌లుక్‌తో ఉండే సినిమా

సూర్య తేజ హీరోగా పరిచయం అవుతూ నటిస్తున్న చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కెవిఆర్ మహేంద్ర దర్శకత్వం వహించారు. పిఆర్ ఫిలింస్ పతాకంపై పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి కథానాయిక. వేసవి కానుకగా ఈనెల 5న విడుదలకు కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు కెవిఆర్ మహేంద్ర మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.



కె.వి.ఆర్.మహేంద్ర

- 'నేను చేసిన 'దొరసాని' ఆర్గానిక్ పీరియాడిక్ పొయిటిక్ లవ్ స్టోరీ. ఖచ్చితంగా కొన్నింటికి కట్టుబడే ఆ సినిమా చేయాలి. ఈ సినిమాకి ఆ బౌండరీలు లేవు. ప్రేక్షకుడికి వినోదం పంచడానికి ఏ అంశాలు కావాలో అలాంటి అన్ని ఎలిమెంట్స్ ఇందులో కుదిరాయి.
- ఇది ఒక హీరో, హీరోయిన్ కథలా ఉండదు. వైవా హర్ష, హర్ష వర్దన్, అజయ్ ఘోష్, టెంపర్ వంశీ వీళ్ళంతా గత చిత్రాలకు భిన్నమైన పాత్రలు చేశారు. ఈ సినిమా చూసిన తర్వాత నటీనటుల కోసం కొత్త తరహా పాత్రల్ని రాస్తారు. వైవా హర్ష చెలరేగిపోయాడు. అజయ్ ఘోష్ సినిమా స్కేల్‌ని పెంచారు.
- సలీం ఫేక్ లాంటి పాత్రని ఊహించలేం. కొత్తరకం పాత్రలతో సినిమాకి ఒక ఫ్రెష్ లుక్ వచ్చింది. సినిమా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. కొత్త హీరో, హీరోయిన్‌తో చేసినట్లు ఎక్కడా అనిపించదు. చాలా పెద్ద డ్రామా ఉంటుంది. మంచి కాన్ఫ్లిక్ట్ వుంటుంది.
- పాత్రలకు ఎదురైన పరిస్థితులు ప్రేక్షకులని నవ్విస్తాయి. డార్క్ కామెడీ హిలేరియస్‌గా ఉంది. అన్ని పాత్రలు ఉన్నప్పటికీ వాటి లక్ష్యం ఒకటే వుంటుంది. చక్రంలో ఇరుసు చుట్టూ తిరిగినట్లు ఆ లక్ష్యం చుట్టూనే తిరుగుతాయి.
- కథలు చెబుతూ దర్శకుడు కావాలని కలలు గంటూ ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఓ సహాయ దర్శకుడు.. ఒక విచిత్రమైన పరిస్థితిలో పడి అది క్రైమ్ వరల్డ్‌కి దారితీసి ఆ డేంజర్ మూమెంట్ నుంచి ఎలా బయటపడ్డాడనేది లైన్. హీరో సూర్య తేజ అద్భుతంగా నటించాడు.
- 'భరతనాట్యం'లాంటి ఎలిమెంట్‌తో ఇప్పటివరకూ సినిమా రాలేదు. ఇలాంటి ఎలిమెంట్‌తో ఇదివరకూ కథ రాలేదు. చాలా ఫ్రెష్‌గా ఉంటుంది.

నవచిత్రం

మెగాస్టార్ మెచ్చిన టిల్లు స్క్వేర్



చిరంజీవి, నాగవంశీ, సిద్ధు జొన్నలగడ్డ

చిరంజీవి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. సామాన్యుడిగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి, ఎన్నో అద్భుతమైన విజయాలను అందుకొని, భారతదేశంలోనే అగ్ర నటుల్లో ఒకరిగా ఎదిగారు. అలాంటి చిరంజీవి ప్రశంసలు అందుకోవడం అంటే, యువ ఫిల్మ్ మేకర్స్‌కి అవార్డు గెలుచుకోవడం లాంటిది. ఇప్పుడు 'టిల్లు స్క్వేర్' చిత్రం బృందం ఆ ఘనతను సాధించింది. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు.
భారీ అంచనాలతో 'టిల్లు స్క్వేర్' సినిమా మార్చి 29వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లలో నవ్వులు పూయిస్తూ మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం.. బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపిస్తూ సంచలనాలు సృష్టిస్తోంది. కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.68 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టిన 'టిల్లు స్క్వేర్' చిత్రం.. రూ.100 కోట్ల మార్క్ దిశగా దూసుకుపోతోంది. తాజాగా ఈ చిత్రాన్ని వీక్షించిన చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాదు ఈ సినిమా తనకెంతో బాగా నచ్చిందని తెలిపారు.

అలాంటి ఫ్యామిలీ స్టార్స్ కోసం..



మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ, దిల్‌రాజు

హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' సినిమా మరో నాలుగు రోజుల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించారు.
ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, 'ఈ సినిమా విషయంలో ప్రతి అంశం పాజిటివ్‌గా కనిపిస్తోంది. పాటలు, ట్రైలర్ మీరు చూశారు మీ అందరికీ నచ్చింది. అందుకే మీలోనూ ఆ హ్యాపీనెస్ కనిపిస్తోంది. పరశురామ్ ఈ కథ చెప్పగానే అందులోని పాయింట్ నన్ను ఎగ్జైట్ చేసింది. విజయ్, పరశురామ్ కలిసి 'గీత గోవిందం' లాంటి బ్లాక్ బస్టర్ చేశారు. ఈ సినిమా కూడా వాళ్ల కాంబినేషన్‌లో సక్సెస్ అవుతుందనే నమ్మకం ఏర్పడింది. ఫ్యామిలీ స్టార్‌కు విజయ్ క్యారెక్టరైజేషన్ వెన్నెముక లాంటిది. విజయ్ నవ్విస్తాడు, ఏడిపిస్తాడు, ఫైట్ చేస్తాడు, ఫ్యామిలీ కోసం ఆలోచిస్తాడు, అమ్మాయిని ప్రేమిస్తాడు, ఆమెను ద్వేషిస్తాడు, రొమాన్స్ చేస్తాడు..ఇలా అన్ని షేడ్స్ హీరో క్యారెక్టర్‌లో ఉన్నాయి. ఇది కేవలం ఫ్యామిలీ స్టోరీ మాత్రమే కాదు లవ్ స్టోరీ కూడా ఉంటుంది' అని తెలిపారు.
'సీతారామం' సినిమాకు వర్క్ చేస్తున్నప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో నాకు ఇంత గొప్ప కెరీర్ ఉంటుందని అనుకోలేదు. ఆ సినిమా తర్వాత 'హాయ్ నాన్న' వంటి మంచి స్క్రిప్ట్ దొరికింది. ఈ రెండు సినిమాల తర్వాత నేను చేసే సినిమాలు స్పెషల్‌గా ఉండాలని అనుకున్నా. అలాంటి స్పెషల్ స్క్రిప్ట్‌ను పరశురామ్ నెరేట్ చేశారు. గోవర్ధన్, ఇందూ, బామ్మ ఇతర క్యారెక్టర్స్ మధ్య బ్యూటిఫుల్‌గా స్టోరీ ఉంటుంది. మన జీవితం అర చేతిలాంటిది. మన వేళ్లలాగే జీవితంలో కూడా ఎత్తుపల్లాలు ఉంటాయి. కొన్నిసార్లు మన ప్రొఫెషనల్ లైఫ్ చాలా బాగుంటుంది, కానీ పర్సనల్ లైఫ్‌లో సమస్యలు ఉంటాయి. మన జీవితాల్లోని ఎమోషన్స్, రిలేషన్స్, అఛీవ్ మెంట్స్, స్ట్రగుల్స్ అన్నీ ఈ మూవీలో మీరు రిలేట్ చేసుకుంటారు. మనల్ని ఎంకరేజ్ చేసి ముందుకు నడిపించేవారు కుటుంబంలో ఎవరో ఒకరు తప్పకుండా ఉంటారు. అలాంటి వారిని గుర్తుచేసుకునే ప్రయత్నమే ఈ సినిమా. ఈ సినిమా సైన్ చేసినప్పుడు నేను మా నాన్నతో ఈ సినిమా నీకోసమే చేస్తున్నానని చెప్పా. దర్శకుడు పరశురామ్ ఇందు క్యారెక్టర్‌ను చెప్పినప్పుడు నేను పోషించగలనా లేదా అని భయపడ్డాను. కానీ విజయ్ ఎంతో సపోర్ట్ చేశాడు' అని కథానాయిక మృణాల్ ఠాకూర్ చెప్పారు.

'మనకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి నేనున్నా అని ధైర్యం చెప్పే పర్సన్ ఫ్యామిలీలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. మా కుటుంబంలో మా నాన్న ఫ్యామిలీ స్టార్. డైరెక్టర్ పరశురామ్ ఈ కథ చెప్పినప్పుడు ఆయన లైఫ్ లోని అనుభవాలను ఊహించు కుంటూ చెప్పాడు. కథ వింటున్నప్పుడు మాత్రం నాకు మా నాన్న గుర్తొచ్చాడు. ఫ్యామిలీ కోసం ఆయన పడిన తపన గుర్తుకువచ్చింది. అందుకే ఈ సినిమాలో హీరో క్యారెక్టర్‌కు గోవర్ధన్ అనే పేరు పెట్టమని చెప్పాను. ఎందుకంటే ఆ పేరు పెట్టుకున్న తర్వాత ఎమోషన్స్ పలికించడం సులువు అవుతుంది. ఈనెల 5న ఫ్యామిలీ స్టార్ రిలీజ్ అవుతోంది. 8న నాన్న బర్త్ డే. ఈ సినిమా విషయంలో ఆయన గర్వపడతారని ఆశిస్తున్నా'.

- హీరో విజయ్ దేవరకొండ

నయా సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్



బి.జి. వెంచర్స్ పతాకంపై అజయ్, రవి ప్రకాష్, హర్షిణి, మాండవియా సెజల్ నటీనటులుగా తడకల వంకర్ రాజేష్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ 'కేసు నెం.15'. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైన సందర్భంగా చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నిర్మాత సి.కళ్యాణ్ ట్రైలర్‌ను విడుదల చేయగా, టి.యఫ్.సి.సి. ప్రెసిడెంట్ ప్రతాని రామకృష్ణ గౌడ్ టీజర్‌ను, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ లిరికల్ వీడియోను విడుదల చేశారు.
దర్శక, నిర్మాత తడకల వంకర్ రాజేష్ మాట్లాడుతూ,'మా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన పెద్దలకు ధన్యవాదాలు. ఈ సినిమాకు జాన్ మంచి మ్యూజిక్ ఇస్తే, ఆనం వెంకట్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ఇచ్చారు. ఇందులో నటించిన నటీనటులు, టెక్నీషియన్స్ అందరూ సహకరించడంతో సినిమా చాలా బాగా వచ్చింది. సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్‌గా సాగే ఈ సినిమాలో ప్రతి సీన్ చూసే ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేయడమే కాకుండా మమ్మల్ని నమ్మి సినిమాకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కచ్చితంగా నచ్చుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం' అని అన్నారు.
'పోలీస్ క్యారెక్టర్స్ కాకుండా డిఫరెంట్ రోల్స్‌లో నటిద్దాం అనుకున్న నాకు రాజేష్ చెప్పిన ఈ కథ చాలా ఇంట్రెస్ట్‌గా అనిపించింది. ఇందులో నా పాత్ర నాలా భిన్నంగా ఉంటుంది. ఈ సినిమా బిగ్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని నటుడు రవి ప్రకాష్ చెప్పారు. చిత్రం శ్రీను మాట్లాడుతూ, 'ఇందులో నాకు మంచి పాత్ర ఇచ్చారు. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.